
thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

## మహిళా అథ్లెట్.. పురుష కోచ్‌కు ఒకే గది!



11

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 164 | జగిత్యాల శనివారం 19 సెప్టెంబర్, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

## ఉప ఎన్నిక వచ్చినా సిద్ధమే!



- హైకోర్టు తీర్పును స్వాగతించిన దానం
- ఎన్నికల పోరు కొత్తేమీ కాదని వ్యాఖ్య
- మళ్లీ పోటీ చేస్తానని స్పష్టీకరణ
- సుప్రీంకోర్టుకు వెళ్లే ఆలోచన లేదని వెల్లడి

2




# రైతాంగానికి అండగా ఉంటాం

### ఎల్నినోపై రైతులకు ముందే అప్రమత్తం చేశాం

### తాగునీటికే తొలి ప్రాధాన్యత

- పంటల ఎంపికపై ముందస్తు సూచనలు
- కృష్ణా జలాల్లో న్యాయమైన వాటా సాధిస్తాం
- శాసనసభలో మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి
- కృష్ణా జలాల్లో వాటా సాధిస్తామని స్పష్టీకరణ
- సింగూరుపై ప్రత్యామ్నాయ ప్రణాళిక సిద్ధం: సీతక్క

> రాష్ట్రంలోని అన్నదాతలకు ప్రభుత్వం ఎల్లవేళలా వెన్నుదన్నుగా నిలుస్తుందని, ఎల్‌నినో తీవ్రత మరియు సాగునీటి కొరతపై రైతులకు ముందే అవగాహన కల్పించామని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఎల్‌నినోపై శాసనసభలో శుక్రవారం జరిగిన స్వల్పకాలిక చర్చలో ఆయన మాట్లాడుతూ, ప్రజల తాగునీటి అవసరాలకే ప్రభుత్వం తొలి ప్రాధాన్యత ఇస్తుందని, తాగునీటి అవసరాలు తీరిన తర్వాతే మిగులు జలాలను సాగుకు విడుదల చేస్తామని వెల్లడించారు.



అసెంబ్లీ సమావేశాలు నిరవధిక వాయిదా..

2

**హైదరాబాద్, సెప్టెంబర్ 18 (చురకలు):** ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ రైతాంగాన్ని ఒంటరిగా వదిలిపెట్టబోమని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం శాసనసభలో 'ఎల్‌నినో ప్రభావం-నివారణ చర్యలు'పై జరిగిన స్వల్పకాలిక చర్చలో ఆయన మాట్లాడారు. వర్షపాతం తగ్గే అవకాశం, సాగునీటి కొరతపై రైతులను ముందుగానే అప్రమత్తం చేశామని, నీటి లభ్యతకు అనుగుణంగా పంటల ఎంపికపై సూచనలు ఇచ్చామని తెలిపారు. ఆయకట్టు వారీగా నీటి లభ్యతపై సమాచారం అందిస్తున్నామని, 'రైతు నేస్తం' ద్వారా జలాశయాల పరిస్థితిని రైతులకు వివరిస్తున్నామని చెప్పారు. నీరు అందుబాటులో లేని చోట పంటలు వేయమని చెప్పడం బాధ్యతారాహిత్యమవుతుందని వ్యాఖ్యానించారు. ప్రజల తాగునీటి అవసరాలకే తొలి ప్రాధాన్యం ఇస్తామని, అవి తీరిన తర్వాతే అందుబాటులో ఉన్న నీటిని సాగుకు విడుదల చేస్తామని స్పష్టం చేశారు. వచ్చే వేసవిని దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే నీటి నిల్వలను పరిరక్షిస్తున్నామని తెలిపారు.

మిగతా 2 లో

# దానం నాగేందర్‌పై అనర్హత వేటు



- ఖైరతాబాద్ ఎమ్మెల్యే పదవి కోల్పోయిన దానం
- స్పీకర్ ట్రిబ్యునల్ ఉత్తర్వులు కొట్టివేత
- 2024 ఏప్రిల్ 23 నుంచే అనర్హత వర్తింపు
- ఖైరతాబాద్ స్థానం ఖాళీగా ప్రకటించిన హైకోర్టు
- తీర్పుపై స్టే ఇచ్చేందుకు ధర్మాసనం నిరాకరణ

**హైదరాబాద్, సెప్టెంబర్ 18 (చురకలు):** ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేస్తూ తెలంగాణ హైకోర్టు శుక్రవారం కీలక తీర్పు వెలువరించింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా గెలిచిన దానం.. ఎమ్మెల్యేగా కొనసాగుతూనే 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేయడాన్ని పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం ఆయనను అనర్హుడిగా ప్రకటించింది. దానం అనర్హత 2024 ఏప్రిల్ 23 నుంచే అమల్లోకి వస్తుందని స్పష్టం చేసింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్

మిగతా 2 లో

## ఎర్రవల్లి పరిధిలో 388 ఎకరాల్లో సర్వే ముమ్మరం

నాలుగు బృందాలుగా రంగంలోకి సర్వేయర్లు

325 సర్వే నంబర్ లో హద్దుల పరిశీలన

ఎర్రవల్లి 325 సర్వే నంబర్ భూములపై ఉత్కంఠ



2

## వర్షాభావంపై కేంద్రం ఆదుకోవాలి

- శివరాజ్ సింగ్ చౌహాన్‌కు సీఎం రేవంత్ వినతి
- ఎల్‌నినోతో వ్యవసాయ విద్యుత్ వినియోగం పెరిగిందని వెల్లడి
- ప్రత్యామ్నాయ పంటలకు కేంద్ర సహకారం కోరిన సీఎం



2



## ఆర్టీసీలో మోగిన ఎన్నికల నగారా

3

## మొదట ఓటు చోరీ.. ఇప్పుడు పార్టీ చోరీ!

- ఎన్నికల సంఘంపై రాహుల్ తీవ్ర విమర్శలు
- తృణమూల్ పేరు, గుర్తు ఫ్రీజ్‌పై ఆగ్రహం
- బీజేపీ-ఈసీ చేతులు కలిపాయని ఆరోపణ
- ప్రజల తీర్పును కాపాడాలని డిమాండ్
- స్వేచ్ఛాయుత ఎన్నికల కోసం పోరాడతామని వెల్లడి

4





### 22ఏ భూముల వివాదాల పరిష్కారానికి

## హైలెవల్ కమిటీ

- ముగ్గురు సీనియర్ అధికారులతో కమిటీ ఏర్పాటు
- సీసీఎల్ఏ కమిషనర్ లోకేష్ కుమార్‌కు చైర్మన్ బాధ్యతలు
- పాపిరెడ్డి, రాజీవ్ గాంధీ హనుమంతు సభ్యులుగా నియామకం
- రేవంత్ కుటుంబ భూముల లెక్కలూ బయటపెడతామన్న కేటీఆర్, హరీశ్

2




## నేను స్వతంత్రుడిని


- ఏఐ మోడల్ దుందుడుకు!
- ఆరు అనూహ్య ఘటనలను బయటపెట్టిన ఓపెన్‌ఏఐ
- సూచనలను దాటేసేలా సొంత ఆదేశాలు రాసుకున్న పరిశోధనా మోడల్




.. వివరాలు 4లో

## దేశ రాజధాని ఢిల్లీలో దారుణం

- 16 ఏళ్ల బాలికపై సామూహిక అత్యాచారం, హత్య..
- రెండు రోజుల తర్వాత మృతదేహం గుర్తింపు
- నలుగురు నిందితుల్లో ముగ్గురు మైనర్లు



.. వివరాలు 4లో

## సృష్టి ఉన్నంతవరకూ ధర్మం ఉంటుంది

- సమస్త సంతోషానికీ ధర్మమే మూలం: మోహన్ భాగవత్
- యువత ధర్మంపై చర్చించడం సంతోషకరమని వ్యాఖ్య
- అహంకారం, అపోహలను వీడాలని సూచన

4






# 22ఏ భూముల వివాదాల పరిష్కారానికి హైలెవల్ కమిటీ

**హైదరాబాద్, సెప్టెంబర్ 18:** తెలంగాణలో వివాదాస్పదంగా మారిన 22ఏ నిషేధిత భూముల సమస్య పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాల మేరకు ముగ్గురు సీనియర్ అధికారులతో కమిటీని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నిషేధిత జాబితాలో చేరిన భూములకు సంబంధించిన వివాదాలను పరిశీలించి, బాధితులకు పరిష్కారం చూపే విధంగా కమిటీ విధివిధానాలను రూపొందించనుంది. సీసీఎల్ఏ కమిషనర్ లోకేష్ కుమార్ కమిటీకి చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. పాపిరెడ్డి, రాజీవ్ గాంధీ హనుమంతు సభ్యులుగా ఉంటారు. 22ఏ జాబితాలో పొరపాటుగా చేరిన ప్రైవేట్ భూములు, నిషేధిత భూములకు సంబంధించిన ఇతర వివాదాలను పరిశీలించి తగిన పరిష్కార మార్గాలను కమిటీ సూచించనుంది. రాష్ట్రంలో అటవీ, అసైన్డ్, దేవాదాయ శాఖలకు చెందిన 1.02 కోట్ల ఎకరాలు 22ఏ నిషేధిత జాబితాలో ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల అసెంబ్లీలో పేర్కొన్నారు. వీటిని తొలగించే అధికారం మంత్రులకు కూడా లేదని స్పష్టం చేశారు. నిజాం కాలం నుంచి కొనసాగుతున్న భూ సమస్యలపై సమగ్రంగా చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్ ద్వారా 2.50 కోట్ల ఎకరాల భూముల వివరాలు విదేశీ మాఫియా చేతుల్లోకి వెళ్లాయని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ప్రభుత్వ భూములను రిజిస్ట్రేషన్ చేయడం, అధికారుల పొరపాట్లతో ప్రైవేట్ భూములు 22ఏ జాబితాలో చేరడం వల్ల సమస్యలు ఏర్పడ్డాయని తెలిపారు. 22ఏ జాబితాలో 12 అంశాలను గుర్తించామని, సభ్యుల సూచనల ఆధారంగా పేదలకు న్యాయం చేస్తామని సీఎం తెలిపారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై బీఆర్ఎస్ నేతలు అసత్య ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణ ఉద్యమకారులు నష్టపోతే కేసీఆర్ కుటుంబం మాత్రం వేల కోట్లు, వందల ఎకరాల ఆస్తులు సంపాదించిందని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కల్వకుంట్ల కుటుంబం, వారి బంధువుల పేరిట తొమ్మిది జిల్లాల్లో ఉన్న 439.30 ఎకరాల భూముల వివరాలను సర్వే నంబర్లతో సహా అసెంబ్లీలో వెల్లడించారు. ఎర్రవల్లి ఫాంహౌస్ భూముల్లో ప్రభుత్వ భూములతో పాటు రైతుల నుంచి తీసుకున్న భూములు ఉన్నాయనే ఆరోపణలపై 30 రోజుల్లో విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని సిద్దిపేట కలెక్టర్‌ను ఆదేశించినట్లు తెలిపారు. దీనిపై కేటీఆర్, హరీశ్‌రావు స్పందిస్తూ రేవంత్‌రెడ్డి కుటుంబం పేరిట కూడా వందల ఎకరాల భూములు ఉన్నాయని ఆరోపించారు. వాటికి సంబంధించిన వివరాలను త్వరలోనే ప్రజల ముందుంచుతామని వారు ప్రకటించారు.

# ఎర్రవల్లి పరిధిలో 388 ఎకరాల్లో సర్వే ముమ్మరం

**మర్కూక్, సెప్టెంబర్ 18 (ఉద్యమ కెటరం):** మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్ హౌస్ పరిధిలోని భూములపై రెవెన్యూ అధికారులు సర్వేను ముమ్మరం చేశారు. మర్కుక్ మండలం 325 సర్వే నంబర్ పరిధిలోని 388 ఎకరాల భూమిలో బుధవారం సర్వేయర్లు నాలుగు బృందాలుగా జిల్లా సర్వేయర్ అనిల్, శంకర్, డివిజన్ సర్వేయర్ వంశీ, మండల సర్వేయర్ ప్రజ్వల సర్వే చేపట్టారు. ఫీల్డ్ లో సర్వే చేస్తుండగా మర్కుక్ తహసీల్దార్ కార్యాలయంలో మరికొందరు సర్వేయర్లు ఉంటూ ఫీల్డ్ లో ఉన్న బృందాలకు ఎప్పటికప్పుడు గైడెన్స్ ఇస్తూ సమాచారం సేకరించారు. ఈ సర్వేలో ప్రభుత్వ ఉన్నతాధికారులు నేరుగా పాల్గొనలేదు. 325 సర్వే నంబర్ లో మొత్తం 388ఎకరాల భూమి ఉంది. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన రైతులు మాట్లాడుతూ 325 సర్వే నంబర్ లో కేసీఆర్ పేరు మీద గానీ, ఆయన కబ్జా చేసింది గానీ ఇంచు కూడా లేదు అని, అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడింది తప్పు అని చెప్పారు. మరికొందరు రైతులు 325 సర్వే నంబర్ పరిధిలో దాదాపు 80 నుండి 90 ఎకరాల్లో చెరువు తవ్వించి దానికి పాండురంగ డ్యాం అని నామకరణం చేశారని, ఆ చెరువు కింద భూములు కోల్పోయిన తమకు ఇంకోచోట భూమి ఇప్పిస్తానని చెప్పి ఇప్పటివరకు ఇప్పించలేదని ఆరోపించారు. 325 సర్వే నంబర్ లోని లావణి పట్టా భూములు 388 ఎకరాలను తమ పేరు మీద శాశ్వతంగా పట్టా చేయాలని, తమ ఆధీనంలో ఉన్న భూముల జోలికి రావద్దని రైతులు సర్వే బృందాలకు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సర్వే అధికారులు సేవ్య నాయక్ డిప్యూటీ ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ 325 సర్వే నంబర్ లో ప్రభుత్వ భూమి పూర్తి విస్తీర్ణం 388.5 గుంటల భూమి ఇది మూడు గ్రామాల శివారులను శివార్ వెంకటాపూర్, వరదరాజపూర్ ఎర్రవల్లి ఆనుకొని ఉన్నదని, ఎర్రవల్లి భూమిని సర్వే చేయమని అధికారులు ఆదేశించారని తెలిపారు. ఈ సందర్భంగా సర్వే బృందాలు ఇక్కడికి చేరుకొని నాలుగు బృందాలుగా ఏర్పడి డిజిపిఎస్ రోవర్తో సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం రి సర్వే చేయమని చెప్పడంతో డీజిపిఎస్ టెక్నాలజీతోనే నిర్వహిస్తున్నామని, ప్రతిది క్షుణ్ణంగా శాటిలైట్ ద్వారా పాయింట్లు తీసుకోవడం జరిగింది. దీని పూర్తి మ్యాపు తయారు చేసిన తర్వాత దీంట్లో వచ్చిన చెరువు, కెనాల్ సాగుకు ఉపయోగపడని భూమి, ఉపయోగపడే భూమి ఎంత ఉన్నది అనేది దాని మీద పూర్తి సమాచారం కొరకు ఈ సర్వే నిర్వహిస్తున్నాం అని, రైతులు ఎలాంటి ఇబ్బందులు పెట్టకుండా సర్వేకు సహకరిస్తున్నారని తెలిపారు.

# తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు నిరవధిక వాయిదా..

**హైదరాబాద్, సెప్టెంబర్ 18 (చురకలు):** 8రోజుల పాటు వాడీవేడిగా సాగిన తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. మొత్తం 51 గంటల 52 నిమిషాల పాటు కొనసాగిన సభలో ప్రశ్నలు, చర్చలు, సభ్యుల ప్రసంగాలు, ప్రభుత్వ ప్రకటనలు, బిల్లుల ఆమోదంతో కీలక అంశాలు చర్చకు వచ్చాయి. మూడు ప్రభుత్వ తీర్మానాలకు సభ ఆమోదం తెలిపింది. అలాగే సభ ముందుకు వచ్చిన నాలుగు బిల్లులకూ ఆమోదం లభించింది. సెప్టెంబర్ 7న ప్రారంభమైన తెలంగాణ అసెంబ్లీ సమావేశాల తొలిరోజే అసెంబ్లీ ప్రధాన గేటు వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ప్రభుత్వ హామీల అమలును నిరసిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నల్ల దుస్తులు, నినాదాలు ఉన్న నల్ల టీషర్టులతో అసెంబ్లీకి చేరుకున్నారు. వారిని పోలీసులు అసెంబ్లీ ప్రాంగణంలోకి వెళ్లకుండా అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. సమావేశాల్లో నాలుగు స్వల్పకాలిక చర్చలు కూడా జరిగాయి. ఇక 119 మంది సభ్యులున్న తెలంగాణ అసెంబ్లీలో ప్రస్తుతం పార్టీల బలాబలాల విషయానికి వస్తే.. కాంగ్రెస్‌కు 66 మంది, బీఆర్ఎస్‌కు 37 మంది, బీజేపీకి 8 మంది, ఎంఐఎంకు 7 మంది, సీపీఐకి ఒక సభ్యుడు ఉన్నారు.

# రైతాంగానికి అండగా ఉంటాం

మొదటి పేజీ తరువాయి

ప్రతి ప్రాజెక్టుకు ప్రత్యేక నీటి బడ్జెట్‌ను అమలు చేస్తున్నామని చెప్పారు. గత ఏడాది ఇదే సమయంతో పోలిస్తే ప్రధాన జలాశయాల్లో నీటి నిల్వలు భారీగా తగ్గాయని ఉత్తమ్ సభకు వివరించారు. శ్రీశైలంలో గత ఏడాది 153.56 టీఎంసీల నీరు ఉండగా ప్రస్తుతం సుమారు 61 టీఎంసీలు, నాగార్జునసాగర్‌లో 174 టీఎంసీల నుంచి సుమారు 44 టీఎంసీలకు నిల్వలు తగ్గాయని తెలిపారు. కృష్ణా, గోదావరి బేసిన్లలో కలిపి 585 టీఎంసీల లైవ్ స్టోరేజీ సామర్థ్యానికి ప్రస్తుతం 241 టీఎంసీలే అందుబాటులో ఉన్నాయని, గత ఏడాది ఇదే సమయంలో 497 టీఎంసీలు ఉన్నాయని వివరించారు. రాష్ట్రంలోని 44,034 చెరువుల్లో సుమారు 40 శాతం చెరువులు పావు సామర్థ్యం కన్నా తక్కువగా నిండాయని మంత్రి పేర్కొన్నారు. జలాశయాల్లో కనిపించే మొత్తం నీటినీ సాగుకు వినియోగించడం సాధ్యం కాదని, తాగునీరు, డెడ్ స్టోరేజీ తదితర అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందని వివరించారు.

## 'కృష్ణాలో ఒక్క చుక్కా వదులుకోం'

కృష్ణా జలాల్లో తెలంగాణకు న్యాయమైన వాటాను సాధించి తీరుతామని ఉత్తమ్ పేర్కొన్నారు. రాష్ట్రానికి రావాల్సిన ఒక్క చుక్క నీటినీ వదులుకోబోమని చెప్పారు. ట్రిబ్యునల్, కృష్ణా నదీ యాజమాన్య బోర్డు, కేంద్ర ప్రభుత్వం వద్ద రాష్ట్ర వాదనలను బలంగా వినిపిస్తున్నామని తెలిపారు. గతంలో అమలైన 66:34 తాత్కాలిక నిష్పత్తిని శాశ్వత హక్కుగా అంగీకరించలేదని, 50:50 పంపిణీ కోసం తెలంగాణ వాదిస్తోందని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై మాట్లాడుతూ మేడిగడ్డ ఏడో బ్లాక్ దెబ్బతినడంతో నీటి మళ్లింపుపై ప్రభావం పడిందన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల విషయంలో జాతీయ డ్యామ్ భద్రతా సంస్థ సూచనలను పాటిస్తామని చెప్పారు. ప్రజల భద్రతను పణంగా పెట్టి వాటిని వినియోగించలేమని, ఎన్‌డీఎస్ఏ, కేంద్ర జలసంఘం మార్గదర్శకాల ప్రకారమే పునరుద్ధరణ చేపడతామని తెలిపారు. సురక్షితంగా ఉన్న కాళేశ్వరం లింక్--2 ద్వారా పంపింగ్ కొనసాగిస్తున్నట్లు చెప్పారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు 90 శాతం పూర్తయిందన్న బీఆర్ఎస్ వాదనను ఉత్తమ్ తోసిపుచ్చారు. పంప్‌హౌస్‌లు నిర్మించినంత మాత్రాన ఎత్తిపోతల పథకం పూర్తయినట్లు కాదని, కాలువలు, పంపిణీ వ్యవస్థ, భూసేకరణ, పునరావాస పనులు ఇంకా పూర్తికావాల్సి ఉందని పేర్కొన్నారు. చట్టబద్ధ అనుమతులు, మిగిలిన పనులు పూర్తిచేసి ప్రాజెక్టును వినియోగంలోకి తీసుకొస్తామని తెలిపారు. పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను ప్రాధాన్య క్రమంలో పూర్తి చేయడంతోపాటు కాలువలు, పంపింగ్ వ్యవస్థల మరమ్మతులను వేగవంతం చేస్తామని చెప్పారు.

## సింగూరుపై ప్రత్యేక ప్రణాళిక: సీతక్క

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క మాట్లాడుతూ వచ్చే వర్షాకాలం వరకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. రాష్ట్రంలో తాగునీటి కోసం 34 జలాశయాలను వినియోగిస్తున్నామని, వాటిలో నీటిమట్టాలను ప్రతిరోజూ పర్యవేక్షిస్తూ నీటిపారుదల శాఖతో వారానికోసారి సమన్వయ సమావేశాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. సింగూరు జలాశయంలో ప్రస్తుతం ఉన్న నీరు సుమారు 75 రోజులకు సరిపోతుందని, ఆ తర్వాత కూడా వర్షాలు లేకపోతే ఎదు-రయ్యే పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ప్రత్యామ్నాయ ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. సింగూరుపై నాలుగు జిల్లాల్లోని 2,395 గ్రామీణ ఆవాసాలు, 19 పట్టణ స్థానిక సంస్థలు ఆధారపడి ఉన్నాయని పేర్కొన్నారు. అవసరమైతే చేతిపంపులు, సింగిల్‌ఫేజ్, త్రీఫేజ్ పథకాలు, బావులు, అద్దె బోర్లు, సమీప నీటి వనరుల నుంచి తరలింపు వంటి చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు తగ్గకుండా ఉపాధి హామీ పనులను పెద్దఎత్తున చేపడుతున్నామని సీతక్క చెప్పారు. ప్రతి గ్రామ పంచాయతీలో కనీసం 60 కుటుంబాలకు పని కల్పించాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఏప్రిల్ నుంచి జూన్ వరకు రోజుకు సగటున 12 లక్షల మంది, జూలై నుంచి రోజుకు సగటున రెండు లక్షల మంది ఉపాధి పనులకు హాజరయ్యారని పేర్కొన్నారు. ఇప్పటివరకు రూ.2 వేల కోట్లకు పైగా వేతనాలను నేరుగా కూలీలకు చెల్లించినట్లు చెప్పారు. 'ఇంటింటికీ ఇంకుడు గుంత.. ప్రతి పొలానికి పంట కుంట.. ప్రతి ఊరికి ఊట కుంట' లక్ష్యంతో నీటి సంరక్షణ పనులు చేపడుతున్నామని సీతక్క వివరించారు.



# వర్షాభావంపై కేంద్రం ఆదుకోవాలి

## శివరాజ్ సింగ్ చౌహాన్‌కు సీఎం రేవంత్ వినతి

## ప్రత్యామ్నాయ పంటలకు సహకారం కోరిన సీఎం



**హైదరాబాద్, సెప్టెంబర్ 18 (చురకలు):** ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు కేంద్ర ప్రభుత్వం అవసరమైన సహకారం అందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కోరారు. దక్షిణ రాష్ట్రాల వ్యవసాయ సదస్సులో పాల్గొనేందుకు హైదరాబాద్ వచ్చిన కేంద్ర మంత్రితో సీఎం సమావేశమై రాష్ట్రంలోని పరిస్థితులను వివరించారు. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి సీఎం కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేశారు. వర్షాభావ పరిస్థితులతో వ్యవసాయ రంగంలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగిందని తెలిపారు. తాగునీరు, విద్యుత్ కొరత తలెత్తకుండా రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసిందని వివరించారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులను ప్రత్యామ్నాయ పంటలు, పంటల మార్పిడి వైపు ప్రోత్సహిస్తున్నామని సీఎం తెలిపారు. ఇందుకు కేంద్రం సహకరించాలని కోరారు. ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించే లక్ష్యంతో 250 ఎకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో పండ్లు, కూరగాయల మార్కెట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ్ కింద తొలి విడతలో తెలంగాణకు రెండు లక్షల ఇళ్లు కేటాయించినందుకు శివరాజ్ సింగ్ చౌహాన్‌కు సీఎం కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో 11,56,915 అర్హులైన గ్రామీణ కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేయాలని గత జూలైలో ఢిల్లీలో కేంద్ర మంత్రికి వినతిపత్రం ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. తాజాగా మిగిలిన సుమారు 9.56 లక్షల ఇళ్లను కూడా రాష్ట్రానికి కేటాయించాలని కోరారు. పేదలకు రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం అందించడంతోపాటు సన్న వడ్లు పండించే రైతులకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తున్న విషయాన్ని కూడా సీఎం కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వర్షాభావ పరిస్థితుల్లో రైతులకు అండగా నిలిచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయం అవసరమని పేర్కొన్నారు.

# దానం నాగేందర్‌పై అనర్హత వేటు

మొదటి పేజీ తరువాయి

అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్‌తో కూడిన ధర్మాసనం ఈ తీర్పు ఇచ్చింది. దానం నాగేందర్‌పై దాఖలైన అనర్హత పిటిషన్లను తిరస్కరిస్తూ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ నేతృత్వంలోని ట్రిబ్యునల్ ఇచ్చిన ఉత్తర్వులను హైకోర్టు కొట్టివేసింది. దానం నాగేందర్ అనర్హతతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయినట్లు ధర్మాసనం ప్రకటించింది. తీర్పు ప్రతిని అసెంబ్లీ కార్యదర్శితోపాటు స్పీకర్, ఎన్నికల సంఘానికి పంపించాలని రిజిస్ట్రీని ఆదేశించింది. దీంతో ఖైరతాబాద్ స్థానానికి ఉప ఎన్నిక నిర్వహణకు మార్గం ఏర్పడింది. హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేసేందుకు అవకాశం కల్పిస్తూ అప్పటివరకు ఉత్తర్వుల అమలును నిలిపివేయాలని దానం తరఫు న్యాయవాదులు కోరారు. అయితే ఈ అభ్యర్థనను ధర్మాసనం తిరస్కరించింది. హైకోర్టు తీర్పును బీజేపీ నేతలు స్వాగతించారు. పార్టీ ఫిరాయింపుల అంశంపై తాము చేసిన న్యాయపోరాటానికి ఈ తీర్పుతో ఫలితం దక్కిందని ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. పార్టీ మారిన ఇతర ఎమ్మెల్యేలతోనూ రాజీనామా చేయించి ప్రజల తీర్పు కోరాలని కాంగ్రెస్‌ను డిమాండ్ చేశారు. ప్రతివాదులు సుప్రీంకోర్టును ఆశ్రయించే అవకాశం దృష్ట్యా బీజేపీ తరఫున కేవియట్ దాఖలు చేయనున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా, తీర్పు వెలువడిన తర్వాత దానం నాగేందర్ స్పందిస్తూ హైకోర్టు నిర్ణయాన్ని స్వాగతిస్తున్నానని, మళ్లీ ఎన్నికలు వస్తే పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పారు. సుప్రీంకోర్టును ఆశ్రయించే అంశంపై ఇంకా ఆలోచించలేదని పేర్కొన్నారు.

# ఉప ఎన్నిక వచ్చినా సిద్ధమే



## హైకోర్టు తీర్పును స్వాగతించిన దానం

## ఎన్నికల పోరు కొత్తేమీ కాదని వ్యాఖ్య

## మళ్లీ పోటీ చేస్తానని స్పష్టీకరణ

## సుప్రీంకోర్టుకు వెళ్లే ఆలోచన లేదని వెల్లడి

**హైదరాబాద్, సెప్టెంబర్ 18 (చురకలు):** ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా తనను అనర్హుడిగా ప్రకటిస్తూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్లు దానం నాగేందర్ తెలిపారు. ఖైరతాబాద్‌లో ఉప ఎన్నిక జరిగితే మళ్లీ పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. ఎన్నికల్లో పోరాడటం తనకు కొత్త కాదని, మళ్లీ ప్రజాక్షేత్రంలోనే తేల్చుకుంటానని చెప్పారు. హైకోర్టు తీర్పు అనంతరం శుక్రవారం దానం నాగేందర్ మీడియాతో మాట్లాడారు. "యుద్ధం నాకేం కొత్త కాదు. మళ్లీ పోరాడతా.. మళ్లీ గెలుస్తా" అంటూ ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గ ప్రజల మద్దతు తనకే ఉంటుందన్న విశ్వాసాన్ని వెల్లడించారు. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ ప్రస్తుతానికి సుప్రీంకోర్టును ఆశ్రయించే ఆలోచన లేదని దానం స్పష్టం చేశారు. అనర్హత తీర్పుపై తాను ఆందోళన చెందడం లేదని, రాబోయే పరిణామాలను రాజకీయంగా, చట్టబద్ధంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. బీఆర్ఎస్ తరఫున 2023లో ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా ఎన్నికైన దానం నాగేందర్.. 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా సికింద్రాబాద్ నుంచి పోటీ చేశారు. ఈ వ్యవహారంపై దాఖలైన అనర్హత పిటిషన్లలో హైకోర్టు శుక్రవారం ఆయనను అనర్హుడిగా ప్రకటించింది.

# విజిలెన్స్‌కు కొత్త పవర్

## రెండు విభాగాలుగా పునర్వ్యవస్థీకరణ!

## క్షేత్రస్థాయి తనిఖీలకు గ్రేహౌండ్స్, ఆక్టోపస్ కమాండోలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 18 (చురకలు):** తెలంగాణ రాష్ట్రంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం కీలక సంస్కరణలకు శ్రీకారం చుడుతోంది. ఇందులో భాగంగా విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్‌లను రెండు ప్రత్యేక రంగాలుగా విభజించి, ఒక్కో విభాగానికి ఒక్కో డైరెక్టర్‌ను నియమించాలని యోచిస్తోంది. కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) స్కామ్‌లో రూ.1,700 కోట్ల మేర ధాన్యం ఎగవేతకు పాల్పడిన మిల్లర్లపై విజిలెన్స్ బృందాలు దాడులు జరిపి, ఇప్పటికే రూ.1,000 కోట్లకు పైగా వసూలు చేశాయి. ఈ క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ శాఖను బలోపేతం చేసే ప్రక్రియ వేగవంతమైంది. ప్రస్తుతం అదనపు డీజీపీ డీఎస్ చౌహాన్ ఈ విభాగానికి డీజీగా వ్యవహరిస్తుండగా, ఐజీపీగా పదవీ విరమణ పొందిన ఏఆర్ శ్రీనివాస్ డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. కొత్త విధివిధానాల ప్రకారం రెండు డైరెక్టర్ పోస్టులు ఖరారైతే.. విజిలెన్స్ విభాగం పర్యవేక్షణను ఏఆర్ శ్రీనివాస్‌కు, ఎన్‌ఫోర్స్‌మెంట్ బాధ్యతలను ఐజీ అభిషేక్ మహంతికి అప్పగించే అవకాశం ఉంది. మరోవైపు రాష్ట్రంలోని 8 ప్రాంతీయ కార్యాలయాల్లో (ఆర్‌వీఈఓ) 92 ఖాళీ పోస్టులను భర్తీ చేయడంతో పాటు 6 కొత్త వాహనాలను సమకూర్చాలని ప్రతిపాదించారు. మిల్లుల్లో విస్తృత తనిఖీల కోసం ఇటీవల కేటాయించిన గ్రేహౌండ్స్, ఆక్టోపస్ విభాగాలకు చెందిన 79 మంది కమాండోలను క్షేత్రస్థాయి పరిశీలనలకు సమర్థవంతంగా ఉపయోగిస్తున్నారు.

# ఆర్టీసీలో మోగిన ఎన్నికల నగారా

- అక్టోబర్ 9న పోలింగ్, 17న ఫలితాలు
- గుర్తింపు సంఘం ఎన్నికలకు షెడ్యూల్
- ఈ నెల 21 నుంచి ఎన్నికల ప్రక్రియ
- రీజియన్, రాష్ట్ర స్థాయిలో వేర్వేరు బ్యాలెట్లు

**హైదరాబాద్, సెప్టెంబర్ 18 (చురకలు):** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో ఎన్నికల శంఖారావం మోగింది. దాదాపు ఎనిమిదేళ్లుగా కార్మికులు ఎదురుచూస్తున్న గుర్తింపు సంఘం ఎన్నికలకు ఎట్టకేలకు ఆర్టీసీ యాజమాన్యం పచ్చజెండా ఊపింది. ఈ మేరకు ఎన్నికల షెడ్యూల్‌ను అధికారులు విడుదల చేశారు. ఈ నెల 21 నుంచి ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కానుండగా.. అక్టోబరు 9న పోలింగ్ నిర్వహించనున్నారు. అక్టోబరు 17న ఓట్ల లెక్కింపు పూర్తి చేసి విజేతలను ప్రకటించనున్నారు. చివరిసారిగా ఆర్టీసీలో 2016 జులై 19న గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగాయి. ఆ తర్వాత ఎన్నికలు జరగకపోవడంతో సుదీర్ఘ విరామం ఏర్పడింది. కార్మికుల తరఫున యాజమాన్యంతో అధికారికంగా చర్చించే గుర్తింపు సంఘం లేకుండానే ఇన్నేళ్లు గడిచిపోయాయి. ఇప్పుడు మళ్లీ ఎన్నికలకు రంగం సిద్ధం కావడంతో ఆర్టీసీ కార్మిక సంఘాల్లో సందడి మొదలైంది.

### గుర్తింపు సంఘం అంటే..?

ఆర్టీసీలో అనేక కార్మిక సంఘాలు, యూనియన్లు ఉన్నప్పటికీ ఎన్నికల్లో విజయం సాధించిన సంఘానికే చట్టబద్ధమైన 'గుర్తింపు సంఘం' హోదా దక్కుతుంది. ఈ ఎన్నికలను రీజియన్, రాష్ట్ర స్థాయిల్లో వేర్వేరుగా నిర్వహిస్తారు. రెండు స్థాయిలకు సంబంధించి ఓటర్లకు వేర్వేరు బ్యాలెట్ పత్రాలు అందిస్తారు. కార్మికుల హక్కుల పరిరక్షణలో గుర్తింపు సంఘానిదే కీలక పాత్ర. వేతనాల పెంపు, జీతాల సవరణ, బోనస్‌లు, కరువు భత్యం, పెండింగ్ బకాయిలు, సర్వీసు నిబంధనల్లో మార్పులు, డిపోల పనివేళలు తదితర కీలక సమస్యలపై ఆర్టీసీ యాజమాన్యం, ప్రభుత్వంతో అధికారికంగా చర్చలు జరిపే చట్టబద్ధమైన అవకాశం గుర్తింపు సంఘానికి ఉంటుంది. కార్మికుల సంక్షేమానికి సంబంధించిన అంశాల్లో యాజమాన్యంతో ఒప్పందాలు చేసుకోవడంలోనూ ఈ సంఘం కీలకంగా వ్యవహరిస్తుంది.

# సభను అగౌరవపరిచిన బీఆర్ఎస్

- శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు
- సమావేశాలకు రాకూడదనే ఉద్దేశంతోనే నిబంధనల ఉల్లంఘన
- స్పీకర్‌ను దూషించడం అప్రజాస్వామికం
- మాక్ అసెంబ్లీ దుర్మార్గమైన చర్య
- భూకబ్జాలపై హైపవర్ కమిటీ.. నెల రోజుల్లో నివేదిక
- నిరవధికంగా వాయిదా పడిన అసెంబ్లీ




**హైదరాబాద్, సెప్టెంబర్ 18 (చురకలు):** శాసనసభ సమావేశాలకు హాజరయ్యే ఉద్దేశం లేకనే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉద్దేశపూర్వకంగా సభా నియమాలను ఉల్లంఘించారని రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు మండిపడ్డారు. సభ సజావుగా సాగకూడదన్న కుట్రతోనే వారు ఆటంకాలు సృష్టించారని విమర్శించారు. ఎనిమిది రోజుల పాటు జరిగిన అసెంబ్లీ సమావేశాలు శుక్రవారంనిరవధికంగా వాయిదా పడిన అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. టీ షర్టులపై స్లోగన్స్ రాసుకుని రావడం నిబంధనలకు విరుద్ధమని తెలిసీ కేవలం ప్రచారం కోసం బీఆర్ఎస్ నేతలు సభా సంప్రదాయాలను తుంగలో తొక్కారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో వారి ప్రభుత్వ హయాంలోనే ప్లకార్డులు, స్లోగన్స్‌తో సభలోకి రాకూడదని అప్పటి స్పీకర్ రూలింగ్ ఇచ్చారని, కొత్త రూల్స్ తెచ్చారని గుర్తుచేశారు. ఆ విషయం తెలిసి కూడా సభా మర్యాదను మంటగలిపారని దుయ్యబట్టారు. శాసనసభ జరుగుతుండగానే బయట మాక్ అసెంబ్లీ నిర్వహించడం సభ గౌరవాన్ని అవహేళన చేయడమేనని, ఇది అత్యంత దుర్మార్గమైన చర్య అని మంత్రి అన్నారు. నెల రోజులు సభ నిర్వహించాలని కేటీఆర్ కోరడం ఉత్త మాటలే అని తేలిపోయిందన్నారు. ఎంతో అనుభవం ఉన్న నాయకులు స్పీకర్ పోడియం వద్దకు దూసుకెళ్లి ఆందోళన చేయడం కరెక్ట్ కాదన్నారు. స్పీకర్‌ను దూషించడం అప్రజాస్వామికమని, ఈ ఘటన యావత్ తెలంగాణ సమాజం చూసిందని, ఇది స్పీకర్‌ను తీవ్ర మనస్తాపానికి గురిచేసిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

### భూకబ్జాలపై హైపవర్ కమిటీ

భూముల ఆక్రమణల వ్యవహారంపై విచారణ జరిపేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైపవర్ అధికారులతో కూడిన ఓ కమిటీని వేశారని శ్రీధర్ బాబు వెల్లడించారు. ఈ కమిటీ నెల రోజుల వ్యవధిలో 12 కీలక అంశాలపై దర్యాప్తు జరిపి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తుందని, ఆ నివేదిక ఆధారంగా కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.

### విజయవంతంగా ముగిసిన సమావేశాలు

ఈ నెల 7న ప్రారంభమైన శాసనసభ సమావేశాలు 18వ తేదీ వరకు విజయవంతంగా జరిగాయని, ప్రజా సంక్షేమ పథకాలకు సంబంధించిన అనేక అంశాలపై సుదీర్ఘ చర్చ జరిగిందని మంత్రి తెలిపారు. సభలో ప్రతి ఒక్కరికీ మాట్లాడే అవకాశం కల్పించామన్నారు. మొత్తం పని దినాలు: 8 రోజులు, సభ జరిగిన సమయం: 51 గంటల 52 నిమిషాలు మౌఖిక సమాధానాలు (మంత్రుల ద్వారా): 50. సమాధానం ఇచ్చిన స్టార్డ్ ప్రశ్నలు: 9 సమాధానం ఇచ్చిన అన్‌స్టార్డ్ ప్రశ్నలు: 1 సభ్యులు అడిగిన సప్లిమెంటరీ ప్రశ్నలు: 86 సభ్యుల ప్రసంగాలు: 105, మంత్రులు చేసిన ప్రకటనలు: 2, ఆమోదం పొందిన ప్రభుత్వ తీర్మానాలు: 3, సభలో ఆమోదం పొందిన బిల్లులు: 4, స్వల్పకాలిక చర్చలు: 4 సమాధానాలు అందని ప్రశ్నలు: స్టార్డ్ - 62, అన్‌స్టార్డ్ - 22 అని మంత్రి తెలిపారు

# దానం అనర్హత తీర్పుతో కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి బట్టబయలు

- హైకోర్టు తీర్పు స్పీకర్ వ్యవహారశైలిపై ప్రశ్నలు లేవనెత్తింది
- ప్రజల తీర్పును కాంగ్రెస్ ప్రభుత్వం గౌరవించలేదని హరీశ్‌రావు విమర్శ



**హైదరాబాద్, సెప్టెంబర్ 18 (చురకలు):** ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత కేసులో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వ ద్వంద్వ వైఖరిని స్పష్టం చేసిందని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. కాంగ్రెస్, ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ రాజ్యాంగ పరిరక్షణ విషయంలో అనుసరిస్తున్న తీరుపై ఎక్స్ వేదికగా ప్రశ్నలు సంధించారు. దానం నాగేందర్ బీఆర్ఎస్ అభ్యర్థిగా గెలిచి అనంతరం కాంగ్రెస్‌లో చేరారని హరీశ్‌రావు గుర్తుచేశారు. కాంగ్రెస్ తరఫున లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన సమయంలోనూ ఎమ్మెల్యే పదవిలో కొనసాగారని పేర్కొన్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పు పవిత్రతను కాపాడాల్సిన బాధ్యతను విస్మరించి, స్పీకర్ నిర్ణయం ద్వారా ఆయనకు రక్షణ కల్పించే ప్రయత్నం జరిగిందని ఆరోపించారు. ఈ వ్యవహారంలో హైకోర్టు జోక్యం చేసుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వానికి తీరని మచ్చగా మిగిలిందన్నారు.

### రాహుల్ హామీపై నిలదీత

2024 ఎన్నికల మేనిఫెస్టోలో పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన ప్రజాప్రతినిధులపై స్వయంచాలకంగా అనర్హత వేటు పడేలా పదో షెడ్యూల్‌ను సవరించాలని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని హరీశ్‌రావు గుర్తుచేశారు. రాజ్యాంగ పరిరక్షణ గురించి దేశవ్యాప్తంగా మాట్లాడుతున్న రాహుల్ గాంధీకి, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఫిరాయింపులు జరిగినప్పుడు అదే నిబద్ధత ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు. రాజకీయ అవసరాలకు అనుగుణంగా రాజ్యాంగంపై వైఖరి మారుతోందా అని నిలదీశారు.

### ఇతర ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

హైకోర్టు తీర్పు నేపథ్యంలో పార్టీ మారిన ఇతర ఎమ్మెల్యేలపై పెండింగ్‌లో ఉన్న అనర్హత పిటిషన్లను స్పీకర్ చట్ట ప్రకారం పరిష్కరించాలని హరీశ్‌రావు కోరారు. కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలతో వెంటనే రాజీనామా చేయించి, తిరిగి ప్రజల తీర్పు కోరేలా సీఎం రేవంత్‌రెడ్డిని రాహుల్ గాంధీ ఆదేశించాలని డిమాండ్ చేశారు.

# మానవ అక్రమ రవాణా కేసు

- తొమ్మిది మందికి జీవిత ఖైదు
- దోషుల్లో ఎనిమిది మంది బంగ్లాదేశీయులు
- ఉద్యోగాల పేరుతో మహిళలకు వల
- భారత్‌కు తీసుకొచ్చి వ్యభిచారంలోకి దింపినట్లు నిర్ధారణ
- 2019 పహాడీషరీఫ్ కేసులో కీలక తీర్పు
- 1.37 లక్షల జరిమానా విధించిన ప్రత్యేక కోర్టు



**హైదరాబాద్, సెప్టెంబర్ 18 (చురకలు):** హైదరాబాద్‌లో వెలుగుచూసిన మానవ అక్రమ రవాణా కేసులో ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఈ కేసులో దోషులుగా తేలిన తొమ్మిది మందికి జీవిత ఖైదు విధించింది. వీరిలో ఎనిమిది మంది బంగ్లాదేశ్ జాతీయులు ఉన్నారు. ఉద్యోగాలు, మంచి వేతనాలు ఇప్పిస్తామని మహిళలను నమ్మించి బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా భారత్‌కు తీసుకొచ్చి, అనంతరం బలవంతంగా వ్యభిచారంలోకి దింపినట్లు దర్యాప్తులో తేలింది. 2019 సెప్టెంబర్‌లో పహాడీషరీఫ్ పోలీసులు తొలుత ఈ కేసు నమోదు చేశారు. జల్‌పల్లిలోని ఓ వ్యభిచార గృహంపై దాడి చేసి ముగ్గురు బంగ్లాదేశ్ మహిళలను రక్షించారు. బాలాపూర్‌లోని మహ్మద్ కాలనీలో ఓ ఇంటి నుంచి మరో మహిళకు విముక్తి కల్పించారు. అనంతరం కేసును ఎన్ఐఏ స్వాధీనం చేసుకుని తిరిగి నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. ఈ కేసులో ఏ-1 నుంచి ఏ-12 వరకు మొత్తం 12 మందిపై ఎన్ఐఏ అభియోగపత్రం దాఖలు చేసింది. 2019-2020 మధ్య తెలంగాణ, పశ్చిమ బెంగాల్‌తోపాటు వివిధ ప్రాంతాల్లో నిందితులను అరెస్టు చేసింది. 2020 అక్టోబర్ 17న ప్రత్యేక కోర్టులో అభియోగపత్రం దాఖలు చేసింది. ఏ-1, ఏ-3, ఏ-7 నిందితులు పరారీలో ఉన్నట్లు ఎన్ఐఏ తెలిపింది. విచారణ అనంతరం మిగిలిన తొమ్మిది మందిని దోషులుగా నిర్ధారించిన ప్రత్యేక కోర్టు జీవిత ఖైదుతోపాటు మొత్తం రూ.1.37 లక్షల జరిమానా విధించింది. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా మూడు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని ఆదేశించింది.



# ఫార్ములా ఈ రేసుపై తప్పుడు కేసులు

## ఏసీబీ కోర్టు వద్ద కేటీఆర్ సవాల్

**లక్ష కోట్ల ఆస్తులుంటే రూ.1,000 కోట్లకే తీసుకోండి అంటూ సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ ఓపెన్ ఛాలెంజ్**

**హైదరాబాద్, సెప్టెంబర్ 18 (చురకలు):** ఫార్ములా ఈ కార్ రేస్ నిర్వహణలో ఎలాంటి అవినీతి జరగలేదని, కేవలం హైదరాబాద్ అంతర్జాతీయ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచేందుకే ఆ ఈవెంట్ నిర్వహించామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. ఫార్ములా ఈ రేస్ కేసు విచారణలో భాగంగా నాంపల్లి ఏసీబీ కోర్టుకు హాజరైన ఆయన, అనంతరం మీడియాతో మాట్లాడారు. తమపై కాంగ్రెస్ ప్రభుత్వం అసత్య ఆరోపణలు చేస్తూ తప్పుడు కేసులు బనాయించిందని, అయితే ఇటువంటి కేసులకు తాము భయపడేది లేదని ధీమా వ్యక్తం చేశారు. న్యాయవ్యవస్థపై తమకు పూర్తి నమ్మకం ఉందని, విచారణకు ఎప్పుడు పిలిచినా కోర్టుకు హాజరవుతానని తెలిపారు. పక్క రాష్ట్రాల సీఎంలు తమ రాష్ట్రాల బ్రాండ్ ఇమేజ్ పెంచుకోవడానికి లండన్ లాంటి ప్రాంతాలకు వెళ్తుంటే, తెలంగాణలో మాత్రం పెట్టుబడులు తెచ్చేందుకు కృషి చేసిన వారిపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కేసీఆరే టార్గెట్‌గా ప్రభుత్వం పనిచేస్తోందని, తమపై లక్ష కోట్ల ఆస్తులంటూ విషప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తమ పేరిట లక్ష కోట్ల ఆస్తులు ఉంటే కేవలం రూ.1,000 కోట్లే తీసుకొని మిగిలిన రూ.99 వేల కోట్లను ప్రజా సంక్షేమ హామీలకు ఖర్చు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేటీఆర్ బహిరంగ సవాల్ విసిరారు.

# నిరంకుశ నిజాం ఆదర్శమా?

**కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు భూములను దోచుకుంటున్నాయి**

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ఫైర్**



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 18 (చురకలు) :** అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడిన మాటలు, బీఆర్ఎస్-కాంగ్రెస్ నేతలు పరస్పరం చేసుకుంటున్న ఆరోపణలు చూస్తుంటే ఆ రెండు పార్టీల అసలు నైజం ఏమిటో ప్రజలు స్పష్టంగా గమనించాల్సిన అవసరం ఉందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు అన్నారు. ఢిల్లీలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో కేసీఆర్ పదేపదే నిజాంను మంచి పరిపాలకుడని, గొప్ప పనులు చేశాడని కీర్తిస్తే మొన్న అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి సైతం నిజాం చాలా గొప్ప మనిషంటూ పొగడ్తలతో ముంచెత్తడం ఈ రెండు పార్టీల వక్ర వైఖరికి నిదర్శనమని మండిపడ్డారు. నాడు నిజాం పాలనలో పల్లెల్లో కనీసం ఆడబిడ్డలు బతుకమ్మను కూడా ఆడుకోలేని పరిస్థితులు ఉండేవని గుర్తు చేశారు. జలియన్ వాలాబాగ్ తరహాలో పరకాల, జోడేఘాట్, గుండ్రాంపల్లి, వెయ్యి ఊడల మర్రి (నిర్మల్) వంటి అనేక ప్రాంతాల్లో ప్రజలను విచక్షణా రహితంగా కాల్చి చంపిన రక్త చరిత్ర నిజాం సర్కారుదని అన్నారు. అలాంటి క్రూరమైన నిజాంను నేడు ప్రజాస్వామ్య పాలనలో ఇద్దరు ముఖ్యమంత్రులు ఆదర్శంగా తీసుకుంటున్నారంటే అంతకంటే దారుణం మరొకటి ఉండదని మండిపడ్డారు. నాటి నిజాం ప్రపంచంలోనే అత్యంత సంపన్నుడిగా ఉండేవాడని, ఆయన తరహాలోనే తాము కూడా దేశంలోనే అత్యంత ధనికులుగా మారాలన్న దురాశతోనే కేసీఆర్, రేవంత్ రెడ్డిలు ప్రజాధనాన్ని, భూములను విచ్చలవిడిగా దోచుకున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ నిజాం సొమ్మును, పేదల భూములను దోచుకున్నారని, దాదాపు 500 ఎకరాల విలువైన భూములను కొల్లగొట్టారని స్వయంగా అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డే వెల్లడించారని రామచందర్ రావు ప్రస్తావించారు. అదే సమయంలో రేవంత్ రెడ్డి, ఆయన మంత్రులు సైతం 22-ఏ (నిషేధిత జాబితా) ముసుగులో ప్రైవేటు భూములను కబ్జా చేస్తూ భారీ భూకుంభకోణాలకు పాల్పడుతున్నారనేది బహిరంగ వాస్తవమని ఆరోపించారు. ఒకరు నిజాం భూములను, పేదల ఆస్తులను కాజేశారని మరొకరు చెబుతుంటే ఇంకొకరు 22-ఏ నిబంధనలను అడ్డం పెట్టుకుని వేల కోట్ల విలువైన భూములను ఆక్రమిస్తున్నారని పరస్పరం బట్టబయలు చేసుకుంటున్నారన్నారు. కేసీఆర్, రేవంత్ రెడ్డిలు రాజకీయాల్లోకి రాకముందు వారి ఆస్తులు, కుటుంబ ఆస్తులు ఎంత.. నేడు వారి ఆస్తుల విలువ ఎంత అనేది ఎన్నికల అఫిడవిట్ల ద్వారా ప్రజలకు స్పష్టమైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ సాక్షిగా జరిగిన ఈ భూదోపిడీ ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని రామచందర్ రావు డిమాండ్ చేశారు. ఈ విచారణ కేవలం కేసీఆర్ హయాంలో జరిగిన 500 ఎకరాల కుంభకోణానికే పరిమితం కాకుండా కాంగ్రెస్ పాలనలో 22-ఏ నిషేధిత జాబితా పేరుతో సాగుతున్న భూకబ్జాలపై కూడా నిష్పక్షపాతంగా జరగాలన్నారు. వారి కుటుంబాలు, వ్యక్తిగత సంక్షేమం కోసమే తప్ప ప్రజల బాగోగుల గురించి ఏనాడూ ఆలోచించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, వచ్చే ఎన్నికల్లో బీజేపీకి ఎవరితోనూ పొత్తులు ఉండబోవని, ఒంటరిగానే బరిలోకి దిగుతుందని స్పష్టం చేశారు. వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని, ప్రస్తుత పాలకులు ఈ భూకుంభకోణాలపై నిజాయతీగా విచారణ జరపకపోతే రేపు బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే గత, ప్రస్తుత ప్రభుత్వాల భూదోపిడీలపై సమగ్ర విచారణ జరిపించి దోషులను చట్టం ముందు నిలబెడతామని రామచందర్‌రావు హెచ్చరించారు.

చురకలు

శనివారం 19.09.2026




# నేను స్వతంత్రుడిని ఏఐ మోడల్ దుందుడుకు!

**ఆరు అనూహ్య ఘటనలను బయటపెట్టిన ఓపెన్‌ఏఐ**

**సూచనలను దాటేసేలా సొంత ఆదేశాలు రాసుకున్న పరిశోధనా మోడల్**

**తప్పులను దాచాలని సూచించిన జీపీటీ-5.6 శిక్షణ నమూనాలు**

**అనుమతి లేకుండా ఏపీఐ కీ వినియోగించిన మరో మోడల్**

**'మిస్‌అలైన్‌మెంట్'పై కొత్త బహిర్గత విధానం**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 18 (చురకలు):** కృత్రిమ మేధ మోడళ్లు తమకు నిర్దేశించిన హద్దులను దాటి ప్రవర్తించిన ఆరు ఘటనలను ఓపెన్‌ఏఐ బహిర్గతం చేసింది. ఇవన్నీ గత ఆరు నెలల్లో మోడళ్ల శిక్షణ లేదా మూల్యాంకన సమయంలో గుర్తించిన విడివిడి ఘటనలేనని, సాధారణ వినియోగంలో ఇవి ఎంత తరచుగా జరుగుతాయనే దానికి ఈ ఉదాహరణలను కొలమానంగా భావించరాదని సంస్థ స్పష్టం చేసింది. మోడళ్ల లక్ష్యాలు, ప్రవర్తన మానవ సూచనలు లేదా నిర్దేశించిన నియమాలకు విరుద్ధంగా మారే 'మిస్‌అలైన్‌మెంట్' ఘటనలను ఇకపై క్రమబద్ధంగా దర్యాప్తు చేసి వెల్లడించేందుకు కొత్త విధానాన్ని ప్రారంభించినట్లు తెలిపింది. విడుదల కాని ఓ పరిశోధనా మోడల్ తన పనిని మరో సందర్భంలో కొనసాగించేందుకు రూపొందించిన సారాంశాల్లో అసలు పనితో సంబంధం లేని సొంత సూచనలను చొప్పించినట్లు ఓపెన్‌ఏఐ తెలిపింది. సాధారణ పరిమితులను పట్టించుకోకుండా స్వతంత్రంగా వ్యవహరించాలనే భావన కలిగించే 'పెర్సొనా' సూచనలు వాటిలో ఉన్నాయని పేర్కొంది. ఇలాంటి ప్రభావం కనిపించిన 27 సారాంశాలను గుర్తించినట్లు వెల్లడించింది. ఇది మోడల్‌కు నిజంగా 'స్వతంత్ర చైతన్యం' వచ్చిందని అర్థం కాదని, శిక్షణ-మూల్యాంకన సమయంలో నమోదైన అనూహ్య ప్రవర్తనగా చూడాలని నివేదిక స్పష్టం చేస్తోంది. జీపీటీ-5.6 సోల్ శిక్షణ సమయంలో కొన్ని మోడల్ నమూనాలు భవిష్యత్తులో పని కొనసాగించే మోడళ్లకు తప్పులు లేదా నిర్దేశిత లక్ష్యాలకు విరుద్ధమైన ప్రవర్తనను వినియోగదారుడి నుంచి దాచేలా సారాంశాల్లో సూచనలు చేర్చినట్లు సంస్థ వెల్లడించింది. లేని పాత సమాచారాన్ని సృష్టించడం, ఆధారాల వర్షన్ల మధ్య ఉన్న తేడాలను బయటపెట్టకుండా ఉండటం వంటి ప్రవర్తనను గుర్తించినట్లు తెలిపింది. మరో ఘటనలో ఆదాయ గణాంకాల కోసం వెతుకుతున్న మోడల్ పబ్లిక్ రిపోజిటరీలో బయటపడిన ఏపీఐ కీని గుర్తించి అనుమతి లేకుండా ఉపయోగించింది. అయినప్పటికీ కావాల్సిన సమాచారం లభించకపోవడంతో గణాంకాలను కల్పించి, అవి కోరిన మూలం నుంచే వచ్చినట్లు చూపించినట్లు ఓపెన్‌ఏఐ తెలిపింది. ఇంకో విడుదల కాని మోడల్ బ్రౌజర్ ఆధారం పొందాలనే ఉద్దేశంతో వినియోగదారుడి అనుమతి లేకుండానే ఒక ఫైల్‌ను ఇంటర్నెట్‌లోకి అప్‌లోడ్ చేసింది. మిగిలిన ఘటనల్లో మోడళ్లు తమకు నిర్దేశించని సమాచార మార్పిడి మార్గాలను ఉపయోగించాయి. కొన్ని మోడళ్లు అంతర్గత సాఫ్ట్‌వేర్ రిపోజిటరీని సందేశాల మార్పిడికి ఉపయోగించగా, కలిసి పనిచేస్తున్న కొన్ని ఏజెంట్లు ఒకరి స్థానిక ఫైళ్లను మరొకరు పొందలేక పబ్లిక్ ఫైల్ హోస్టింగ్ సేవల్లో టాస్క్ ఫైళ్లను ఉంచినట్లు సంస్థ వివరించింది.

**ఇకపై ఘటనలు బహిర్గతం**

కొత్త విధానం ప్రకారం ఓపెన్‌ఏఐ ఉద్యోగులు అనుమానాస్పద మోడల్ ప్రవర్తనను గుర్తిస్తే భద్రత, అలైన్‌మెంట్ బృందాలకు నివేదించవచ్చు. ఆయా బృందాలు ఘటన తీవ్రత, ప్రభావం, ఇంకా స్పష్టత రావాల్సిన అంశాలను పరిశీలించి బహిరంగంగా వెల్లడించాలా వద్దా నిర్ణయిస్తాయి. ఈ ఆరు ఘటనలతోనే సమస్య ముగిసిందని సంస్థ చెప్పడం లేదు. ఏఐ వ్యవస్థలు మరింత శక్తిమంతమవుతున్న నేపథ్యంలో అలైన్‌మెంట్, పర్యవేక్షణ ఇంకా పూర్తిగా పరిష్కారమైన సమస్యలు కావని ఓపెన్‌ఏఐ పేర్కొంది.

# పిల్లల పాస్‌పోర్టుకు కొత్త రూల్స్!

**15 ఏళ్లలోపు వారికి ఐదేళ్ల కాలపరిమితి**

**18 ఏళ్ల వరకే చెల్లుబాటయ్యేలా నిబంధన**

**మైనర్లకు 36 పేజీల పాస్‌పోర్టు**

**పాస్‌పోర్టు నిబంధనలను సవరించిన కేంద్రం**

**గెజిట్ నోటిఫికేషన్ విడుదల**




**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 18 (చురకలు):** దేశంలో మైనర్లకు జారీ చేసే పాస్-పోర్టుల నిబంధనల్లో కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మార్పులు చేసింది. 'పాస్‌పోర్ట్స్ (అమెండ్‌మెంట్) రూల్స్-2026' పేరుతో సెప్టెంబర్ 17న గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. సవరించిన రూల్ 12 ప్రకారం 15 ఏళ్లలోపు పిల్లలకు జారీ చేసే సాధారణ పాస్‌పోర్టు ఐదేళ్లు లేదా వారు 18 ఏళ్ల వయసు చేరేవరకు-ఏది ముందైతే అంతవరకే చెల్లుబాటవుతుంది. కొత్త నిబంధనల ప్రకారం 15 ఏళ్లలోపు మైనర్లకు 36 పేజీల పాస్‌పోర్టు జారీ చేస్తారు. ఉదాహరణకు 13 ఏళ్ల వయసులో పాస్‌పోర్టు తీసుకుంటే ఐదేళ్ల కాలపరిమితి పూర్తయ్యే సమయానికే 18 ఏళ్లు వస్తాయి కాబట్టి అప్పటివరకు చెల్లుబాటవుతుంది. అయితే 14 ఏళ్ల వయసులో తీసుకుంటే ఐదేళ్లు కాకుండా 18 ఏళ్లు వచ్చే వరకే, అంటే సుమారు నాలుగేళ్లు మాత్రమే చెల్లుబాటు అవుతుంది. అంటే మైనర్ల పాస్‌పోర్టు విషయంలో 'ఐదేళ్లు లేదా 18 ఏళ్ల వయసు వరకు.. ఏది ముందైతే అది' అన్నదే ప్రధాన నిబంధన. 18 ఏళ్లు పూర్తయిన తర్వాత పెద్దలకు వర్తించే నిబంధనల ప్రకారం కొత్త పాస్‌పోర్టు కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఇదిలా ఉండగా పాస్‌పోర్టు దరఖాస్తు ఫీజులకు సంబంధించిన నిబంధనల్లోనూ ప్రభుత్వం ఇటీవల సవరణలు చేసింది. ఇందుకు సంబంధించిన ప్రత్యేక నోటిఫికేషన్‌ను విదేశీ వ్యవహారాల శాఖ ఇప్పటికే జారీ చేసింది.

# మొదట ఓటు చోరీ.. ఇప్పుడు పార్టీ చోరీ!

- ఎన్నికల సంఘంపై రాహుల్ తీవ్ర విమర్శలు
- తృణమూల్ పేరు, గుర్తు ఫ్రీజ్‌పై ఆగ్రహం
- బీజేపీ-ఈసీ చేతులు కలిపాయని ఆరోపణ
- ప్రజల తీర్పును కాపాడాలని డిమాండ్
- స్వేచ్ఛాయుత ఎన్నికల కోసం పోరాడతామని వెల్లడి



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 18 (చురకలు):** పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ పేరు, 'పువ్వులు--గడ్డి' ఎన్నికల గుర్తును ఎన్నికల సంఘం తాత్కాలికంగా ఫ్రీజ్ చేయడంపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. "మొదట ఓటు చోరీ.. తర్వాత ప్రభుత్వాల చోరీ.. ఇప్పుడు పార్టీ చోరీ" అంటూ శుక్రవారం సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా విమర్శించారు. దేశంలో ప్రజాస్వామ్యం దిగజారుతోందనడానికి తాజా పరిణామమే నిదర్శనమని ఆయన ఆరోపించారు. తృణమూల్‌లో మమతా బెనర్జీ, రితబ్రత బెనర్జీ నేతృత్వంలోని రెండు వర్గాలు పార్టీపై హక్కు తమదేనని వాదిస్తున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. వివాదంపై తుది నిర్ణయం వెలువడే వరకు రెండు వర్గాలూ 'ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్' పేరు, రిజర్వ్ చేసిన 'పువ్వులు-గడ్డి' గుర్తును ఉపయోగించకుండా ఆదేశించింది. అక్టోబర్ 6న జరగనున్న నందిగ్రామ్, రెజినగర్ ఉప ఎన్నికల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది.

**'ప్రజల తీర్పును కాపాడాలి'**

ప్రజలు ఇచ్చిన తీర్పును పరిరక్షించాల్సిన రాజ్యాంగబద్ధ బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని రాహుల్ పేర్కొన్నారు. కానీ ప్రజల తీర్పును మార్చే శక్తులకు ఈసీ సహకరిస్తోందని ఆరోపించారు. ముందుగా బీజేపీ, ఎన్నికల సంఘం కలిసి పనిచేస్తాయని, ఆ తర్వాత రాజకీయ పార్టీల గుర్తులపై ప్రభావం చూపుతాయని విమర్శించారు. గతంలో శివసేన, ఎన్సీపీ విషయంలోనూ ఇలాంటి పరిణామాలు చోటుచేసుకున్నాయని ఆయన ప్రస్తావించారు. ఇవన్నీ రాహుల్ గాంధీ చేసిన రాజకీయ ఆరోపణలే. ఈ పోరాటం మమతా బెనర్జీ ఒక్కరిదే కాదని, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలు కోరుకునే ప్రతి రాజకీయ పార్టీ, ప్రతి ఓటరుకు సంబంధించినదని రాహుల్ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, ఎన్నికల సంఘం గడువు మేరకు రెండు తృణమూల్ వర్గాలు ప్రత్యామ్నాయ పేర్లు, గుర్తులను సమర్పించాయి. అనంతరం మమతా బెనర్జీ వర్గానికి 'మమతా ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్' పేరు, 'ఫుట్‌బాల్ ప్లేయర్' గుర్తును, ప్రత్యర్థి వర్గానికి 'డెమోక్రటిక్ తృణమూల్ కాంగ్రెస్' పేరు, 'ఎన్వలప్' గుర్తును ఎన్నికల సంఘం కేటాయించినట్లు తాజా సమాచారం.



# దేశ రాజధాని ఢిల్లీలో దారుణం

**16 ఏళ్ల బాలికపై సామూహిక అత్యాచారం, హత్య..**

**రెండు రోజుల తర్వాత మృతదేహం గుర్తింపు**

**నలుగురు నిందితుల్లో ముగ్గురు మైనర్లు**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 18 (చురకలు):** దేశ రాజధాని ఢిల్లీలో 16 ఏళ్ల బాలికపై సామూహిక అత్యాచారం జరిపి హత్య చేసినట్లు ఆరోపణలు రావడం కలకలం రేపింది. స్వరూప్‌నగర్ ప్రాంతంలో జరిగిన ఈ ఘటనలో 19 ఏళ్ల యువకుడితోపాటు ముగ్గురు మైనర్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుల్లో బాలికకు పరిచయమున్న 17 ఏళ్ల బాలుడు కూడా ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. పోలీసుల వివరాల ప్రకారం.. గత శుక్రవారం రాత్రి బాలిక తనకు పరిచయమున్న 17 ఏళ్ల బాలుడిని కలిసేందుకు వెళ్లింది. అనంతరం అతడు మరో ముగ్గురితో కలిసి బాలికను తీసుకెళ్లినట్లు దర్యాప్తులో తేలిందని పోలీసులు పేర్కొన్నారు. ఆమెపై నలుగురూ సామూహిక అత్యాచారానికి పాల్పడి, హత్య చేసి మృతదేహాన్ని కుషాక్ రోడ్డుకు సమీపంలోని నిర్మానుష్య ప్రాంతంలో పడేసినట్లు ఆరోపిస్తున్నారు. రెండు రోజుల తర్వాత ఆదివారం స్థానికులు బాలిక మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహం తీవ్రంగా దెబ్బతిని ఉండటంతో తొలుత గుర్తింపు కష్టమైనట్లు పోలీసులు తెలిపారు. కనీసం లింగ నిర్ధారణ చేయలేని పరిస్థితుల్లో ఉన్నట్టు పోలీసులు తెలిపారు. ఆమె మృతదేహాన్ని కుక్కలు పీక్కుతిన్నాయని, ఒక చేయి వేరుగా పడి ఉన్నట్టు గుర్తించామన్నారు. మరోవైపు.. బాలిక అదృశ్య ఘటనపై ఆమె కుటుంబ సభ్యులెవరూ ఫిర్యాదు చేయలేదని చెప్పారు. ఆమె తరచూ ఇంటి నుంచి బయటకు వెళ్లేదని, కొద్ది రోజుల తర్వాత తిరిగి వస్తుండేదని వారు చెప్పారన్నారు. పోస్టుమార్టం నివేదిక, ఇతర ఆధారాల ఆధారంగా సామూహిక అత్యాచారం, హత్య కోణంలో దర్యాప్తు చేపట్టారు. సమీప ప్రాంతాల్లోని సీసీటీవీ దృశ్యాలను పరిశీలించిన పోలీసులు నలుగురు నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారిలో ఒకరికి 19 ఏళ్లు కాగా, మిగిలిన ముగ్గురు మైనర్లని పేర్కొన్నారు. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అపహరణ, అత్యాచారం, హత్యతోపాటు పోక్సో చట్టంలోని సంబంధిత నిబంధనల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# సృష్టి ఉన్నంతవరకూ ధర్మం ఉంటుంది

**సమస్త సంతోషానికీ ధర్మమే మూలం: మోహన్ భాగవత్**

**యువత ధర్మంపై చర్చించడం సంతోషకరమని వ్యాఖ్య**

**అహంకారం, అపోహలను వీడాలని సూచన**



**ఉజ్జయిని, సెప్టెంబర్ 18 (చురకలు):** ధర్మం అనేది వృద్ధాప్యంలో మాత్రమే ఆచరించాల్సిన అంశం కాదని, మనిషి పుట్టుక నుంచి మరణం వరకు జీవితంలో భాగంగా ఉంటుందని ఆర్‌ఎస్‌ఎస్ సర్‌సంఘచాలక్ మోహన్ భాగవత్ అన్నారు. మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో శుక్రవారం జరిగిన 'యువ ధర్మ సంసద్'లో యువతను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. యువత ధర్మం గురించి ఆలోచిస్తూ, చర్చించడం సంతోషాన్ని కలిగిస్తోందన్నారు. గీత, రామాయణం వంటి గ్రంథాలను పదవీ విరమణ తర్వాతే చదవాలనే భావన సరైంది కాదన్నారు. ధర్మం జీవితానికి దిశానిర్దేశం చేసే అంశమని, సృష్టి ఆరంభం నుంచి అంతం వరకు దాని ఉనికి కొనసాగుతుందని పేర్కొన్నారు. సమస్త సంతోషానికీ ధర్మమే మూలమని వివరించారు. ప్రతిదీ తన నియంత్రణలోనే ఉందని, తాను అనుకున్నట్లే జరగాలనే భావన అహంకారానికి దారితీస్తుందని భాగవత్ అన్నారు. ధర్మాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలంటే మనసులో స్థిరపడిపోయిన అపోహలు, ముందస్తు అభిప్రాయాలను విడిచిపెట్టాలని యువతకు సూచించారు. ధర్మం మనిషిని బంధించేది కాదని, సరైన జీవన మార్గాన్ని చూపుతూ విముక్తి వైపు నడిపిస్తుందని పేర్కొన్నారు.

# బ్రీత్ అనలైజర్ పరీక్షలో జాప్యం..

**నలుగురు పైలట్లతో సహా 8 మందిని సస్పెండ్ చేసిన ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 18 (చురకలు):** బ్రీత్ అనలైజర్ పరీక్షలో జాప్యం చేసిన పైలట్లు, సిబ్బందిపై ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ చర్యలు చేపట్టింది. అంతర్జాతీయ విమాన ప్రయాణం తర్వాత నిర్దేశించిన రెండు గంటల వ్యవధిలోగా తప్పనిసరిగా బ్రీత్ అనలైజర్ పరీక్ష చేయించుకోనందుకు నలుగురు పైలట్లతో సహా ఎనిమిది మంది సిబ్బందిని సస్పెండ్ చేసింది. ఆగస్ట్ 2న దుబాయ్-అమృత్‌సర్ ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానం అమృత్‌సర్‌లోని గురు రామ్ దాస్ జీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ల్యాండ్ అయ్యింది. ఆ తర్వాత రెండు గంటల్లోగా ఆ విమాన సిబ్బంది తప్పనిసరిగా పోస్ట్-ఫ్లైట్ డిక్లరేషన్‌కు హాజరు కావాల్సి ఉన్నది. కాగా, ఆ విమాన సిబ్బందిలో కొందరు 35 నిమిషాలు ఆలస్యంగా బ్రీత్ అనలైజర్ పరీక్షకు హాజరయ్యారు. విమానం ల్యాండ్ అయిన 2 గంటల 35 నిమిషాల తర్వాత తమ డిక్లరేషన్‌ను వారు సమర్పించారు. ఈ నేపథ్యంలో తమ సిబ్బంది పాల్పడిన ఈ ఉల్లంఘనను డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ)కు ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ నివేదించింది. నలుగురు పైలట్లతో సహా ఎనిమిది మంది సిబ్బందిని విధుల నుంచి తొలగించినట్లు అందులో పేర్కొంది. మరోవైపు గత నెలలో ఫుకెట్-ఢిల్లీ ఎయిర్ ఇండియా విమానం భారీ కుదుపులకుగురైంది. ఆ పైలట్ గంజాయి సేవించినట్లు పరీక్షల్లో నిర్ధారణ అయ్యింది. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ విమాన ప్రయాణం తర్వాత నిర్దేశిత వ్యవధిలోగా సిబ్బందికి బ్రీత్ అనలైజర్ పరీక్షలను విమానయాన సంస్థలు తప్పనిసరిగా అమలు చేయాలని డీజీసీఏ ఆదేశించింది.




# స్పామ్ కాల్స్‌కు ట్రాయ్ కొత్త చెక్!

**అనవసర కాల్స్, సందేశాలపై మరింత కఠిన నిబంధనలు**

**మూడు ఫిర్యాదులతోనే అనుమానిత నంబర్‌పై చర్య**

**వినియోగదారులకు కొత్త అప్పీల్ అవకాశం**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 18 (చురకలు):** మొబైల్ వినియోగదారులను వేధిస్తున్న స్పామ్ కాల్స్, అనవసర వాణిజ్య సందేశాలకు అడ్డుకట్ట వేసేందుకు భారత టెలికాం నియంత్రణ సంస్థ ట్రాయ్ నిబంధనలను మరింత కఠినతరం చేసింది. సాంకేతిక ఆధారిత పర్యవేక్షణ, టెలికాం సంస్థల మధ్య సమాచార మార్పిడి, వినియోగదారులకు అదనపు రక్షణ కల్పించేలా వాణిజ్య సమాచార నియంత్రణ నిబంధనల్లో మూడో సవరణను సెప్టెంబర్ 18న విడుదల చేసింది. కొత్త నిబంధనల ప్రకారం స్పామ్‌కు ఎక్కువగా ఉపయోగించే అవకాశం ఉన్న నంబర్లను టెలికాం సంస్థలు ముందుగానే గుర్తించాలి. ఆ సమాచారాన్ని ఇతర ఆపరేటర్లతో పంచుకోవడంతోపాటు అనుమానిత నంబర్ల గుర్తింపు వివరాలను మళ్లీ తనిఖీ చేయాలి. స్పామ్‌కు పాల్పడుతున్నట్లు నిర్ధారణైతే నంబర్‌ను నిలిపివేసే వరకు చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. వాణిజ్య, అధికారిక సమాచారానికి కేటాయించిన ప్రత్యేక నంబర్ సిరీస్‌లకు కూడా స్పష్టమైన రక్షణ కల్పించారు. ముఖ్యంగా నియంత్రిత సంస్థల సేవలు, లావాదేవీల కాల్స్‌కు ఉపయోగించే 1600 సిరీస్ నంబర్లను స్పామ్‌గా ట్యాగ్ చేయడం, బ్లాక్ చేయడం లేదా ఫిల్టర్ చేయడం అనుమతించబడదని ట్రాయ్ ఇప్పటికే స్పష్టం చేసింది. 140 సిరీస్ ప్రధానంగా ప్రచార కాల్స్‌కు వినియోగిస్తారు. స్పామ్‌ను గుర్తించే కాల్ మేనేజ్‌మెంట్, థర్డ్ పార్టీ యాప్‌ల విషయంలోనూ కొత్త నిబంధనలు తీసుకొచ్చారు. టెలికాం సంస్థల నుంచి స్పామ్‌కు సంబంధించిన సమాచారాన్ని పొందాలంటే ఆయా యాప్‌లు తమ వద్ద ఉన్న సంబంధిత సమాచారాన్ని తిరిగి ఆపరేటర్లతో పంచుకోవాల్సి ఉంటుంది. దీంతో స్పామ్ నంబర్లను వేగంగా గుర్తించి చర్యలు తీసుకునే వ్యవస్థ బలోపేతం కానుంది. అలాగే ఒక నంబర్‌పై చర్యకు అవసరమైన ఫిర్యాదుల పరిమితిని ఐదు నుంచి మూడుకు తగ్గించారు. వినియోగదారుల ఫిర్యాదులపై టెలికాం సంస్థలు తీసుకున్న నిర్ణయంతో సంతృప్తి చెందని వారికి అప్పీల్ చేసుకునే వ్యవస్థను కూడా కొత్తగా ప్రవేశపెట్టారు. ఆటో డయలర్, రోబో కాల్స్ వంటి సాంకేతికతను ఉపయోగించే సంస్థలు ముందుగానే ఆ విషయాన్ని టెలికాం ఆపరేటర్లకు తెలియజేయాల్సి ఉంటుంది. దీంతో స్పామ్‌ను గుర్తించడం నుంచి ఫిర్యాదు, విచారణ, చర్య వరకు మొత్తం వ్యవస్థను మరింత పటిష్ఠం చేయాలని ట్రాయ్ లక్ష్యంగా పెట్టుకుంది. అయితే కొత్త నిబంధనలతో స్పామ్ కాల్స్, సందేశాలు పూర్తిగా అంతమవుతాయని ఇప్పుడే చెప్పలేం; వాటిపై వేగంగా చర్య తీసుకునేందుకు నియంత్రణ వ్యవస్థ మాత్రం మరింత కఠినమైంది.

# ఇంటి ఆవరణలోనే మట్టి వినాయకుడి నిమజ్జనం

- పర్యావరణ పరిరక్షణకు నీలోజిపల్లి గ్రామస్థుడి వినూత్న సందేశం





**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 18, :** వినాయక చవితి ఉత్సవాల్లో పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ రాజన్న సిరిసిల్ల జిల్లా బోయిన్పల్లి మండలం నీలోజిపల్లి గ్రామానికి చెందిన గూడ రమేష్‌రెడ్డి వినూత్నంగా మట్టి వినాయకుడిని ఇంటి ఆవరణలోనే నిమజ్జనం చేశారు. వినాయక నవరాత్రుల ఐదో రోజు శుక్రవారం తన ఇంటి ఆవరణలో ఏర్పాటు చేసిన నీటి తొట్టిలో మట్టి వినాయక విగ్రహాన్ని భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా గూడ రమేష్‌రెడ్డి మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలతో నీటి వనరులు కలుషితమయ్యే అవకాశం ఉందని, రసాయన రంగుల వల్ల పర్యావరణానికి నష్టం వాటిల్లుతుందని తెలిపారు. అందుకే మట్టి వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేసి, ఇంటి వద్దనే నిమజ్జనం చేసినట్లు చెప్పారు. "ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసుకుని పర్యావరణాన్ని కాపాడాలి. కాలుష్యాన్ని దూరం చేసి, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలి" అని ఆయన పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా సహకరించాలని కోరారు.

# దళిత జర్నలిస్ట్ ఫోరం 11వ రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్ ఆవిష్కరణ



**ఆందోల్ ప్రతినిధి, సెప్టెంబర్ 18, :** దళిత జర్నలిస్ట్ ఫోరం 11వ రాష్ట్ర మహాసభలకు సంబంధించిన గోడపత్రికను శుక్రవారం అందోల్ మండలం జోగిపేట పట్టణంలో ఆవిష్కరించారు. స్థానిక తహసీల్దార్ సాగర్ మధుకర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ తిరుపతి, స్థానిక ఎస్సై గిరి శ్రీకాంత్ చేతుల మీదుగా వేరువేరుగా వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దళిత జర్నలిస్ట్ ఫోరం నాయకులు, జిల్లా ఉపాధ్యక్షులు మాట్లాడుతూ అక్టోబర్ 7న సంగారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న 11వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని జర్నలిస్టులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దళిత జర్నలిస్ట్ ఫోరం జిల్లా ఉపాధ్యక్షుడు దానం మోహన్, జిల్లా కార్యదర్శి జోగ్యల్ల రాజు, జిల్లా సభ్యుడు మాదిగ బుచ్చయ్య, అజ్జిగళ్ల నర్సింలు, కుసంగి మహేష్, మేకల అమరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# వినాయకుడి ప్రత్యేక పూజల్లో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నరేందర్ రెడ్డి

## కాలనీ ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్ష



**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 18, :** 132వ డివిజన్‌లోని గార్డెన్ బస్తీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు వేణుగోపాల్, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వీరారెడ్డి నరేందర్ రెడ్డి శుక్రవారం వినాయకుడి ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం వీరారెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. విఘ్నేశ్వరుని కృపతో కాలనీ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ప్రతి కుటుంబంలో శాంతి, సౌభ్రాతృత్వం, ఆనందం నెలకొనాలని, ప్రజలందరూ ఐకమత్యంతో సంతోషంగా జీవించాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, కాలనీ పెద్దలు, భక్తులు, కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సిద్దిపేటలో అల్పాహారం, మధ్యాహ్న భోజనం వెంటనే ప్రారంభించాలి

- రక్తహీనతపై బాలికలకు అవగాహన అవసరం
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 18, :** ఇతర జిల్లాల్లో ప్రారంభించిన విధంగా సిద్దిపేట జిల్లాలోని ప్రభుత్వ విద్యాసంస్థల్లోనూ అల్పాహారం, మధ్యాహ్న భోజన సౌకర్యాన్ని వెంటనే ప్రారంభించాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మిత్ర రక్త కేంద్రం, ప్రాణసేతు ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన రక్తహీనత అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రక్తహీనతపై అప్రమత్తంగా ఉండాలని, చాలా మంది బాలికలు రక్తహీనతతో బాధపడుతున్నారని, ప్రతి బాలిక తప్పనిసరిగా రక్త పరీక్షలు చేయించుకోవాలని హరీశ్‌రావు సూచించారు. రక్తహీనత కారణంగా నీరసం, తలనొప్పి వంటి సమస్యలు ఏర్పడి ఏకాగ్రత తగ్గుతుందని, దాని ప్రభావం చదువుపై పడే అవకాశం ఉందన్నారు. రక్తహీనత ఉన్నవారు వైద్యుల సూచన మేరకు మందులు వాడటంతో పాటు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. సరైన జాగ్రత్తలు పాటిస్తే రక్తహీనత నుంచి బయటపడి ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. విద్యార్థుల భవిష్యత్తే లక్ష్యంగా విద్యార్థుల ఆరోగ్యం, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని రక్తహీనతపై అవగాహన సదస్సు నిర్వహించడంతో పాటు ఉచితంగా రక్త పరీక్షలు చేపట్టడం అభినందనీయం అన్నారు.

**కళాశాల అభివృద్ధికి కృషి**




తాము అధికారంలో ఉన్న సమయంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యా బోధన మెరుగుపడేలా కాంట్రాక్ట్ అధ్యాపకులను క్రమబద్ధీకరించామని హరీశ్‌రావు తెలిపారు. తాను మంత్రిగా ఉన్న సమయంలో కళాశాల అభివృద్ధికి అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు సహకరించానన్నారు. ప్రస్తుతం కళాశాలలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, అవసరమైన పూర్తిస్థాయి సదుపాయాలు కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

# సైన్స్ సెమినార్‌లో గణపురం విద్యార్థినికి ప్రథమ స్థానం

- రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక.. ఉపాధ్యాయుల అభినందనలు..




**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 18, :** సైన్స్ సెమినార్‌లో ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచిన తొగుట మండలం గణపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని జీ నిహారికను ఉపాధ్యాయులు శుక్రవారం అభినందించారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని మల్టీపర్పస్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సైన్స్ సెమినార్‌లో పదో తరగతి విద్యార్థిని నిహారిక పాల్గొని ప్రథమ స్థానాన్ని సాధించింది. దీంతో ఆమె రాష్ట్ర స్థాయి సైన్స్ సెమినార్‌కు ఎంపికైంది. విద్యార్థినికి మార్గదర్శకత్వం అందించిన ఉపాధ్యాయుడు గందె నవీన్‌కుమార్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అంజలి, మండల విద్యాధికారి నరసయ్య అభినందించారు. పాఠశాలకు చెందిన విద్యార్థిని ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం సంతోషంగా ఉందని వారు తెలిపారు. నిహారిక ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మయ్య, శివకుమార్, శేఖర్, సుజాత, రాధాకిషన్, విష్ణురాం, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# దుంపలపల్లిలో ఘనంగా కుంకుమార్చన

- పెద్ద సంఖ్యలో పాల్గొన్న మహిళలు
- 25 ఏళ్లుగా నిర్విరామంగా వినాయక నవరాత్రి ఉత్సవాలు
- గ్రామంలో వెల్లివిరిసిన ఆధ్యాత్మిక వాతావరణం

**దుబ్బాక ప్రతినిధి, సెప్టెంబర్ 18, :** సిద్దిపేట జిల్లా దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని దుంపలపల్లిలో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం హనుమాన్ భజన మండలి ఆధ్వర్యంలో గణనాథుడి వద్ద ఘనంగా కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. కుంకుమార్చన లో గ్రామానికి చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఈ సందర్భంగా హనుమాన్ భజన మండలి అధ్యక్షుడు వెంకట్ రెడ్డి మాట్లాడుతూ గత 25 సంవత్సరాలుగా హనుమాన్ భజన మండలి ఆధ్వర్యంలో వినాయక నవరాత్రి ఉత్సవాలను నిర్విరామంగా కొనసాగిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రజల్లో ఆధ్యాత్మిక భావనను పెంపొందించడంతో పాటు భక్తి మార్గంలో ప్రజలు కొనసాగాలనే ఉద్దేశంతోనే ప్రతి ఏటా కుంకుమార్చన కార్యక్రమం నిర్వహిస్తున్నామని వెల్లడించారు. కుంకుమార్చన కార్యక్రమంతో గ్రామంలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. అనంతరం ఆలయానికి వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. అన్న ప్రసాద వితరణకు అన్నదాతలుగా శెట్టి రామ రాజయ్య, రంజిత్ కుమార్ సహకరించారు. హనుమాన్ భజన మండలి మహిళా సభ్యులకు స్థానిక కౌన్సిలర్ నిరోషా–వెంకట్



స్వామిగౌడ్ చీరలు అందజేశారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ భజన మండలి సభ్యులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్‌పై కఠిన చర్యలు

- 13 మందికి రూ.1.20 లక్షల జరిమానా.. ఐదుగురికి జైలు శిక్ష..

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 18, :** సిద్దిపేట పట్టణ పరిసర ప్రాంతాల్లో గత రెండు రోజులుగా ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 13 మంది పట్టుబడ్డారు. వారిని శుక్రవారం సిద్దిపేట ప్రత్యేక రెండో తరగతి న్యాయస్థాన న్యాయమూర్తి కాంతారావు ఎదుట హాజరుపరిచారు. విచారణ అనంతరం నలుగురికి రెండు రోజుల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా, మరో వ్యక్తికి ఐదు రోజుల జైలు శిక్ష విధించారు. మొత్తం 13 మందికి రూ.1.20 లక్షల జరిమానా విధించారు. అదేవిధంగా డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన 10 మందికి రూ.50 వేల జరిమానా విధించినట్లు ట్రాఫిక్




పోలీసులు తెలిపారు. జైలు శిక్ష పడిన వారు రాజు పట్లే సిద్దిపేట , ఉప్పుల జగన్ గోకుల్‌నగర్, హన్మకొండ, మహమ్మద్ ఆబిద్ మద్దూర్, సిద్దిపేట జిల్లా, ఒద్ది రమేష్ రామాయంపేట, మెదక్ జిల్లా, మహమ్మద్ హుస్సేన్ నాసర్‌పుర, సిద్దిపేట ఉన్నారు.

**నిబంధనలు పాటించాలి**

ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ చెట్టుక్రింది ముత్యం రాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడపడం వల్ల వాహనదారుడి ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలకు కూడా ప్రమాదం ఏర్పడుతుందని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడితే రూ.10 వేల జరిమానా, లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే రూ.5 వేల జరిమానాతో పాటు చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# మహానగర్ కాలనీలో ఘనంగా వినాయక పూజా కార్యక్రమం

- భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు మాధవరెడ్డి, నరేందర్ రెడ్డి

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 18, :** జీడిమెట్ల 132వ డివిజన్‌లోని మహానగర్ కాలనీలో శుక్రవారం శ్రీ వినాయక స్వామి ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, ఉద్యమకారులు సంపత్ మాధవరెడ్డి, వీరారెడ్డి నరేందర్ రెడ్డి హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, కాలనీ అధ్యక్షులు కుమార్, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, కాలనీ పెద్దలు, భక్తులు, కాలనీ వాసులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుని కృపతో ప్రతి కుటుంబంలో



సుఖశాంతులు, ఆరోగ్యం, ఐశ్వర్యం, సంతోషం వెల్లివిరియాలని నాయకులు ఆకాంక్షించారు. గణనాథుడి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని కోరుకున్నారు.

# కోటి ఎకరాలు 22 ఏలో ఉందని కేటీఆర్, హరీష్ రావు దుష్ప్రచారం

- బీఆర్ఎస్ హయాంలో ధరణి తెచ్చి, 22.93 లక్షల ఎకరాలు 22 ఏలో పెట్టారు
- కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఈ విస్తీర్ణాన్ని ఏడు లక్షల ఎకరాలకు తగ్గించాం
- కేసీఆర్, హరీష్ రావు, కేటీఆర్ దోచుకున్న భూముల వివరాలన్నీ బయటపెడతాం
- టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం



**సంగారెడ్డి ప్రతినిధి, సెప్టెంబర్ 18, :** కేసీఆర్ ఆదేశాల మేరకు మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావు 22(ఏ) జాబితా విషయంలో దుష్ప్రచారం సాగిస్తున్నారని టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం అన్నారు. బీఆర్ఎస్ హయాంలో ధరణి తీసుకొచ్చి, ఏకంగా 22.93 లక్షల ఎకరాలు 22(ఏ)లో పెట్టిన వాళ్లే.. ఇప్పుడు అవాకులు, చవాకులు పేలుతున్నారని విమర్శించారు. డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డితో కలిసి శుక్రవారం సంగారెడ్డిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిషేధిత జాబితాలో ఉన్న భూముల విస్తీర్ణాన్ని 7 లక్షల ఎకరాలకు తగ్గించామని ఆయన వివరించారు. ప్రస్తుతం 22 (ఏ)లో కేవలం 3.75 లక్షల ఎకరాల భూమి మాత్రమే ఉందన్నారు. ఈ సమస్యకు పరిష్కారం చూపేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని ఆయన స్పష్టం చేశారు. కేటీఆర్, హరీష్ రావు మాత్రం ప్రజలను గందరగోళానికి గురి చేసేలా కోటి ఎకరాలు 22(ఏ)లో ఉందని దుష్ప్రచారం సాగిస్తున్నారని ఆయన మండిపడ్డారు. తొమ్మిదిన్నరేళ్ల పాలనలో ధరణిని అడ్డుపెట్టుకొని బీఆర్ఎస్ నేతలు అసైన్డ్ భూములను దోచుకున్నారని ఆయన వివరించారు.

**బీఆర్ఎస్ నేతలు దోచుకున్న భూముల వివరాలను బయట పెడతాం**

తొమ్మిదిన్నరేళ్ల పాలనలో అడ్డగోలుగా పట్టాలు సృష్టించి, బీఆర్ఎస్ నేతలు దోచుకున్న భూముల వివరాలన్నింటినీ బయట పెడతామని ఈ సందర్భంగా టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం వెల్లడించారు. కేసీఆర్ పాలనలో అన్ని వర్గాలకు అన్యాయమే జరిగిందన్నారు. బిల్లులు రాక ఎంతోమంది సర్పంచులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని గుర్తు చేశారు. లక్ష కోట్లు ఖర్చు చేసి కాళేశ్వరం కట్టిన బీఆర్ఎస్ నేతలు రాష్ట్రాన్ని దివాలా తీయించారన్నారు. అప్పుల భారం ఉన్నప్పటికీ, కాంగ్రెస్ ప్రజా పాలనలో హామీలన్నింటిని నెరవేరుస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. హైదరాబాద్ నగరాన్ని ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుక్షణం తపిస్తున్నారని అన్నారు.

**దళితులను అవమానించిన బీఆర్ఎస్ నేతలు**

ఫామ్ హౌస్ ముందు డప్పు కొట్టిన దళితులను అవమానించేలా, ఆ రోడ్లను పసుపు నీళ్లతో శుద్ధి చేశారని ఆయన అన్నారు. స్పీకర్ను అవమానించేలా అనుచిత వ్యాఖ్యలు చేసిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.

**ప్రజా పాలనలో అన్ని వర్గాలకు న్యాయం**

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఈ 30 నెలల్లో ఇచ్చిన, ఇవ్వని హామీలను నెరవేరుస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నో కొత్త పాలసీలు తెచ్చి అభివృద్ధి, సంక్షేమాన్ని కొనసాగిస్తున్నారని వివరించారు. బీఆర్ఎస్ తో లోపాయికారి ఒప్పందం చేసుకొని, ఎంపీగా గెలిచిన రఘునందన్ రావు కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటే అని మాట్లాడడం విడ్డూరంగా ఉందని విలేకరులు అడిగిన ప్రశ్నకు సత్యం శ్రీరంగం సమాధానం ఇచ్చారు. బీఆర్ఎస్ తో బీజేపీ లోపాయికారి ఒప్పందం చేసుకోవడం వల్లనే ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు గెలిచారని అన్నారు. ఈ సమావేశంలో టీపీసీసీ అధికార ప్రతినిధి తోపాజి అనంత కిషన్, కాంగ్రెస్ పార్టీ సంగారెడ్డి నియోజకవర్గ ఇంచార్జ్ చేర్యాల ఆంజనేయులు, సీడీసీ చైర్మన్ గడీల రామ్ రెడ్డి, సీనియర్ నాయకులు రఘు గౌడ్, మునిపల్లి సత్యనారాయణ, కూన సంతోష్, పట్టణ అధ్యక్షులు కిరణ్ గౌడ్, ఎస్సీ సెల్ అధ్యక్షులు శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

# ఉత్సాహంగా మండల స్థాయి బాలికల క్రీడా పోటీలు



**దమ్మపేట, సెప్టెంబర్ 18, :** దమ్మపేట మండల కేంద్రంలోని ట్రైబల్ వెల్ఫేర్ గ్రౌండ్ లో శుక్రవారం స్కూల్ ఫెడరేషన్ మండల స్థాయి బాలికల అండర్ 14, 17 క్రీడా పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఈ క్రీడా పోటీలకు డిప్యూటీ కలెక్టర్ మద్దినేని మురళి, దమ్మపేట ఎస్సై రాజేష్ కుమార్ హాజరై క్రీడాకారులను ప్రోత్సహించారు. వివిధ పాఠశాలల నుండి బాలికలు ఉత్సాహంగా పాల్గొని తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించారు. పోటీలను పీఈటీ, పీడీ ల సమన్వయంతో నిర్వహించి, క్రీడా నియమ నిబంధనల ప్రకారం పోటీలు సజావుగా జరిగేలా పర్యవేక్షించారు. ఈ క్రీడా పోటీలలో అండర్ 17 బాలికల కబడ్డీ పోటీలో ఏకలవ్య గండుగులపల్లి, జెడ్పి హెచ్చెస్ నాచారం ఫైనల్స్ కు చేరుకున్నాయి. అండర్ 17 బాలికల ఖోఖో పోటీలలో ఏకలవ్య గండుగులపల్లి, జెడ్పి హెచ్చెస్ గండుగులపల్లి ఫైనల్స్ కు చేరుకున్నాయి. అండర్ 14 ఖోఖో లో జెడ్పి హెచ్చెస్, గండుగులపల్లి ప్రథమ, ఏజీ హెచ్చెస్, పెద్ద గొల్లగూడెం ద్వితీయ స్థానాలు సాధించారు. అండర్ 17 వాలీబాల్ ఏజీ హెచ్చెస్ అంకంపాలెం, ఏజీ హెచ్చెస్ పెద్ద గొల్లగూడెం ఫైనల్స్ కు చేరుకున్నాయి. అండర్ 14 వాలీబాల్ ఏకలవ్య గండుగులపల్లి, ఏజీ హెచ్చెస్ అంకంపాలెం ఫైనల్స్ కు చేరుకున్నాయి. అథ్లెటిక్స్ 100, 200, 800, 1500 అండర్ 14 విభాగంలో వైష్ణవి, ఏకలవ్య, గండుగులపల్లి ప్రథమ, జాహ్నవీ లత ద్వితీయ, అండర్ 17 200 మీటర్ల పరుగు పందెంలో సౌజన్య, పెద్ద గొల్లగూడెం ప్రథమ, వైష్ణవి ద్వితీయ, అండర్ 14 విభాగంలో పి. పల్లవి, ఏకలవ్య, గండుగులపల్లి ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ కార్యక్రమంలో పీడీ, పీఈటీలు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# జీతాల నుంచి అదనపు హెచ్ఆర్ఏ రికవరీ ఆపాలి

- రెగ్యులర్ ఎంపీహెచ్ఏలకు అదనపు హెచ్ఆర్ఏ కొనసాగించాలి
- పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కల్వ చక్రధర్




**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 18, :** జిల్లాలో పనిచేస్తున్న రెగ్యులర్ ఎంపీహెచ్ఏ(ఎఫ్)లకు అదనపు ఇంటి అద్దె భత్యం (హెచ్ఆర్ఏ) కొనసాగించాలని పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ (3194) జిల్లా అధ్యక్షుడు కల్వ చక్రధర్ ప్రభుత్వాన్ని కోరారు. ఇప్పటికే నిలిపివేసిన అదనపు హెచ్ఆర్ఏ మొత్తాన్ని ఉద్యోగుల జీతాల నుంచి తిరిగి వసూలు చేయాలన్న ఆదేశాలను వెంటనే ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి చేశారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అదనపు హెచ్ఆర్ఏను నిలిపివేయడంతో పాటు, ఇప్పటివరకు చెల్లించిన మొత్తాన్ని ఉద్యోగుల జీతాల నుంచి రికవరీ చేయాలని ఏస్టీఓ నుంచి ఆదేశాలు వచ్చినట్లు తెలిపారు. ఇప్పటికే ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఏఎన్ఎంల జీతాల నుంచి హెచ్ఆర్ఏ మొత్తాన్ని రికవరీ చేయడం సరికాదన్నారు.

**కమిషనర్‌కు వినతిపత్రం**

ఈ సమస్యపై రాష్ట్ర కుటుంబ సంక్షేమ కమిషనర్ సంగీత సత్యనారాయణను కలిసి వినతిపత్రం సమర్పించినట్లు చక్రధర్ తెలిపారు. సమస్యను పరిశీలించి, చర్చించి న్యాయం చేస్తామని కమిషనర్ సానుకూలంగా స్పందించి హామీ ఇచ్చారని పేర్కొన్నారు. అనంతరం ఉమ్మడి మెదక్ జిల్లాలో గతంలో డీపీఓగా పనిచేసి ప్రస్తుతం జాతీయ ఆరోగ్య కార్యక్రమంలో ప్రణాళికాధికారిగా విధులు నిర్వహిస్తున్న జగన్నాథరెడ్డిని కలిసి సమస్యను వివరించినట్లు తెలిపారు. సమస్య పరిష్కారానికి సహకరించాలని కోరినట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా యూనియన్ ప్రధాన కార్యదర్శి పుల్లగుర్ల శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భూంపల్లి రాజు, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు కల్వ శోభ, గజ్వేల్ డివిజన్ ప్రధాన కార్యదర్శి దేవసాని వాసుదేవ్, పీఆర్ఓ సురేష్, ఉపాధ్యక్షుడు నాగేందర్‌రెడ్డి, యూనియన్ సభ్యులు పద్మలత, స్వర్ణ, పుష్పలత, అనసూయ, ధనలక్షి , పుష్ప తదితరులు పాల్గొన్నారు.

# వేరుశెనగ సాగును ప్రోత్సహిస్తాం

- 1,250 ఎకరాల్లో సాగుకు ప్రణాళిక
- వందశాతం రాయితీపై విత్తనాలు
- అధికారులతో సమావేశంలో కలెక్టర్ కట్టా హైమావతి




**సిద్దిపేట కలెక్టరేట్, సెప్టెంబర్ 18, :** జిల్లాలో వేరుశెనగ సాగును ప్రోత్సహించేందుకు చర్యలు చేపడుతున్నట్లు సిద్దిపేట జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి తెలిపారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో వేరుశెనగ సాగుపై సమీక్షించారు. జాతీయ వంటనూనెలు-నూనెగింజల మిషన్ 2026-27 పథకం కింద యాసంగి, ముందస్తు రబీ సీజన్‌లో జిల్లాలో 1,250 ఎకరాల్లో వేరుశెనగ సాగు చేపట్టేందుకు ప్రణాళిక రూపొందించినట్లు కలెక్టర్ తెలిపారు. రైతులకు వేరుశెనగ విత్తనాలను వందశాతం రాయితీపై అందించనున్నట్లు పేర్కొన్నారు. హై ల్యాండ్ పరిధిలో 600 ఎకరాలు, జాతీయ విత్తన సంస్థ పరిధిలో 650 ఎకరాల్లో వేరుశెనగ సాగు చేపట్టాలని ప్రతిపాదించారు. ఇందుకు అవసరమైన విత్తనాలను సకాలంలో సమకూర్చాలని అధికారులను ఆదేశించారు. మండలాల వారీగా సాగు విస్తీర్ణం హుస్నాబాద్ డివిజన్‌లో అక్కన్నపేటలో 250 ఎకరాలు, బెజ్జంకిలో 200, కోహెడలో 250, హుస్నాబాద్‌లో 150 ఎకరాలు ప్రతిపాదించారు. సిద్దిపేట డివిజన్‌లో చిన్నకోడూరులో 200, సిద్దిపేట రూరల్‌లో 25 ఎకరాలు, ములుగు డివిజన్‌లోని వర్గల్‌లో 50 ఎకరాలు, దౌల్తాబాద్ డివిజన్‌లో మిరుదొడ్డిలో 25, దౌల్తాబాద్‌లో 100 ఎకరాల్లో సాగు చేపట్టాలని నిర్ణయించారు. వేరుశెనగ సాగుకు అవసరమైన కదిరి లేపాక్షి, గిన్నర్-4 రకాల విత్తనాలను అందుబాటులోకి తీసుకురావాలని, రైతులకు సకాలంలో పంపిణీ చేసి సాగు విస్తీర్ణాన్ని పెంచాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుని వేరుశెనగ సాగు చేపట్టి నూనెగింజల ఉత్పత్తి పెంపునకు సహకరించాలని కలెక్టర్ కోరారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి స్వరూప రాణి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సువర్ణ, ఎల్‌డీఎం హరిబాబు, రైతు ఉత్పత్తిదారుల సంఘాల ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మారుమూల అటవీ గ్రామాలను సందర్శించిన తహశీల్దార్ మురళీ



**దమ్మపేట, సెప్టెంబర్ 18, :** ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మరియు దమ్మపేట తహశీల్దార్ మద్దినేని మురళీ శుక్రవారం దమ్మపేట మండలంలోని మారుమూల అటవీ గ్రామాలు పూసుకుంట, కట్కూరులను సందర్శించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మురళీ ఈ గ్రామాల్లో ప్రభుత్వ అభివృద్ధి పనులు అయిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను లబ్దిదారులను అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడి మరియు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి పిల్లల చదువు సామర్థ్యాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తుల నుండి సమస్యలను తెలుసుకొని త్వరితగతిన సమస్యలను పరిష్కరించుట కొరకు పని చేస్తాను అని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అన్నదానం మహాదానం.. సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి కూన రాఘవేందర్ గౌడ్



**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 18, :** శ్రీ తారకరామ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ తొలి ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్‌తో కలిసి 291వ డివిజన్ షాపూర్‌నగర్‌కు చెందిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షులు కూన రాఘవేందర్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులు, ప్రజలకు అన్నప్రసాదాన్ని అందించారు. సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావడం ఎంతో సంతోషంగా ఉందని కూన రాఘవేందర్ గౌడ్ పేర్కొన్నారు. సమాజ సేవలో ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని ఆయన ఆకాంక్షించారు. ప్రజల మధ్య ఆత్మీయతను పెంపొందిస్తూ, సేవా స్ఫూర్తిని చాటిచెప్పేలా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించిన శ్రీ తారకరామ యూత్ అసోసియేషన్ సభ్యులను ఆయన అభినందించారు.


## వినాయక నవరాత్రి అన్నదాన కార్యక్రమానికి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు ఆహ్వానం



**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 18, :** వినాయక నవరాత్రి వేడుకల్లో భాగంగా మహదేవపురం వెల్ఫేర్ అసోసియేషన్ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించనున్న అన్నదాన కార్యక్రమానికి ముఖ్య అతిథులను ఆహ్వానించారు. ఈ సందర్భంగా గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజులను వారి నివాసాల్లో కలిసి ఆహ్వాన పత్రికలను అందజేశారు. అన్నదాన కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఆహ్వాన పత్రికలు అందజేసిన వారిలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తెలంగాణ సాయి, అసోసియేషన్ అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, కోశాధికారి నవీన్ రావు, సభ్యులు ప్రవీణ్, యాదగిరి, సింహాచలం, వెంకటేశ్వరులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాభవన్ లో 'ముద్దసాని' ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు

**భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం**



**మానకొండూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 18,:** వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎల్ఎండీ కాలనీలోని ప్రజాభవన్ (ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం) లో శుక్రవారం గణనాథునికి ఊటూరు ప్యాక్స్ చైర్మన్ ముద్దసాని శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో గణపతికి పూజలు, అభిషేక కార్యక్రమాలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. అనంతరం భక్తులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఊటూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (ప్యాక్స్) డైరెక్టర్లు మందల బక్కారెడ్డి, కనవేణి మధునయ్య, గోపు శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు రేమిడి శ్రీనివాసరెడ్డి, రేవెల్లి రాజలింగం, అరవేణి రామాంజనేయులు, తమిశెట్టి రాజేశ్, ముక్కెర సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# హిమ్మత్రావుపేటలో "పోషణమాసం" కార్యక్రమాం

- అంగన్వాడీ పోషకాహారం 'ఆరోగ్యానికి' మేలు
- ఉప సర్పంచ్ పునుగోటి కృష్ణారావు

**చొప్పదండి/కొడిమ్యాల, సెప్టెంబర్ 18,:** కొడిమ్యాల మండలం హిమ్మత్రావుపేటలోని అంగన్వాడీ కేంద్రాలలలో శుక్రవారం ఐసిడిఎస్ మల్యాల ప్రాజెక్టు ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ మల్యాల అనసూర్య అధ్యక్షతన పోషణ మాసం కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి విచ్చేసిన గ్రామ ఉపసర్పంచ్ పునుగోటి కృష్ణారావు సమావేశానికి వచ్చిన తల్లులను ఉద్దేశించి ప్రతి ఒక్క గర్భిణి, బాలింతలు, మూడు నుండి ఆరు సంవత్సరాల పిల్లల కోసం అంగన్వాడీ కేంద్రంలో అనుబంధ పోషకాహారాన్ని తయారు చేయడం జరుగుచున్నది, కావున ప్రతి ఒక్క బెనిఫిషరీ కూడా అంగన్వాడీ కేంద్రంలోని పోషకాహారాన్ని భుజించాలని, ఆరు నెలల నుండి మూడు సంవత్సరాల పిల్లలకి అందించే బాలామృతంను ప్రతిరోజు సరియైన మోతాదులో తినిపించాలని సూచించడం జరిగింది. గర్భిణీలకు శ్రీమంతం వేడుకను జరుపుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో కొడిమ్యాల సెక్టార్ సూపర్వైజర్ ఉమా రాణి, వార్డ్ మెంబర్ లత, అంగన్వాడీ టీచర్స్ రాజమణి, సుశీల, మౌనిక, సుజాత, కనకమ్మ, ఆశ కార్యకర్త రజిత, గర్భిణీలు, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.



# వ్యవసాయ రుణాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి

- రైతులకు అవసరమైన రుణాలు అందించాలి
- పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి
- సిద్దిపేట జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి




**సిద్దిపేట కలెక్టరేట్, సెప్టెంబర్ 18, :** ప్రాధాన్యత రంగాలతో పాటు వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యం ఇచ్చి అర్హులైన వారికి రుణాలు మంజూరు చేయాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి బ్యాంకు అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి సంప్రదింపుల కమిటీ, సమీక్షా సమావేశానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ప్రాధాన్యత రంగాలకు నిర్దేశించిన రుణ లక్ష్యాల సాధనలో పురోగతి బాగుందని తెలిపారు. వ్యవసాయ రంగానికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని, అవసరమైతే రైతుల కోసం ప్రత్యేక రుణమేళాలు నిర్వహించి రుణాలు అందించాలని సూచించారు. వివిధ శాఖల నుంచి రుణాల మంజూరుకు వచ్చిన దరఖాస్తులను పెండింగ్లో ఉంచకుండా వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేలా పరిశ్రమలు, ఉపాధి కల్పన శాఖలు, బ్యాంకులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రబీ రైతులకు సహకారం ఎల్నినో ప్రభావంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కోకుండా రబీ సీజన్లో రుణాల కోసం వచ్చే రైతులకు అవసరమైన సహకారం అందించాలని బ్యాంకు అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా బ్యాంకుల్లో పెండింగ్లో ఉన్న దరఖాస్తులపై వెంటనే స్పందించి అర్హులైన లబ్ధిదారులకు ప్రయోజనం కల్పించాలని సూచించారు. దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యే పరిస్థితి ఉంటే, అర్హులైన లబ్ధిదారులకు అవసరమైన సహకారం అందించాలని తెలిపారు. సెప్టెంబర్లో ప్రత్యేక రుణమేళాలు ప్రాధాన్యత, వ్యవసాయ రంగాల్లో పనితీరు తక్కువగా ఉన్న బ్యాంకులు ప్రత్యేక రుణమేళాలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. సెప్టెంబర్లోగా రుణమేళాలు నిర్వహించి ఆయా బ్యాంకులకు నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని ఆదేశించారు. తదుపరి సమావేశం నాటికి లక్ష్యాలను పూర్తిచేసిన ముగ్గురు ఉత్తమ పనితీరు కనబరిచిన బ్యాంకు అధికారులను సత్కరించాలని సూచించారు. మహిళా సంఘాలకు నిర్దేశించిన మేరకు రుణాలు మంజూరు చేయాలని, లక్ష్యాల సాధనలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



### కొత్త బ్యాంకు శాఖలకు ఆమోదం

సిద్దిపేట జిల్లా చీకోడ్, జగదేవపూర్, కోహెడలోని ఎస్బీఐ శాఖలను బదిలీ చేయడంతో పాటు బ్యాంకింగ్ సేవలు అందుబాటులో లేని చెప్యాల, ఎల్లారెడ్డిపేట, కొండపోచమ్మ దేవాలయం రెవెన్యూ గ్రామాల్లో కొత్త బ్యాంకు శాఖలు ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలకు జిల్లా స్థాయి కమిటీ ఆమోదం తెలిపింది. సమావేశంలో ఎల్డీఎం హరిబాబు, డీఆర్డీఓ రమేష్, ఆర్బీఐ ఎల్డీఓ వెన్న శ్రీనివాస్, ఎస్బీఐ ఆర్ఎం మారుతి, టీజీబీ ఆర్ఎం రాజయ్య, ఏఎండీసీసీబీ జీఎం శ్రీనివాస్, ఆర్ శెట్టి డైరెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 28న కలెక్టరేట్ ధర్నాను జయప్రదం చేయండి




- ఎన్పీఆర్డీ జిల్లా గౌరవాధ్యక్షులు గొడ్డుబర్ల భాస్కర్

**కొమురవెల్లి, సెప్టెంబర్ 18 :** కొమురవెల్లి మండలం గౌరాయపల్లిలో శుక్రవారం వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్పిఆర్డి) సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా జిల్లా గౌరవాధ్యక్షులు గొడ్డుబర్ల భాస్కర్ హాజరై మాట్లాడుతూ 2027 జనాభా లెక్కల్లో కేంద్రం 9 రకాల వైకల్యాలనే నమోదు చేయడం అన్యాయమని, దివ్యాంగుల హక్కుల చట్టం-2016 ప్రకారం 21 రకాల వైకల్యాలను నమోదు చేయాలని డిమాండ్ చేశారు. వికలాంగుల బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీ, కాంట్రాక్టు ఉద్యోగాల్లో 4% రిజర్వేషన్, ఇందిరమ్మ ఇళ్లలో ప్రాధాన్యత, పెన్షన్ రూ.6000కు పెంపు తదితర డిమాండ్ల పరిష్కారం కోసం సెప్టెంబర్ 28న సిద్దిపేట కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి దండ్ల రమేష్, బండకింది అరుణ్, తుమ్మలపల్లి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# గణనాథుడి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి

- గాజులరామారం సర్కిల్లో పలు వినాయక మండపాలను సందర్శించిన కూన శ్రీనివాస్ గౌడ్

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 18, :** గాజులరామారం సర్కిల్ పరిధిలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా వివిధ కాలనీల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను మేడ్చల్-మల్కాజిగిరి డీసీసీ ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్ శుక్రవారం సందర్శించారు. మండపాల నిర్వాహకుల ఆహ్వానం మేరకు బాలాజీ లేఔట్, వీనస్ ఎన్క్లేవ్, జన్నురం, వొక్షిత్ ఎన్క్లేవ్-1, వొక్షిత్ ఎన్క్లేవ్-2 కాలనీల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను ఆయన సందర్శించి, గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కూన శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ విఘ్నేశ్వరుడి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని ఆకాంక్షించారు. ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ప్రశాంతంగా జీవించాలని గణనాథుడిని ప్రార్థించినట్లు తెలిపారు. అనంతరం మండపాల నిర్వాహకులు కూన శ్రీనివాస్ గౌడ్ను శాలువాతో సత్కరించి, స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు బుచ్చిరెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి, సాగర్తో పాటు కాలనీ సభ్యులు గోపాల్ రెడ్డి, శివ, శ్రీకాంత్ రెడ్డి, సూరపు రాజు, కిరణ్, వేణు రాజు, ప్రవీణ్ రెడ్డి, శ్రీనివాస్ రావు, పవన్ గుప్త, సురేష్, అంజన్న, సంజయ్, వినయ్ తదితరులు పాల్గొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



# కాంగ్రెస్ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- కాంగ్రెస్ కరీంనగర్ అసెంబ్లీ ఇంచార్జ్ వెలిచాల రాజేందర్రావు
- వెలిచాలను కలిసిన జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి అనంతుల రమేష్



**కరీంనగర్ ప్రతినిధి, సెప్టెంబర్ 18,:** కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావును జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా నూతనంగా నియమితులైన అనంతుల రమేష్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాజేందర్ రావును కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా నియమితులైన రమేష్కు వెలిచాల రాజేందర్ రావు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలకు వాస్తవాలను వివరిస్తూ తిప్పికొట్టేలా పనిచేయాలని రాజేందర్ రావు సూచించారు. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు ప్రత్యేకంగా కృషి చేయాలని రమేష్కు తెలిపారు. తనను జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా నియమించేందుకు సహకరించిన వెలిచాల రాజేందర్ రావుకు అనంతుల రమేష్ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పార్టీ కార్యక్రమాల కోసం శక్తివంచన లేకుండా పనిచేస్తానని పేర్కొన్నారు.

# మిల్లర్ల సమస్యలు పరిష్కరించాలి

- తహసిల్దార్ కు రైస్ మిల్లర్ల వినతి

**దుబ్బాక ప్రతినిధి, సెప్టెంబర్ 18, :** సిద్దిపేట జిల్లా దుబ్బాక, అక్బర్ పేట-భూంపల్లి తహసిల్దార్ కార్యాలయాలలో శుక్రవారం రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మిల్లర్లు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు చింత రాజు మాట్లాడుతూ క్వింటాల్ ధాన్యానికి 67 కిలోల బియ్యం రావడం లేదని, శాస్త్రీయంగా టెస్ట్ మిల్లింగ్ నిర్వహించి ఖరీఫ్, రబీకి వేర్వేరు అవుట్ టర్న్ నిర్ధారించాలని డిమాండ్ చేశారు. ఎఫ్సీఐ కఠిన నిబంధనలు సడలించాలని, విజిలెన్స్ దాడులు నిలిపివేసి చర్చలు జరపాలన్నారు. రైస్ మిల్లులను వ్యవసాయ అనుబంధ సంస్థలుగా గుర్తించి 200 హెచ్పి వరకు ఎల్టీ కేటగిరీ కింద విద్యుత్ ఇవ్వాలని, 2019 నుండి పెండింగ్లో ఉన్న మిల్లింగ్, ట్రాన్స్ పోర్ట్ చార్జీలు చెల్లించాలని, మిల్లింగ్ చార్జీ రూ.150కి పెంచాలని, 25శాతం పెనాల్టీ, 12శాతం వడ్డీ మాఫీ చేయాలని కోరారు. కార్యక్రమంలో కోశాధికారి కాపర్తి కృష్ణమూర్తి, పూల రాజు, బొమ్మర నరేందర్, మోహన్ రెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



# అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే సంజయ్

- ప్రజలు తిరస్కరించిన అభివృద్ధికి అడ్డుపడడం బాధాకరం
- సమగ్ర పట్టణ అభివృద్ధికి నిరంతరం కృషి

**జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్**

**జగిత్యాల ప్రతినిధి, సెప్టెంబర్ 18,:** ధరూర్ క్యాంప్లో నూతన రహదారులు, తాగునీటి ట్యాంక్ , పైప్ లైన్ పనులను మున్సిపల్ చైర్ పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ తో కలిసి పరిశీలన చేసిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్. ధరూర్ క్యాంప్ రామాలయం నుంచి మెడికల్ కాలేజీ, ప్రభుత్వ ఆసుపత్రి పరిసర ప్రాంతాల వరకు నిర్మిస్తున్న నూతన రహదారి పనులను జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పరిశీలించారు. రహదారి నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకుని, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. అనంతరం కొత్త బస్టాండ్లో చేపడుతున్న నూతన వాటర్ ట్యాంక్, పైప్లైన్ పనులను పరిశీలించారు. ప్రజలకు నిరంతరంగా స్వచ్ఛమైన తాగునీరు అందేలా పనులను సమన్వయంతో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. మెడికల్ కాలేజీ, ఆసుపత్రి పరిసర ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు, తాగునీటి వసతి కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. జగిత్యాల అభివృద్ధి పనులకు ఆటంకం కలిగించవద్దని, ప్రజలు వరుసగా మూడు సార్లు తిరస్కరించిన అదే పనిగా అధికారులకు, అభివృద్ధి పనులకు అడ్డు రావడం బాధాకరం అన్నారు. జగిత్యాల పట్టణంలో నాణ్యతతో పనులు జరుగుతున్నాయని, వర్షం వల్ల బీటీ రోడ్డు కొత్త దెబ్బతింది అని నాణ్యతతో పనులు పూర్తి చేస్తారని అన్నారు. ప్రజలు ఆలోచన చేయాలని ప్రజల సహకారంతో జగిత్యాల అభివృద్ధి చేస్తామన్నారు. జగిత్యాల మున్సిపల్ పరిధిలో దుకాణ సముదాయాల అద్దె లపై మున్సిపల్ కమిషనర్ నీటి మార్కెట్ లో ఉన్న విలువ ఆధారంగా సమీక్ష చేయాలని,అద్దె చెల్లించని వారికి నోటీసులు అందజేసి సీజ్ చేస్తున్నారని తెలిపారు. కుల మత పార్టీలకు అతీతంగా జగిత్యాల పట్టణ అభివృద్ధి అంతిమ లక్ష్యంగా పనిచేస్తాం అన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ సత్య ప్రణవ్, ఆర్ అండ్ బి డిఈ సత్యనారాయణ, మాజీ మున్సిపల్ ఛైర్మన్లు గోలి శ్రీనివాస్, టీపీసీసీ సెక్రటరీ బండ శంకర్, కో ఆప్షన్ సభ్యులు గట్టు సతీష్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు దుమల రాజ్ కుమార్, కౌన్సిలర్లు ప్రశాంత్ రావు, జుంబర్తి రాజ్ కుమార్, కోరుకంటి రాము, తిరుమలయ్య, చీటి లక్ష్మీనారాయణ, నాయకులు సుధాకర్ రావు, ప్రభాకర్, చందా పృథ్వీ, అరుముల్ల పవన్, కప్పల శ్రీకాంత్,రమేష్, స్వామి, ఈశ్వర్,మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్‌ది దృష్టి మళ్లించే రాజకీయాలు

- ధైర్యం ఉంటే నా సవాల్‌ను స్వీకరించండి
- మాజీ మంత్రి హరీశ్‌రావు

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 18, :**
ప్రజా సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయాలు చేస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభా పక్ష ఉపనేత తన్నీరు హరీశ్‌రావు ఆరోపించారు. తన వ్యవసాయ భూమిపై కాంగ్రెస్ ఎంపీల బృందం పర్యటించడం కూడా ఇందులో భాగమేనని అన్నారు. శుక్రవారం సిద్దిపేటలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారూ. రాష్ట్రంలో లక్షలాది ఎకరాలను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని హరీశ్‌రావు అన్నారు. భూములు అమ్ముకోలేక, రుణాలు పొందలేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సిద్దిపేట పరిధిలోని రంగధాంపల్లి, ఎన్సాన్‌పల్లి, మిట్టపల్లి, పొన్నాల తదితర ప్రాంతాల్లో సుమారు మూడు వేల ఇళ్ల స్థలాలు 22ఏ జాబితాలో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు.

**ఆరోపణలు నిరూపిస్తే భూమి అప్పగిస్తా**

తన వ్యవసాయ భూమిపై వస్తున్న ఆరోపణలను హరీశ్‌రావు ఖండించారు. తన భూమికి సంబంధించిన వివరాలను ప్రతి ఎన్నికల అఫిడవిట్‌లో వెల్లడించానని చెప్పారు. 2018 నుంచి 2024 వరకు విడతల వారీగా భూమిని కొనుగోలు చేశానని, ఇందుకు సంబంధించిన పత్రాలు తన వద్ద ఉన్నాయని తెలిపారు. తన భూమికి హద్దులు నిర్ణయించాలని తానే రెవెన్యూ అధికారులను కోరినట్లు చెప్పారు. సర్వేలో తాను రిజిస్ట్రేషన్ చేసుకున్న 13 ఎకరాల 12 గుంటలకు బదులుగా 13 ఎకరాల 10 గుంటలు మాత్రమే తన స్వాధీనంలో ఉన్నట్లు తేలిందన్నారు. తన భూమి కొనుగోలులో చిన్న తప్పు ఉన్నట్లు నిరూపించినా మొత్తం భూమిని ప్రభుత్వానికి అప్పగించేందుకు సిద్ధంగా ఉన్నానని సవాల్ చేశారు. సిద్దిపేటకు వచ్చిన కాంగ్రెస్ ఎంపీల బృందాన్ని స్థానిక ఎమ్మెల్యేగా స్వాగతించేందుకు, తన వ్యవసాయ భూమిని స్వయంగా చూపించేందుకు సిద్ధంగా ఉన్నానని హరీశ్‌రావు అన్నారు. అదే సమయంలో 22ఏ భూముల సమస్యతో ఇబ్బందులు పడుతున్న ప్రజలను, ఆగిపోయిన అభివృద్ధి పనులను కూడా ఎంపీలకు చూపించాలనుకున్నట్లు తెలిపారు.సిద్దిపేటలో నిర్మాణం దాదాపు పూర్తయిన వెయ్యి పడకల ఆసుపత్రి, నిలిచిపోయిన నర్సింగ్ కళాశాల పనులు, రంగనాయకసాగర్ వద్ద ఆగిపోయిన పర్యాటక ప్రాజెక్టులను ఎంపీలకు చూపించాలని భావించినట్లు చెప్పారు.

**రైతుల సమస్యలు పరిష్కరించాలి**



సిద్దిపేటలో రైతులు విద్యుత్, సాగునీరు, రుణమాఫీ వంటి సమస్యలను ఎదుర్కొంటున్నారని హరీశ్‌రావు అన్నారు. ఇంకా రుణమాఫీ కాని రైతులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆటో డ్రైవర్లు, మహిళలకు ఇచ్చిన హామీలను కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంపై ఎంపీలు ఒత్తిడి తేవాలి రాష్ట్ర ప్రయోజనాల కోసం కాంగ్రెస్ ఎంపీలు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని హరీశ్‌రావు సూచించారు. కాళేశ్వరం, ఇతర ప్రాజెక్టుల అనుమతులు, గోదావరి జలాల వినియోగం, ప్రాంతీయ రహదారుల పనులు, మెట్రో విస్తరణ, పాలమూరు ఎత్తిపోతల, సీతమ్మసాగర్ వంటి అంశాలపై కేంద్రాన్ని ప్రశ్నించాలని అన్నారు. రెవెన్యూ శాఖలో తహసీల్దార్లు, ఆర్డీవోలు, కలెక్టర్లు, భూ పరిపాలన వ్యవస్థ ఉన్నప్పుడు ఎంపీలు భూములను కొలుస్తామని, అధికారులకు ఆదేశాలు ఇస్తామని చెప్పడం సరికాదన్నారు. కేసీఆర్ దళితుల భూములను కబ్జా చేశారంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గతంలో చేసిన ఆరోపణలపై కూడా హరీశ్‌రావు స్పందించారు. విచారణలో కేసీఆర్ వద్ద దళితుల భూములు లేవని తేలితే ముఖ్యమంత్రి, మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నారా అని ప్రశ్నించారు. తనపై వచ్చిన ఆరోపణల్లో ఏదైనా తప్పు నిరూపితమైతే రాజకీయంగా, ఆస్తుల పరంగా బాధ్యత వహించేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగుతుంది ప్రభుత్వం తమపై రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడుతున్నా ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగిస్తామని హరీశ్‌రావు అన్నారు. 22ఏ భూముల సమస్యతో పాటు రైతుల సాగునీరు, విద్యుత్, రుణమాఫీ తదితర సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని స్పష్టం చేశారు.

# ప్రభుత్వ విప్ ఆదికి సీఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు



**హైదరాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 18,:**
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలోని ముఖ్యమంత్రి ఛాంబర్లో శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కి జన్మదినం సందర్భంగా ముఖ్యమంత్రి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజా సేవలో నిమగ్నమై రాష్ట్ర అభివృద్ధికి, రాష్ట్రంలో ప్రజా పాలనలో భాగస్వామ్యం కావడానికి భగవంతుడు సంపూర్ణ ఆరోగ్యాలు ప్రసాదించాలని తెలియజేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, అజహరుద్దీన్, ఎమ్మెల్యేలు రాందాస్ నాయక్, బొజ్జు, వీరేశం, ఆదినారాయణ, రాగమయి తదితరులు పాల్గొన్నారు.

# యంగ్ ఇండియా స్కూల్ స్థల పరిశీలన చేసిన ఎమ్మెల్యే

**జగిత్యాల ప్రతినిధి, సెప్టెంబర్ 18,:**
తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా యంగ్ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ మంజూరు చేయగా జగిత్యాల నియోజకవర్గంలోని తాటిపల్లి శివారులో 25 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్న యంగ్ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. శుక్రవారం నాడు సంబంధిత ఉన్నత స్థాయి అధికారులు యండి గణపతి రెడ్డి, సిఈ లక్ష్మ రెడ్డి, ప్రజా ప్రతినిధులతో కలిసి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే సంజయ్ కుమార్. పేద కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్యతో పాటు వసతి, భోజనం, క్రీడలు, నైపుణ్యాభివృద్ధి వంటి సౌకర్యాలను ఒకే ప్రాంగణంలో అందించడం ముఖ్య ఉద్దేశమని అన్నారు. 2500 మంది విద్యార్థులకు, 300 మంది స్టాఫ్ కు ఆధునిక విద్యా సదుపాయాలు ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత విద్య వరకు సమగ్ర విద్యహాస్టల్, భోజనం వంటి వసతి సౌకర్యాలు ప్రభుత్వం కల్పించబోతుంది అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో విద్య వైద్యానికి ప్రభుత్వం ప్రాధాన్యం కల్పిస్తుందని అన్నారు. అధికారులు, సైట్ ఇంజనీర్లతో మాట్లాడి యండి గణపతి రెడ్డి ఆలోచనకు అనుగుణంగా జిప్లస్3 లో నిర్మాణాలు చేపట్టనున్నామని తెలిపారు. క్రీడా మైదానం,పాఠశాల బ్లాక్,వసతి గృహాలు నిర్మాణ స్థలాన్ని,సంబంధిత మ్యాప్ ను పరిశీలించారు. కొందరు సీనియర్ నాయకులు కావాలని బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని మోరం అమ్మే అవసరం ఎవరికి లేదని అభివృద్ధి పనులకు అడ్డం పడవద్దని హితవు పలికారు. ఇందిరమ్మ రాజ్యం లో 2008 లో అర్బన్ హౌసింగ్ కాలనిలో ఇండ్లు ఇస్తే ఇప్పటి ఇందిరమ్మ రాజ్యం లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన 8నెలల్లో ఒక్కరు ఒక్క కరెంట్ కనెక్షన్ తీసుకోలేదని వారి నిర్లక్ష్య వైఖరికి నిదర్శనం అని అన్నారు. నేడు 1500 కుటుంబాలు నివాసం ఉంటున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజా గౌడ్, ఆత్మ చైర్మెన్ కాటిపెళ్ళి గంగారెడ్డి, సర్పంచులు బొలిశెట్టి గంగారెడ్డి, కట్ట రాజేందర్, నోముల శేఖర్ రెడ్డి, తహసీల్దార్ హకీం, ఏఈ శశి, జగిత్యాల అసెంబ్లీ కాంగ్రెస్ యూత్ అధ్యక్షులు కర్నె భూమరెడ్డి, జిల్లా కాంగ్రెస్ ఉప అధ్యక్షులు ముఖీద్, అబ్బూరి మల్లేశం గౌడ్, నలువల సురేష్, ఏఎంసి డైరెక్టర్ గడ్డం గంగారెడ్డి, సదానందం, స్వామి రెడ్డి, తంగెళ్ల రమేష్, ఏనుగు మల్లారెడ్డి శేఖర్, ప్రజా ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు .



# గణేష్ ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు చేసిన ఆడువాల జ్యోతి లక్ష్మణ్

- పురానిపేట్ కాలనీ వాసుల తొమ్మిది రోజుల అన్నదాన కార్యక్రమానికి అభినందనలు

**జగిత్యాల ప్రతినిధి, సెప్టెంబర్ 18,:**
జగిత్యాల పట్టణంలోని 44వ వార్డులో శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్న గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆడువాల జ్యోతి లక్ష్మణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన కుంకుమ పూజలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురానిపేట్ కాలనీ వాసుల ఆధ్వర్యంలో గణేష్ నవరాత్రుల సందర్భంగా తొమ్మిది రోజుల పాటు ప్రతిరోజూ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం పట్ల ఆడువాల జ్యోతి లక్ష్మణ్ నిర్వాహకులను, కాలనీ వాసులను అభినందించారు. భక్తిశ్రద్ధలతో ఉత్సవాలను నిర్వహిస్తూ, అన్నదానం ద్వారా భక్తులకు సేవ చేయడం అభినందనీయమని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, జగిత్యాల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కొత్త మోహన్, ఆంజనేయస్వామి ఆలయ కమిటీ అధ్యక్షులు కొత్త ప్రతాప్, ఉత్సవ కమిటీ సభ్యులు ఓరిగంటి నగేష్, మహేష్, సంతోష్, బట్టు అనూప్, వినోద్, శేఖర్, అశోక్, ఆలయ నిర్వాహకులు, పురానిపేట్ కాలనీ వాసులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# అంగన్వాడీ పిల్లలతో సరదాగా కలెక్టర్ సత్యప్రసాద్

- బుజ్జి బుజ్జి మాటలకు మురిసిన కలెక్టర్.. చిన్నారులకు అభినందనలు
- అంగన్వాడి చిన్నారులతో ముచ్చటిస్తూ మురిసిపోయిన కలెక్టర్

**జగిత్యాల /కథలాపూర్, సెప్టెంబర్ 18,:**
కథలాపూర్ మండలం ఇప్పపెల్లి గ్రామంలోని అంగన్వాడీ చిన్నారులతో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సరదాగా ముచ్చటిస్తూ సందడి చేశారు. అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ చిన్నారుల వద్దకు వెళ్లి ఆప్యాయంగా పలకరించారు. వారి పేర్లు, చదువు, ఇష్టమైన ఆటలు, పాటల గురించి అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ అడిగిన ప్రశ్నలకు చిన్నారులు తమదైన శైలిలో బుజ్జి బుజ్జి సమాధానాలు ఇచ్చారు. చిన్నారుల సమాధానాలు విన్న కలెక్టర్ సంతోషం వ్యక్తం చేస్తూ వారిని అభినందించారు. కొంతమంది చిన్నారులు ధైర్యంగా ఎబిసిడి లు, 1,2,3 లు చెప్పి తమ ప్రతిభను ప్రదర్శించారు. పిల్లల చురుకుదనం, సమయస్ఫూర్తిని చూసి కలెక్టర్ మురిసిపోయారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు అందుతున్న సౌకర్యాలను కలెక్టర్ పరిశీలించారు. పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం, మెనూ అమలు, పరిశుభ్రత తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. చిన్నారుల ఆరోగ్యం, పోషణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిబ్బందికి సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల్లో పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామంలోని జనాభా, మహిళా సంఘాల వివరాలు, గ్రామం లో ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి పనుల వివరాలను సర్పంచ్ సంబ నవీన్ ను కలెక్టర్ కు వివరించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి గ్రామభివృద్ధిలో పాలు పంచుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ జీవాకర్ రెడ్డి, డిఈవో రాము, డిపివో మదన్ మోహన్, తహసీల్దార్, ఎంపిడివో, ఇప్పపెల్లి గ్రామ సర్పంచ్ సంబ నవీన్, వార్డు సభ్యులు, గ్రామస్థులు అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# లంబోదరుడి కృపాకటాక్షాలు భక్తులందరిపై సంపూర్ణంగా ఉండాలి



- బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 18, :**
వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని 125వ డివిజన్ గాజులరామారంలో చైతన్య వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ మాట్లాడుతూ.. ప్రథమ పూజ్యుడైన విఘ్నేశ్వరుడి కృపాకటాక్షాలు భక్తులందరిపై సంపూర్ణంగా ఉండాలని ఆకాంక్షించారు. వినాయకుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో చైతన్య వెల్ఫేర్ సొసైటీ సభ్యులు లక్ష్మణ్, శివకుమార్ (లడ్డూ), అఖిల్ సాయినాథ్, రాజశేఖర్, చైతన్య, మహేష్ కుమార్, నిఖిల్, బాబీ, మురళీకృష్ణ, బంటి, చింటూ, మల్లికార్జున్, విజయ్ కుమార్, నరేష్‌తో పాటు స్థానిక బీఆర్ఎస్ నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# మోదీ జన్మదినం సందర్భంగా మాణిక్యేశ్వరమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

- ప్రజాసేవలో 25 ఏళ్ల ప్రస్థానానికి గుర్తుగా దీపాలు వెలిగించిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు



**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 18, :**
భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని ఓబీసీ మోర్చా మేడ్చల్ జిల్లా అధ్యక్షులు జేకే శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం జగద్గిరిగుట్ట కొండపై ఉన్న మాణిక్యేశ్వరమ్మ ఆలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రధాని నరేంద్ర మోదీ ఆయురారోగ్యాలతో, సంపూర్ణ ఆరోగ్యంతో దేశానికి మరింత సేవలందించాలని ఆకాంక్షిస్తూ బీజేపీ నాయకులు, కార్యకర్తలు దీపాలు వెలిగించారు. ప్రజాసేవలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సుపరిపాలన, సంక్షేమం, దేశ నిర్మాణం కోసం నిరంతరం కృషి చేస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి శుభాకాంక్షలు తెలిపారు. దేశ ప్రగతి, ప్రజా సంక్షేమం కోసం ఆయన చేపడుతున్న కార్యక్రమాలు మరింత విజయవంతం కావాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ఓబీసీ మోర్చా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నవరాత్రి ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు

- విఘ్నేశ్వరుని ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలి: బీఆర్‌టీయూ రాష్ట్ర నాయకుడు రవి



**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 18, :** శేర్లింగంపల్లి నియోజకవర్గం ఎల్లమ్మబండ ప్రాంతంలో కాలనీవాసులు నిర్వహిస్తున్న గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో బీఆర్‌టీయూ రాష్ట్ర కార్మిక నాయకుడు, శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి పాల్గొని వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణేష్ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు ఉత్సవాల్లో పాల్గొన్న రవి, విఘ్నేశ్వరుని ఆశీస్సులతో కాలనీ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ప్రజలంతా భక్తిశ్రద్ధలతో పండుగను ఆనందంగా జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గణేష్ కమిటీ సభ్యులు సంతోష్ గౌడ్, జగన్, సుదర్శన్, కిరణ్‌తో పాటు కాలనీవాసులు, ప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కొలన్ సులోచనమ్మ దశదినకర్మకు హాజరై నివాళులర్పించిన భూపతిరెడ్డి



**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 18, :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హనుమంత్ రెడ్డి మాతృమూర్తి కొలన్ సులోచనమ్మ దశదినకర్మ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి హాజరై సులోచనమ్మ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో బౌరంపేట్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అర్కల విజయ్ గౌడ్, దూలపల్లి డివిజన్ అధ్యక్షులు శివకుమార్ గౌడ్, ప్రగతినగర్ డివిజన్ అధ్యక్షులు బొమ్ము వెంకటేశ్వర రెడ్డి, జగద్గిరిగుట్ట డివిజన్ అధ్యక్షురాలు హైమావతి రెడ్డి, పద్మనగర్ డివిజన్ అధ్యక్షులు గడ్డం రాజేందర్ రెడ్డి, సుభాష్‌నగర్ డివిజన్ అధ్యక్షులు నాగిరెడ్డి, గణేష్‌నగర్ డివిజన్ అధ్యక్షులు ఇరుగు రాధాకృష్ణ, మహిళా కాంగ్రెస్ నాయకురాలు కడియాల ఇందిరా, సీనియర్ కాంగ్రెస్ నాయకులు దమ్మని శ్రవణ్ కుమార్, సయ్యద్ రషీద్, నరేందర్ రెడ్డి, తంగా లక్ష్మారెడ్డి, సాల్మన్ రాజ్, దాసరి మహేష్, బత్తుల చిరంజీవి, చింతకింది సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## పౌష్టికహారంతో తల్లులు, పిల్లలకు ఆరోగ్యం

### ఐసిడిఎస్ సూపర్వైజర్ సుధారాణి



**చొప్పదండి/కొడిమ్యాల, సెప్టెంబర్ 18,:** కొడిమ్యాల మండలంలోని అప్పారావుపేట గ్రామంలోని అంగన్వాడి కేంద్రంలో మల్యాల ప్రాజెక్టు ఆధ్వర్యంలో శుక్రవారం పోషణ మాసం కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో పూడూర్ సెక్టార్ ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎన్. సుధారాణి తల్లులను ఉద్దేశించి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రంలో లభించే అనుబంధ పోషకాహారంను ప్రతి గర్భిణి బాలింత తప్పనిసరిగా తీసుకోవాలని, అంగన్వాడి కేంద్రంలో రోజు ఒక మెనూతో వంట చేయడం జరుగుతుంది కాబట్టి అందరు కూడా పోషకాహారాన్ని అంగన్వాడీ కేంద్రంలో భుజించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ తిరుపతి రెడ్డి, బి. నర్సింహ రెడ్డి, వార్డు సభ్యులు రేణుక, అంగన్వాడీ టీచర్ పద్మ,తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జనం ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్

**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 18, :** సంగారెడ్డి పట్టణంలో వినాయక నిమజ్జనం సందర్భంగా చెరువు కట్ట వద్ద నిమజ్జనం, భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ శుక్రవారం పరిశీలించారు. నిమజ్జన ప్రాంతంలో ఏర్పాటు చేసిన లైటింగ్, బ్యారికేడింగ్, భద్రతా చర్యలు, ఇతర మౌలిక సదుపాయాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ పాలకవర్గ సభ్యులు మాట్లాడుతూ వినాయక నిమజ్జనం ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా మున్సిపల్ శాఖ తరఫున అన్ని అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ పాలకవర్గ సభ్యులు, నాయకులు కూన సంతోష్, మహేష్, శ్రీకాంత్ గౌడ్, సతీష్ రెడ్డి, వెంకట్రాజు, నవాజ్, వంశీ, అశ్విన్, హరీష్, ప్రశాంత్, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సాజిద్, నాయకులు నరేన్, వీరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై కదంతొక్కిన తెలంగాణ రక్షణ సేన

- ఉద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి
- ఉద్యోగ జెఏసి చేసే పోరాటానికి తెలంగాణ రక్షణ సేన సంపూర్ణ మద్దతు
- టిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్



**కరీంనగర్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 18,:** కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయ రిటైర్డ్ ఎంప్లయిస్ సమస్యలపై తెలంగాణ రక్షణ సేన జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల, ఉపాధ్యాయుల, రిటైర్డ్ ఎంప్లాయిస్లకు ఉన్న న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని వారు కోరినారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఉద్యోగ, ఉపాధ్యాయులు తమ ఉద్యోగాలను సైతం పక్కనపెట్టి రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని అలాంటి ఉద్యోగుల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వం కమిటీలతో కాలయాపన చెయ్యకుండా వారి వారికి న్యాయం చెయ్యాలి. ఉద్యోగులు ప్రభుత్వానికి బానిసలు కాదని వారు కూడ పరిపాలనలో భాగమే ప్రజలకు మెరుగైన పాలన అందించడంలో ఉద్యోగులది కీలకమైన భాగస్వామ్యం అని తెలంగాణ రక్షణ సేన జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ అన్నారు. ఉద్యోగ సంఘాలు పెండింగ్ డిఏలు, పిఆర్సి అమలు, ఈహెచ్ఎస్ , పెండింగ్ బిల్లులు, ఓపిఎస్ వంటి పలు అంశాలను కూడ త్వరగా పరిష్కారం చెయ్యాలని. ప్రభుత్వం హామీలు కాదు ఉత్తర్వు ల్లో అమలులో కనిపించాలి. ప్రభుత్వ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు అనేక హామీలు ఇచ్చిన ప్రభుత్వం ఇప్పుడు వారి సమస్యలను పరిష్కరించడంలో ఆలస్యం చేయడం బాధాకరమని పలువురు ఉద్యోగ సంఘాల నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, రిటైర్డ్ ఎంప్లాయిస్ నాయకులు జాడి శ్రీనివాస్, తానిపర్తి తిరుపతి రావు, మల్లిక్, కిషన్ నాయక్, రవి నాయక్, రేలెల్లి తిరుపతి, పాట నర్సయ్య శ్రీనివాస్, గంధ్ర రవీందర్ రావు, శ్రీరాముల బాల సురేం దర్, కోటేశ్వర్, టిఆర్ఎస్ కరీంనగర్ పార్లమెంట్ ఇంచార్జ్ లింగంపల్లి శ్రీనివాస్, కరీంనగర్ నియోజకవర్గ ఇంచార్జ్ అంకం శివరాణి, మానకొండూరు నియోజకవర్గం ఇంచార్జ్ చెన్నమల్ల చైతన్య, మహిళా విభాగం అధ్యక్షురాలు పిన్నింటి సంగీత రెడ్డి, నగర పార్టీ అధ్యక్షులు రంగరవేణి లక్ష్మణ్, జిల్లా నాయకులు మేకల తిరుపతి, కుతాడి శ్రీనివాస్, బసవేని రాజేందర్, బుడిగ పర్శారం గౌడ్, గర్శకుర్తి విద్యా సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## కేజీబీవీని ఆకస్మికంగా తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

- పదో తరగతి విద్యార్థినులకు విద్యాభ్యాసం, పరీక్షల సన్నద్ధతపై మార్గనిర్దేశం

**జగిత్యాల/గొల్లపెల్లి, సెప్టెంబర్ 18,:** గొల్లపెల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)ను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లత శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థినులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. భోజనం నాణ్యత, రుచితో పాటు విద్యార్థినులకు అందుతున్న ఆహారంపై వివరాలను సంబంధిత సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి, వారి విద్యాభ్యాసం, పరీక్షల సన్నద్ధతపై మార్గనిర్దేశం చేశారు. పదో తరగతి పరీక్షలను దృష్టిలో ఉంచుకొని విద్యార్థినులు క్రమశిక్షణతో చదువుతూ, సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థిని తన లక్ష్యాన్ని నిర్దేశించుకొని, ఉన్నత విద్యను అభ్యసించే దిశగా ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తూ, పరీక్షల కోసం అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని సూచించారు. పాఠశాలలో విద్యార్థినులకు అందుతున్న విద్య, వసతి, భోజనం తదితర సౌకర్యాలను నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో తహసీల్దార్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు ఉన్నారు.



## విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి

- కరీంనగర్ ప్రజలను చల్లగా చూడాలి స్వామి గణేశా
- పలు గణనాథులను దర్శించుకున్న వెలిచాల రాజేందర్‌రావు దంపతులు



**కరీంనగర్ ప్రతినిధి, సెప్టెంబర్ 18,:** విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో కరీంనగర్ ప్రజలంతా సుఖసంతోషాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు ఆకాంక్షించారు. వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆయన తన సతీమణి రేఖతో కలిసి నగరంలోని పలు గణేష్ మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా మండపాల వద్ద నిర్వాహకులు, కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజలు రాజేందర్‌రావు దంపతులకు ఘన స్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా రాజేందర్‌రావు మాట్లాడుతూ కరీంనగర్ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని గణనాథుడిని ప్రార్థించినట్లు తెలిపారు. నగరంలో వినాయక ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయని పేర్కొన్నారు. హౌసింగ్ బోర్డు కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని వెలిచాల రాజేందర్‌రావు ప్రారంభించారు. అనంతరం భక్తులకు స్వయంగా అన్నదానం వడ్డించారు. ఈ కార్యక్రమాల్లో కరీంనగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న, కార్పొరేటర్లు పడాల శ్రీజ అజయ్, పడిశెట్టి వసంత లక్ష్మి భూమయ్య, ఆకుల నందిని ఉదయ్, కాంగ్రెస్ నాయకులు, సర్పంచ్ నిమ్మల అంజన్న, ఆకుల ప్రకాష్, వేల్పుల వెంకటేష్, మిడిదొడ్డి కపిల్ మాధవ్, సముద్రాల రమణారావు, అనంతుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## జగద్గిరిగుట్ట ప్రజా సమస్యలపై బీసీ స్పందనకు జేకే శేకర్ యాదవ్ వినతి

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 18, :** చింతల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ స్పందనను ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు జేకే శేఖర్ యాదవ్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జగద్గిరిగుట్టలోని ప్రజా సమస్యలను డీసీ దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రం అందజేశారు. గతంలో గాంధీనగర్‌లో ఏర్పాటు చేసిన సర్కిల్ కార్యాలయాన్ని జగద్గిరిగుట్ట వార్డు కార్యాలయానికి మార్చాలని అప్పటి జోనల్ కమిషనర్ సంజయ్‌కు వినతిపత్రం అందజేసినట్లు జేకే శేఖర్ యాదవ్ తెలిపారు. గాంధీనగర్ కార్యాలయం వద్ద పార్కింగ్ సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, జగద్గిరిగుట్టలో కార్యాలయం ఏర్పాటు చేస్తే ప్రజలకు మరింత అనుకూలంగా ఉంటుందని అప్పట్లో కోరినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఆ కార్యాలయం జగద్గిరిగుట్టకు రావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. అదేవిధంగా జగద్గిరిగుట్ట ప్రాంతంలోని సర్వే నంబర్ 348/1లో ప్రభుత్వ భూమి ఉన్న నేపథ్యంలో అక్కడ నిరుపేదలు నిర్మించుకున్న ఇళ్లకు ఇంటి నంబర్లు కేటాయించాలని డీసీని కోరారు. కొంతమందికి పట్టాలు మంజూరైనప్పటికీ, స్థలాలు రిజిస్ట్రేషన్ కాకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. నోటరీ పత్రాలు తదితర ఆధారాలతో ఇళ్లు ఉన్నట్లు నిర్ధారణ అయితే ఆయా ఇళ్లకు ఇంటి నంబర్లు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయాలపై డీసీ స్పందన సానుకూలంగా స్పందిస్తూ, సమస్యను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు జేకే శేఖర్ యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్ధం రెడ్డి, జగన్ ముదిరాజ్, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.



## డిజెఎఫ్ రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్ ఆవిష్కరించిన ఎంపీ రఘునందన్‌రావు

- అక్టోబర్ 7న సంగారెడ్డిలో 11వ రాష్ట్ర మహాసభలకు ఎంపీకి ఆహ్వానం

**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 18, :** దళిత జర్నలిస్టుల ఫోరం ఆధ్వర్యంలో అక్టోబర్ 7న సంగారెడ్డిలో నిర్వహించనున్న 11వ రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్‌ను మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిజెఎఫ్ నాయకులు ఎంపీని కలిసి మహాసభలకు ఆహ్వానించారు. శుక్రవారం సంగారెడ్డి పట్టణంలో డిజెఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు తలారి యాదగిరి, ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు రాపాక విజయరాజు, జిల్లా అధ్యక్షుడు రామని అశోక్ ఆధ్వర్యంలో నాయకులు ఎంపీని కలిశారు. మహాసభల నిర్వహణ, లక్ష్యాలు, దళిత జర్నలిస్టుల సమస్యలు, ప్రధాన డిమాండ్లను ఆయనకు వివరించారు. పోతిరెడ్డిపల్లి ఎక్స్ రోడ్‌లోని పీఎస్ఆర్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. దళిత జర్నలిస్టుల హక్కుల సాధన, సమస్యల పరిష్కారం, సామాజిక న్యాయం కోసం మహాసభల్లో పలు తీర్మానాలు చేయనున్నట్లు పేర్కొన్నారు. దళిత జర్నలిస్టులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు, అర్హులందరికీ అక్రిడిటేషన్, ఇళ్ల స్థలాలు, పిల్లలకు ఉచిత విద్య, కుటుంబ సభ్యులకు పరిమితి లేని వైద్య సదుపాయం, ఉచిత బస్, రైలు పాసులు కల్పించాలని కోరారు. అభయహస్తం కింద రూ.12 లక్షలు, అకాల మరణం చెందిన జర్నలిస్టుల కుటుంబాలకు రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా, నిరుద్యోగ భృతిగా నెలకు రూ.15 వేలు అందించాలని విజ్ఞప్తి చేశారు. సీనియర్ దళిత జర్నలిస్టులకు నామినేటెడ్ పదవులతో పాటు ప్రెస్ అకాడమీ చైర్మన్, సభ్యులుగా అవకాశం కల్పించాలని కోరారు. మహాసభలను విజయవంతం చేసేందుకు జర్నలిస్టులు, మేధావులు, ప్రజా సంఘాలు సహకరించాలని డిజెఎఫ్ నాయకులు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో తెలంగాణ అంబేద్కర్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొండాపురం జగన్, డిజెఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, సీనియర్ జర్నలిస్ట్ దేవదాసు, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ దాసు, డిజెఎఫ్ జిల్లా కార్యదర్శి శంకర్, సలహాదారు మీనంపల్లి కిషన్‌రావు, జిల్లా కార్యదర్శి ముక్కగల్ల యాదన్న, జిల్లా ఉపాధ్యక్షుడు దానం మోహన్ , మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.



# అన్య భాషా మాధ్యమం వద్దు..

# తెలుగు మాధ్యమమే ముద్దు

## నేడు తెలుగు మాధ్యమాల దినోత్సవం

**తెలుగు మాధ్యమాల దినోత్సవం ప్రతి సంవత్సరం సెప్టెంబరు 19న నిర్వహించబడుతుంది. తెలుగు మాధ్యమాలలో వాడుక భాషను విజయవంతంగా ప్రవేశపెట్టిన తాపీ ధర్మారావు గుర్తుగా ఆయన జన్మదినం రోజున ఈ దినోత్సవం జరుపు బడుతుంది.**

ప్రపంచ వ్యాప్తంగా ఉన్న విజ్ఞానాన్ని తెలుసుకోవడం, తెలుసుకున్న జ్ఞానాన్ని అనుభవాన్ని సంస్కృతిని, సంప్రదాయాన్ని తర్వాతి తరాలకు అందించడానికి ఉపకరించే సాధనం మాతృభాష. గతానికి వర్తమానానికి భవిష్యత్తుకు వారధి కూడా మాతృభాషే. భాష అనేది చరిత్ర గమనానికి, సామాజిక పరిణామానికి మూలాధారం. మాతృభాష అనగా శిశువుకు తల్లి ఉగ్గుపాలతో నేర్పినటువంటి భాష. ఈ మాతృభాష ప్రతి శిశువుకు సహజంగా ఎలాంటి ప్రయత్నం అవసరం లేకుండానే వస్తుంది. మాతృభాష ద్వారా నేర్చుకున్న విద్య సులభంగా అవగత మవుతుంది. అంతేకాక విద్యార్థిలో ఉన్న సృజనాత్మక శక్తులను వెలికి తీస్తుంది. తద్వారా ఇతర భాషలు నేర్చుకోవడానికి మాతృ భాష ఎంతో సహాయకారిగా ఉంటుంది. ప్రాథమిక స్థాయిలో మాతృభాషా మాధ్యమం అనివార్యమైన అవసరమని భారత రాజ్యాంగం (అధికరణం 350 ఎ), కొఠారి కమిషన్ చెప్పింది. 2010లో భారత ప్రభుత్వం తెచ్చిన విద్యాహక్కు చట్టం విభాగం 29(2)లో ఎలిమెంటరీ స్థాయిలో వీలైనంత వరకు మాతృభాషా మాధ్యమాన్నే అమలు చేయాలని నిర్దేశించింది. నూతన జాతీయ విద్యా విధానం (2020) కూడా ఐదవ తరగతి వరకు మాతృభాష లోనే బోధన జరగాలి అని చెబుతోంది. అంతర్జాతీయ సంస్థలైన- యునెస్కో, వరల్డ్ బ్యాంక్, వరల్డ్ డిక్లరేషన్ ఆన్ ఎడ్యుకేషనల్ ఫర్ ఆల్ (ఎఫ్ఎఫ్ఏ) జనరల్ అసెంబ్లీ లాంటి సంస్థలన్నీ పిల్లలకు ప్రాథమిక విద్యని మాతృభాషలో నేర్చుకునే హక్కుందని నిర్ధారించాయి. ప్రాథమిక స్థాయి వరకు తెలుగు మాధ్యమం లోనే విద్యాబోధన చేసి 6వ తరగతి తరువాత ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టాలని, తెలుగు, ఆంగ్ల మాధ్యమాలు రెండింటినీ కొనసాగిస్తే ఎవరికి ఇష్టమైన మాధ్యమంలో వాళ్లు విద్యాభ్యాసం చేస్తారనేది అనేకమంది వాదన. వాస్తవానికి తెలుగు మాధ్యమాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నది తెలుగు జాతి. ప్రపంచంలో "మా తల్లి భాష మాకొద్దు, ఇతర భాషలు ముద్దు" అని చెప్పగలిగే జాతి ఏదైనా ఉంది అంటే నిస్సిగ్గుగా అది తెలుగు జాతి మాత్రమే. "తెలుగుకు" పట్టిన ఈ "తెగులు" ఈనాటిది కాదు. కాలక్రమేణ, అవిభక్త ఆంధ్ర దేశం పూర్తిగా మారిపోయి ప్రస్తుతం ఆంగ్ల దేశంగా రూపుదిద్దుకుంటోంది.

ఆంగ్ల మాధ్యమంలో చదివితే పిల్లలు గొప్పవారు కాగలరని, తెలుగు మాట్లాడితే చులకన అనే భావన వల్ల, ఆంగ్ల భాషకు ప్రాధాన్యత పెరిగి, తెలుగు భాష నిరంతర నిర్లక్ష్యానికి గురి అవుతున్నది. తెలుగు భాషను నికోలో కొంటి "ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్" అని 1402 లోనే ప్రశంసించారు. పరభాషా ద్వారా ప్రాథమిక తరగతుల విద్యార్థులకు పాఠాలు చెప్పే విధానం పూర్తిగా అశాస్త్రీయమని, కాలహరణ హేతువని, బావి పౌరులను బానిసలుగా చేస్తుందని విద్యా వేత్తలు అభిప్రాయ పడుతున్నారు. పిల్లల సొంత ఆలోచనలను పెంపొందించడానికి, వారి సాంస్కృతిక వారసత్వానికి మార్గం ఏర్పడుతుందని, విజ్ఞానానికి - విద్యార్థులకు మధ్య ఒక అడ్డుగోడలా సృష్టిస్తుందని, తమ చుట్టూ ఉన్న జీవిత విలువలను తెలియని విద్యార్థులను, విషయ పరిజ్ఞానం లోతుగా తెలిసిన, ఉపాధ్యాయులు చెప్పింది చెప్పినట్లు, నోట్సు కాపీ చేస్తూ, కంఠస్థం చేసే యంత్రాలుగా మారుస్తుందని విద్యాధికుల, మానసిక శాస్త్ర వేత్తల భావన. తనకు జాతి, సాధికారిక ఏమాత్రం చేకూర్చని భాషకు సంబంధించిన విషయాలను, బట్టీ పట్టి తమ తల్లిదండ్రులను మురిపించ చేస్తూ, తమను తాము, తమ పోషకులను, మోసం చేసుకోవడం అవుతుందని విజ్ఞులు, ప్రాజ్ఞులు ఎంత మొత్తుకున్నా, అర్ధం చేసుకోనివారు భూతద్దానికి అగుపించడం లేదంటే అతిశయోక్తి లేదు... మొగల్ చక్రవర్తి ఔరంగజేబు అరబ్బీ భాషలో తనకు పాఠాలు బోధించి, తన బాల్యం అంతా వృధా పరిచాడని, తన గురువుకు రాజ్య బహిష్కరణ లాంటి తీవ్ర శిక్ష విధించిన విషయం చరిత్ర చెప్తుంది. ఔరంగజేబు తన గురువుకు రాసిన నాటి చారిత్రాత్మక ఉత్తరాన్ని 1910లో కొమర్రాజు లక్ష్మణరావు తెలుగులోకి అనువదించడమే కాక, తన కాలం నాటి ఆంగ్ల మాధ్యమం చదువుల వల్ల భవిష్యత్ తరాలు ఔరంగజేబు లాగా మనలను తప్పు పడతా యని హెచ్చరించారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రములో, కేజీ నుండి పూర్తిగా ఆంగ్ల మాధ్యమం పెడదామన్న మాజీ సీఎం జగన్ ప్రభుత్వ నిర్ణయాన్ని, హై కోర్టు నిర్ద్వందంగా త్రోసి పుచ్చింది. ఇదైనా పాలకులకు గుణపాఠం కావాలి. ప్రైవేటు పాఠశాలలో తెలుగు మాధ్యమంలో, ప్రాథమిక విద్య దాదాపు కనుమరుగయింది. తెలుగు భాషకు.. తెలుగు తనానికి చోటు లేకుండా పోతున్నది. ఈ తరం విద్యార్థులకు తెలుగు ప్రాచీన వైభవం, సంస్కృతి సంప్రదాయాల పట్ల కనీస అవగాహన లేకుండా పోతున్నది. దేశ భాషలందు "తెలుగు లెస్స" అన్న నానుడి దేశ భాష లందు "తెలుగు లెస్" అనే దురవస్థకు దాపోతోంది. తెలుగు రాష్ట్రాలలో తెలుగును నిర్లక్ష్యం చేస్తుంటే.... దేశ ప్రధాని నరేంద్ర మోదీ, గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉంటూ, అహమ్మదాబాద్, సూరత్ లాంటి పట్టణాలలో, తెలుగు వారికోసం తెలుగు మాధ్యమ బడులు నడిపారు. ఇప్పటికీ అవి నడుస్తూనే ఉన్నాయి. అంతే కాదు, 2017లో కేంద్ర ప్రభుత్వ బళ్ళలో కూడా తెలుగు తప్పని సరి అని ప్రధాని అన్నారు కూడా. భారత తాజా మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, "మాతృ భాష కళ్ళ వంటిది, పరాయి భాష కళ్లద్దాల వంటిది, కళ్ళు లేకుండా, అద్దాలు పెట్టుకోవడం వల్ల ఉపయోగం శూన్యం". అన్న మాటలను మననం చేసుకోవాల్సిన అవసరం అనివార్యంగా ఉంది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# బొమ్మలగుట్ట శాసనం నుంచి

## ధర్మపురి అగ్రహారం చరిత్ర, సమాజం నిలిపిన వారసత్వం

**వేములవాడ చాళుక్యుల కాలం నాటి ధర్మపురి అగ్రహారం...వేద విజ్ఞానానికి వేయేళ్ల వారసత్వం**


దక్షిణ గంగానదిగా భక్తజన హృదయాలను పునీతం చేసే పవిత్ర గోదావరీ నదీమతల్లి తరంగాల మృదుమధుర నినాదాల నడుమ, యుగయుగాల పురాణ ప్రాశస్త్యంతో పాటు ప్రాచీన శాసన వైభవాన్ని తన గర్భంలో నిలుపుకున్న చారిత్రక జ్ఞానపీఠం ధర్మపురి క్షేత్రం. ధర్మపురి అనగానే సాధారణ భక్తులకు కనుల ముందు సాక్షాత్కరించేది కేవలం ఉగ్రరూపుడై వెలసి భక్తుల పాలిట శాంతమూర్తిగా మారిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి దివ్య సన్నిధానం, ఆలయ ప్రాకారాలు, రామలింగేశ్వర స్వామి సన్నిధి, గోదావరి పుణ్యస్నానాలు మాత్రమే. అయితే చారిత్రక దృక్కోణంతో కాలగర్భాన్ని తరచి చూసిన పరిశోధకుడికి మాత్రం ధర్మపురి ఒక సహస్రాబ్ది వైదిక విద్యా విశ్వవిద్యాలయంగా, అసమానమైన అగ్రహార సాంస్కృతిక కేంద్రంగా, సాహితీ సృజనకు జన్మస్థానంగా గోచరిస్తుంది. భారతీయ సనాతన సంస్కృతిలో 'అగ్రహారం' అనేది కేవలం భూస్వామ్య వ్యవస్థలో భాగంగా పాలకుల ద్వారా విద్వాంసులకు సమర్పించబడిన నివాస స్థలమో లేక సాగుభూమి విస్తీర్ణమో మాత్రమే కాదు. అది సమస్త వేద, వేదాంగ, తర్క, మీమాంసాది శాస్త్రాల మథనం జరిగే దివ్య వేదిక. నిరంతర ధర్మాచరణకు, నిస్వార్థ విద్యా ప్రదానానికి, నిత్య క్రతువులకు, సమాజ శ్రేయస్సుకు ఆలవాలమైన ఒక సుసంపన్న సామాజిక జీవన వ్యవస్థకు అది ప్రతీక. అందునా తెలంగాణ నేలపై గోదావరి తీరాన సహస్ర వత్సరాల నిరంతర ధారగా వర్ధిల్లిన ధర్మపురి అగ్రహారానికి ఉన్న స్థానం దక్షిణ భారత సాంస్కృతిక, భాషా చరిత్రలలో అత్యంత ఉదాత్తమైనది, అసమానమైనది.

ధర్మపురి అగ్రహార చరిత్ర మూలాలను స్పృశించాలంటే వెయ్యేళ్లకు పైగా కాలప్రవాహంలో వెనక్కి పయనించి వేములవాడ చాళుక్యుల స్వర్ణయుగంలోకి అడుగుపెట్టక తప్పదు. పదో శతాబ్దపు తొలిభాగంలో వేములవాడను రాజధానిగా చేసుకుని సకల కళలను పోషిస్తూ సువిశాల రాజ్యాన్ని ఏలిన చాళుక్య మహారాజు రెండవ అరికేసరి ఆస్థానంలో కన్నడ సారస్వత రథసారథి, యుగకవి పంప మహాకవి అత్యున్నత గౌరవ మన్ననలను పొందాడు. తన అసమాన ప్రతిభతో, శైలీ విన్యాసంతో వ్యాస భారతాన్ని అనుసరించి "విక్రమార్జున విజయం" లేదా "పంప భారతం" వంటి జగద్విఖ్యాత కావ్యాన్ని, అలాగే జైన తీర్థంకరుల చరిత్రను తెలిపే "ఆదిపురాణం" వంటి మహాకావ్యాన్ని ఆవిష్కరించి కన్నడ సారస్వత లోకంలో ఆదికవిగా చిరస్మరణీయుడయ్యాడు. ఆ మహామేధావి కవితా చాతుర్యానికి, పాండిత్య ప్రకర్షకు ముగ్ధుడైన అరికేసరి మహారాజు ఆయనను "కవితాగుణార్ణవ" అనే విశిష్ట బిరుదంతో సత్కరించడమే గాక, పవిత్ర ధర్మపురిని సర్వాభ్యంతర రహితమైన అగ్రహారంగా దానమిచ్చి గౌరవించాడు. ఈ మహత్తర చారిత్రక ఘట్టానికి సజీవ సాక్ష్యంగా నేటి కరీంనగర్ జిల్లా గంగాధర మండలం కురిక్యాల సమీపంలోని బొమ్మలగుట్టపై రాతి గుండ్రాలపై చెక్కిన శాసనం నేటికీ కాల పరీక్షను తట్టుకుని నిలిచి వెలుగుతోంది.

కురిక్యాల బొమ్మలగుట్టపై పంప మహాకవి అనుంగు సోదరుడు, గొప్ప జైన పండితుడు, వాగ్గేయకారుడు, కళాపోషకుడైన జినవల్లభుడు వేయించిన శాసనం భారతీయ శాసనరంగంలోనే ఒక అపురూప మైలురాయిగా ప్రసిద్ధి చెందింది. క్రీస్తుశకం 945 ప్రాంతానికి చెందిన ఈ శాసనం సంస్కృతం, కన్నడం, తెలుగు భాషల త్రివేణీ సంగమంగా అలరారుతోంది. జినవల్లభుడు బొమ్మలగుట్టపై సిద్ధ ప్రతిమలను, వర్ధమాన మహావీరునితో సహా ఇతర తీర్థంకరుల దివ్య శిల్పాలను చెక్కించి, "త్రిభువన తిలక" జినాలయాన్ని నిర్మించి, మనోహరమైన "మదనవిలాస" ఉద్యానవనాన్ని తీర్చిదిద్ది, తన అన్నగారి కీర్తి చిరస్థాయిగా నిలిచేలా "కవితాగుణార్ణవ" తటాకాన్ని తవ్వించిన వృత్తాంతాన్ని ఈ శాసనం అత్యంత రమణీయంగా వర్ణిస్తుంది. అంతటితో ఆగక, ఈ శాసనంలో జినవల్లభుడు పొందుపరిచిన తెలుగు కంద పద్యాలు తెలుగు భాషా పరిశోధకులకు అపురూపమైన చారిత్రక నిధులుగా మారాయి. నన్నయ భట్టారకునికి పూర్వమే తెలుగు ఛందోరీతులు ఎంతటి లలితమైన, పరిపక్వమైన సాహిత్య పరిమళాన్ని వెదజల్లాయో నిరూపించడానికి ఈ శాసనంలోని తెలుగు కంద పద్యాలే తొలి లిఖిత తార్కాణాలుగా నిలిచాయి.

వినుత చాళుక్య వంశపతి మిక్కరి కేసరి సంద విక్రమార్జున విజయక్కే ధర్మపురం మెందు మదేయ మిదెందు కీర్తి శాసన.. అలాగే బరదుదే తాంబ్ర శాసన మదేయమే ధర్మపురం నెగర్తేవే త్తరిగన కొట్టుదే నెగ్గి పంపన.. అంటూ సాగే ఆ పద్యాల్లోని ధర్మపురి క్షేత్ర ప్రస్తావన ఎంతటి ఉన్నత ప్రాచీనతను సంతరించుకుందో ప్రమాణంగా చాటిచెప్తాయి. తెలుగు భాషకు కేంద్ర ప్రభుత్వం ప్రాచీన హోదాను ప్రసాదించిన పరిశోధనా





పర్వంలో బొమ్మలగుట్ట శాసనానికి లభించిన ప్రాధాన్యం తిరుగులేనిది. అటువంటి జగద్విఖ్యాత శాసనంలో ధర్మపుర ప్రస్తావన ఉండటం, పంపనికి దానిని అగ్రహారంగా సమర్పించినట్లు లిఖితపూర్వకంగా నమోదు కావడం ఈ నేల ఎంతటి ప్రాచీన రాచరిక గౌరవాన్ని, భాషా వైభవాన్ని, విద్వత్ ప్రతిపత్తిని అనుభవించిందో నిస్సంశయంగా రుజువు చేస్తోంది. వేములవాడ రాజులు వైదిక ధర్మానికి, జైన మతానికి సమదృష్టితో ఆశ్రయం కల్పిస్తూ సమన్వయ సంస్కృతిని ప్రోది చేసిన వైనం, ఆ క్రమంలోనే వైదిక విజ్ఞాన భాండాగారంగా ధర్మపురిని సకల సదుపాయాలతో అగ్రహారంగా తీర్చిదిద్దిన తీరు చరిత్ర పుటల్లో సువర్ణాక్షరాలతో లిఖించదగినది.

ధర్మపురి అగ్రహారంగా రూపుదిద్దుకున్న నాటి నుంచి శతాబ్దాల పాటు నిర్వహించిన విద్యా ధర్మ బాధ్యత అసాధారణమైనది. అగ్రహార వ్యవస్థ యొక్క ప్రధాన ప్రాణవాయువు జ్ఞానదానమే. ఇక్కడ నివసించిన పండిత ప్రకాండులు తమ స్వగృహాలనే నిత్యాన్నదాన సహిత గురుకుల పాఠశాలలుగా మార్చుకున్నారు. ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదాలతో పాటు వేదాంగాలు, ఉపనిషత్తులు, ధర్మశాస్త్రాలు, మీమాంస, తర్కం, జ్యోతిషం, సంస్కృత వ్యాకరణాలను నిరంతరాయంగా శిష్యకోటికి బోధించేవారు. దేవాలయం అనేది కేవలం ధూపదీప నైవేద్యాల సమర్పణకు మాత్రమే పరిమితం కాక, నిత్యం వేదఘోషలతో, శాస్త్రార్థ చర్చలతో, విద్వత్సభలతో, ఆధ్యాత్మిక ప్రబోధాలతో మార్మోగే జ్ఞానపీఠంగా విలసిల్లింది. అగ్రహార వ్యవస్థలో ఆలయం, పండిత సమాజం, గురుశిష్య పరంపర, నిత్యాన్నదాన సంప్రదాయాలు పరస్పరం ఆధారపడుతూ ఒక సమాంతర సాంస్కృతిక ప్రవాహంగా సాగాయి. ధర్మపురి పండితులు కాశీ మొదలుకుని దక్షిణ భారతంలోని నిజాం సంస్థానం, గద్వాల, వనపర్తి, ఆత్మకూరు వంటి ప్రసిద్ధ సంస్థానాల వరకు పర్యటించి, అక్కడి రాజసభలలో తమ విద్వత్తును ప్రదర్శించి దిగ్విజయాలు సాధించేవారు. గద్వాల మహారాజులు నిర్వహించే విద్వత్సభల్లో ధర్మపురి శాస్త్రవేత్తలు పొందిన గౌరవ సత్కారాలు, అగ్రహార బిరుదులు ఆనాటి చారిత్రక రికార్డులలో కనిపిస్తాయి. కేవలం అక్కడ నివసించిన కుటుంబాల సంఖ్యతో కాక, అక్కడి నుండి ప్రభవించిన పాండిత్య విస్తృతితో, శిష్య పరంపరతోనే ధర్మపురి యావత్ భారతదేశంలో "దక్షిణ కాశీ" అన్న ఖ్యాతిని సార్థకం చేసుకుంది.

ధర్మపురి అగ్రహార చరిత్రను కేవలం ఆధ్యాత్మిక, వైదిక కోణంలోనే కాకుండా సామాజిక-ఆర్థిక దృక్కోణంలో విశ్లేషిస్తే స్థానిక సమాజం ప్రదర్శించిన స్వయంప్రతిపత్తి, స్వావలంబన మరింత ఆశ్చర్యపరుస్తాయి. గోదావరి వంటి మహానది పక్కనే ప్రవహిస్తున్నప్పటికీ, ఎగువ ప్రాంతాల మెట్ట భూములను సస్యశ్యామలం చేయడానికి, వర్షపు నీటిని పొదుపుగా ఒడిసిపట్టడానికి ధర్మపురి పరిసర ప్రాంతాల్లో నిర్మితమైన చెరువులు, కుంటలు, కాలువలు స్థానిక ప్రజల సామూహిక శ్రమతోనే రూపుదిద్దుకున్నాయి. రాజరిక కోశాగారాల నిధుల కోసమో, దండయాత్రల విజయాల మిగులు కోసమో ఎదురుచూడకుండా సమాజమే పరస్పర సహకారంతో జలవనరులను తవ్వుకుంది. కాలక్రమంలో పాలకుల మారినా ఈ ప్రత్యేక స్థితి చెక్కుచెదరలేదు. ఆసఫ్‌జాహీ నిజాం నవాబుల పరిపాలనా కాలంలో కూడా ధర్మపురి భూముల స్వయం సమృద్ధిని గుర్తించి ప్రత్యేక జాగీరు విచారణలు నిర్వహించినట్లు పూర్వపు అధికారిక దస్తావేజులు సూచిస్తున్నాయి. దేశముఖులు, దేశపాండేలు వంటి స్థానిక రెవెన్యూ అధికారులు ధర్మపురి స్వయంపోషకత్వాన్ని ప్రశంసిస్తూ రాజప్రభుత్వానికి నివేదికలు పంపేవారు. ఈ విశిష్ట సామాజిక-ఆర్థిక నిర్మాణమే ధర్మపురికి ప్రత్యేకమైన భూమి శిస్తు రాయితీలను కల్పించింది. ప్రాచీన కాలం నుంచి నిజాం పాలన వరకు, ఆపై స్వాతంత్ర్యానంతర కాలంలో కూడా ధర్మపురి గ్రామానికి సాధారణ ప్రాంతాలకంటే తక్కువ శిస్తు 4వ వంతు

చెల్లించే సాంప్రదాయ మినహాయింపు అమలులో ఉండేది. అయితే 1978 ప్రాంతంలో కరీంనగర్ జిల్లా పరిపాలనా యంత్రాంగం ఈ చారిత్రక మినహాయింపును రద్దు చేసి, సాధారణ గ్రామాలకు విధించినట్లే పూర్తిస్థాయి భూమి శిస్తును ధర్మపురిపై రుద్దేందుకు ప్రయత్నించింది. ఆ క్లిష్ట సమయంలో ధర్మపురి సాంస్కృతిక ఉనికిని, రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు నాటి ప్రముఖ నాయకులు వెలిచాల జగపతి రావు, మాజీ మంత్రి జువ్వాడి రత్నాకర్ రావు వంటి ప్రజాప్రతినిధులు తీవ్రంగా శ్రమించారు. వారు నాటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెవెన్యూ మంత్రి పి. నర్సారెడ్డి వద్దకు ధర్మపురి అగ్రహార చరిత్రను, రైతుల శ్రమ సంస్కృతిని, పూర్వపు జాగీరు విచారణ పత్రాలను నివేదించి, ప్రభుత్వం నుంచి పన్ను ఉపశమనాన్ని సాధించి ధర్మపురి ఆత్మగౌరవాన్ని నిలబెట్టారు. ఈ చారిత్రక పోరాటం ధర్మపురి ప్రజల ఐక్యతకు, వారి నేల పట్ల ఉన్న సాంస్కృతిక బంధానికి నిదర్శనంగా నిలుస్తుంది.

అలాగే నిజాం నవాబుల పరిపాలనా కాలంలో ధర్మపురి క్షేత్ర నిర్వహణ వ్యవస్థ ఎంతో పకడ్బందీగా, ప్రజాస్వామిక పద్ధతిలో సాగేది. ఆనాటి పత్రాలు, వంశపారంపర్య దస్తావేజుల ప్రకారం నాటి ఇందారపు రామయ్య గారి నాయకత్వంలో క్షేత్రసభ అత్యున్నత నిర్ణయాధికార వేదికగా పనిచేసేది. ఆలయ నిర్వహణ, ఉత్సవాల ఏర్పాట్లు, భక్తుల సౌకర్యార్థం తీసుకోవాల్సిన చర్యలను ఈ సభ నిర్ణయించేది. మరోవైపు పవిత్ర గోదావరి నది తీర్థవిధులు, దేవాలయ అర్చకత్వ, పౌరోహిత్య బాధ్యతలను బొజ్జా కుటుంబీకులు అత్యంత నిష్ఠతో నిర్వహించేవారు. ఇవి కేవలం కొన్ని కుటుంబాల వ్యక్తిగత హోదాలు కావు; ఒక ప్రాచీన పుణ్యక్షేత్రం క్రమశిక్షణతో, నిరంతరాయంగా, ఎలాంటి వివాదాలు లేకుండా తరతరాలుగా ఎలా సాగాలో నిర్దేశించిన సువ్యవస్థీకృత కార్యాచరణ నమూనాలు. ఈ అంతర్గత పరిపాలనా సౌలభ్యమే పరాయి పాలకుల కాలంలోనూ, రాజకీయ సంక్షోభాల సమయాల్లోనూ ధర్మపురి అగ్రహార జీవనం చెదిరిపోకుండా నిలబడటానికి దోహదం చేసింది.

ధర్మపురి అగ్రహార వైభవంలో అత్యంత కీర్తించదగిన, చరిత్ర పుటల్లో శాశ్వతంగా లిఖించదగిన మరో మహోన్నత అధ్యాయం ఇక్కడి పండిత సమాజం ప్రదర్శించిన త్యాగనిరతి, ప్రజాహిత గుణం. ధర్మపురి నేడు ఉత్తర తెలంగాణకే తలమానికమైన విద్యా, వైద్య కేంద్రంగా భాసిల్లుతోందంటే దానికి కారణం నాటి అగ్రహార వైదిక కుటుంబాలు చేసిన ఉదార భూదానాలే. పేద విద్యార్థులు జ్ఞానార్జన చేసి ఉన్నత స్థానాలకు ఎదగాలన్న సంకల్పంతో ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు, తదనంతర ప్రభుత్వ జూనియర్ కళాశాలకు, సంస్కృతాంధ్ర డిగ్రీ కళాశాలకు, స్థానిక బ్రాహ్మణ కుటుంబాలు ఎంతో విలువైన భూములను దానపూర్వకంగా ప్రభుత్వానికి అప్పగించాయి. అలాగే సమాజంలో రోగగ్రస్తులైన ఆర్తుల బాధలను నివారించడానికి నిర్మించిన ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి, సంప్రదాయ యునాని వైద్యశాల, ఇతర ప్రభుత్వ కార్యాలయాల సముదాయాలు కొలువుదీరిన భూములు సైతం ఈ అగ్రహార పెద్దలు సమర్పించినవే. భగవంతుడిచ్చిన సంపదను, భూమిని సమాజ సేవకు, సర్వజనుల హితానికి అర్పించడమే నిజమైన పరమార్థమనే వైదిక ధర్మ సూత్రాన్ని వారు ఆచరణలో చేసి చూపించారు. ఈ త్యాగబుద్ధి ధర్మపురి సామాజిక చరిత్రలో ఒక బంగారు అధ్యాయం.

అందుకే ధర్మపురి అగ్రహార వైభవాన్ని కేవలం గతకాలపు ఒక వర్గానికి చెందిన నివాస ప్రాంతంగానో, సంకుచిత దృష్టితోనో చూడటం ఆ మహోన్నత నేల చరిత్రకు అపచారం చేయడమే అవుతుంది. ధర్మపురి అనేది వేద పారంపర్యం, చాళుక్యుల శాసన ఔన్నత్యం, కన్నడ-తెలుగు భాషా సాహిత్యాల అపూర్వ సంగమం, సామాజిక స్వావలంబన, ఆలయ సంస్కృతి, పరహితార్థ భూదానాలు అన్నీ మేళవించిన ఒక జీవద్భాష్యం. వేములవాడ అరికేసరి మహారాజు వేయించిన పునాదుల నుంచి పంప మహాకవి ప్రతిభ వరకు, బొమ్మలగుట్టపై వెలసిన జినవల్లభుని తొలి తెలుగు కంద పద్యాల అమృతధారల నుంచి నేటి ఆధునిక విద్యాసంస్థల వరకు ధర్మపురి సాగించిన సాంస్కృతిక ప్రస్థానం సమగ్ర పరిశోధనకు అర్హమైనది. ఈ చారిత్రక ప్రాధాన్యాన్ని నిరూపించే ప్రాచీన తాళపత్రాలు, సంస్థానాల సన్మాన పత్రాలు, పాత జాగీరు ఉత్తర్వులు, రెవెన్యూ నివేదికలు, దాన శాసనాలను ఒకచోట చేర్చి సమగ్ర సంపుటాలుగా శాస్త్రీయంగా భద్రపరచాల్సిన గురుతర బాధ్యత నేటితరంపై ఉంది. గోదావరి తీరాన ప్రతిధ్వనించే వేదనాదం, శిలాఫలకాలపై దాగిన అక్షర సత్యం, ఆ అగ్రహార నేల సాక్ష్యంగా నిలిపిన త్యాగగుణం ధర్మపురిని తెలుగుజాతి చరిత్రలోనే ఒక అపురూప సాంస్కృతిక రాజధానిగా నిరంతరం నిలుపుతూనే ఉంటాయి.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494



# ఐదు ఓవర్లలోనే ఫినిష్

## భారత్ సరికొత్త రికార్డు!

## జపాన్‌పై ఎనిమిది వికెట్ల ఘన విజయం

**నిషిన్, సెప్టెంబర్ 18 (చురకలు):** ఆసియా క్రీడల్లో భారత మహిళల క్రికెట్ జట్టు అదరగొట్టింది. జపాన్‌తో జరిగిన క్వార్టర్ ఫైనల్లో ఎనిమిది వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. తొలుత భారత బౌలర్ల ధాటికి జపాన్ 19.5 ఓవర్లలో 57 పరుగులకే ఆలౌట్ కాగా.. భారత్ కేవలం ఐదు ఓవర్లలో రెండు వికెట్లకు 59 పరుగులు చేసి మ్యాచ్‌ను ముగించింది. 90 బంతులు మిగిలుండగానే సాధించిన ఈ విజయం భారత మహిళల టీ20 అంతర్జాతీయ చరిత్రలో బంతుల పరంగా అతిపెద్ద విజయంగా నమోదైంది. జపాన్‌ను తక్కువ స్కోరుకే కట్టడి చేయడంలో శ్రీ చరణి కీలక పాత్ర పోషించారు. నాలుగు ఓవర్లలో కేవలం 10 పరుగులిచ్చి నాలుగు వికెట్లు పడగొట్టారు. షఫాలీ వర్మ రెండు వికెట్లు తీయగా, దీప్తి శర్మ, శ్రేయాంక పాటిల్ చెరో వికెట్ సాధించారు. జపాన్ తరఫున అయాకా కాటో-స్టాఫర్డ్ 25 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచారు. 58 పరుగుల లక్ష్య ఛేదనలో కమలిని డకౌట్ కాగా, భారతి ఫుల్మాలి ఆరు పరుగులకు వెనుదిరిగారు. అయితే షఫాలీ వర్మ జపాన్ బౌలర్లపై విరుచుకుపడ్డారు. కేవలం 15 బంతుల్లో ఆరు ఫోర్లు, రెండు సిక్సర్లతో అజేయంగా 40 పరుగులు చేశారు. రిచా ఘోష్ ఆరు బంతుల్లో 12 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు. ఐదో ఓవర్ చివరి బంతిని షఫాలీ సిక్సర్‌గా మలిచి విజయాన్ని ఖాయం చేశారు. ఈ విజయంతో భారత్ తన పేరిటే ఉన్న పాత రికార్డును అధిగమించింది. 2022లో థాయ్‌లాండ్‌పై 84 బంతులు మిగిలుండగానే గెలవగా.. ఇప్పుడు జపాన్‌పై ఏకంగా 90 బంతులు మిగిలుండగానే విజయాన్ని అందుకుంది. సెప్టెంబర్ 20న జరిగే సెమీఫైనల్లో భారత్ బంగ్లాదేశ్‌తో తలపడనుంది.


# ఆనందికి స్వర్ణం, కాంస్యం

**కమాన్‌పూర్, సెప్టెంబర్ 17:** తెలంగాణ అథ్లెట్ నల్లవెల్లి ఆనంది సౌత్ జోన్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో రెండు పతకాలతో ఆకట్టుకుంది. పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండల కేంద్రానికి చెందిన ఆనంది అండర్-18 బాలికల 400 మీటర్ల విభాగంలో స్వర్ణం, 200 మీటర్ల పరుగులో కాంస్యం సాధించింది. పుదుచ్చేరిలో గురువారం జరిగిన 400 మీటర్ల ఫైనల్లో అందరికంటే వేగంగా 56.42 సెకండ్ల టైమింగ్‌తో అగ్రస్థానంలో నిలిచింది. 200 మీటర్ల తుదిపోరులో 25.66 సెకండ్లలో మూడో స్థానం సాధించింది.



# మహిళా అథ్లెట్.. పురుష కోచ్‌కు ఒకే గది!

## నాగోయాలో భారత బృందానికి వసతి చిక్కులు



**నాగోయా, సెప్టెంబర్ 18 (చురకలు):** ఆసియా క్రీడల కోసం జపాన్‌లోని నాగోయాకు చేరుకున్న భారత బృందానికి వసతి ఏర్పాట్లలో వరుస చిక్కులు ఎదురవుతున్నాయి. తాజాగా భారత జిమ్నాస్ట్ ప్రణతి నాయక్, ఆమె పురుష కోచ్ అశోక్ మిశ్రాకు నిర్వాహకులు ఒకే గదిని కేటాయించడం గందరగోళానికి దారితీసింది. దీనిపై ఇద్దరూ వెంటనే అభ్యంతరం వ్యక్తం చేసి స్థానిక నిర్వాహకులు, భారత బృందం అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గంటలపాటు ప్రయత్నించిన అనంతరం భారత ఒలింపిక్ సంఘం జోక్యంతో ప్రణతి, మిశ్రాకు వేర్వేరు వసతి ఏర్పాట్లు చేసినట్లు సమాచారం. ఈ ప్రక్రియ అర్ధరాత్రి దాటినా కొనసాగగా.. సుమారు రాత్రి 1.30 గంటలకు ప్రత్యామ్నాయ గది ఏర్పాట్లు పూర్తయ్యాయి. అయితే కోచ్ అశోక్ మిశ్రాకు అక్కడితో సమస్య తీరలేదు. ప్రత్యేక గది తాళాలు తీసుకునేందుకు వెళ్లగా హోటల్ రిజిస్టర్‌లో ఆయన బుకింగ్ కనిపించలేదు. అధికారిక వివరాల్లో ఆయన పేరులోని ఒక అక్షరం నమోదు కాకపోవడంతో ఈ సమస్య తలెత్తినట్లు సమాచారం. బుకింగ్‌ను గుర్తించి, అక్రిడిటేషన్‌ను ధ్రువీకరించేందుకు మరో 45 నిమిషాలు పట్టడంతో రాత్రి 2 గంటల తర్వాతే ఆయన గదికి చేరుకోగలిగారు. ఈ ఘటనపై ప్రణతి నాయక్ స్పందిస్తూ వసతి విషయంలో గందరగోళం జరిగిన మాట వాస్తవమేనని, రాత్రి 2 గంటల సమయంలో సమస్య పరిష్కారమైనట్లు తెలిపారు. భారత బృందం నాగోయాకు చేరుకున్నప్పటి నుంచి మరికొందరు అథ్లెట్లు కూడా గదుల కేటాయింపు కోసం గంటల తరబడి వేచి చూడాల్సి వచ్చినట్లు సమాచారం. శిక్షణకు వెళ్లే ఏర్పాట్లు, పోషకాహారం విషయంలోనూ ఇబ్బందులు ఎదురైనట్లు తెలుస్తోంది. భారత కబడ్డీ బృందానికీ హోటల్ గదుల కేటాయింపు, చెక్‌ఇన్‌లో సమస్యలు ఎదురైనట్లు సమాచారం. పోటీలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో వసతి, ఇతర ఏర్పాట్లలో ఇకపై ఇలాంటి సమన్వయ లోపాలు తలెత్తకుండా చూడాలని అథ్లెట్లు, కోచ్‌లు కోరుతున్నారు.

# కాటేరమ్మ కొడుకుల విశ్వరూపం

## బాదుడే బాదుడు!

## నిన్న అభిషేక్.. నేడు ట్రావిస్ హెడ్

### 84 బంతుల్లో 112 పరుగులతో హెడ్ విధ్వంసం

### 30 బంతుల్లోనే అభిషేక్ రికార్డు శతకం




**హరారే, సెప్టెంబర్ 18 (చురకలు):** ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున ప్రత్యర్థి బౌలర్లను హడలెత్తించిన ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ ఇప్పుడు తమ దేశాల తరఫున అంతర్జాతీయ క్రికెట్‌లోనూ అదే దూకుడు చూపిస్తున్నారు. నిన్న అఫ్గానిస్థాన్‌పై అభిషేక్ రికార్డు శతకంతో విరుచుకుపడితే.. తాజాగా జింబాబ్వేపై ట్రావిస్ హెడ్ సెంచరీతో చెలరేగిపోయాడు. దీంతో ఎస్‌ఆర్‌హెచ్ అభిమానులు తమదైన శైలిలో వీరిద్దరినీ 'కాటేరమ్మ కొడుకులు' అంటూ సోషల్ మీడియాలో హోరెత్తిస్తున్నారు. హరారే వేదికగా శుక్రవారం జింబాబ్వేతో జరిగిన రెండో వన్డేలో ట్రావిస్ హెడ్ 84 బంతుల్లో 15 ఫోర్లు, మూడు సిక్సర్లతో 112 పరుగులు చేశాడు. కేవలం 75 బంతుల్లోనే శతకం పూర్తి చేశాడు. హెడ్ విధ్వంసానికి కెప్టెన్ మిచెల్ మార్ష్ 53, కూపర్ కానొలీ 78 పరుగులతో తోడవడంతో ఆస్ట్రేలియా 50 ఓవర్లలో ఆరు వికెట్లకు 356 పరుగుల భారీ స్కోరు చేసింది. మరోవైపు గురువారం ఢిల్లీలో అఫ్గానిస్థాన్‌తో జరిగిన మూడో టీ20లో అభిషేక్ శర్మ కేవలం 30 బంతుల్లోనే శతకం బాది రికార్డు సృష్టించాడు. మొత్తం 34 బంతుల్లో తొమ్మిది ఫోర్లు, 11 సిక్సర్లతో 108 పరుగులు చేశాడు. ఇది భారత బ్యాటర్ సాధించిన అత్యంత వేగవంతమైన అంతర్జాతీయ టీ20 శతకం. పూర్తి సభ్య దేశాల మధ్య జరిగిన టీ20ల్లోనూ ఇదే అత్యంత వేగవంతమైన సెంచరీ. అభిషేక్ దెబ్బకు భారత్ 221 పరుగులు చేయగా.. అఫ్గానిస్థాన్‌ను 94 పరుగులకే కట్టడి చేసి 127 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఓపెనర్లుగా హెడ్-అభిషేక్ జోడీ ఎన్నోసార్లు పవర్‌ప్లేలో పరుగుల సునామీ సృష్టించింది. ఇప్పుడు ఒక్కరోజు వ్యవధిలోనే ఇద్దరూ తమ జాతీయ జట్ల తరఫున సెంచరీలతో చెలరేగడం ఆరెంజ్ ఆర్మీ అభిమానులకు ప్రత్యేక ఆనందాన్ని అందిస్తోంది. సోషల్ మీడియాలోనూ వీరిద్దరి బ్యాటింగ్‌ను పోలుస్తూ అభిమానుల పోస్టులు సందడి చేస్తున్నాయి.

# క్లీన్‌స్వీప్ చేసినా.. నంబర్ వన్‌కు ముప్పే!

## భారత్‌కు ఇంగ్లండ్ నుంచి గట్టి పోటీ




**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 18 (చురకలు):** అఫ్గానిస్థాన్‌ను టీ20 సిరీస్‌లో క్లీన్‌స్వీప్ చేసిన టీమిండియా ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో నంబర్ వన్ స్థానాన్ని నిలబెట్టుకున్నా.. ఇంగ్లండ్ నుంచి గట్టి పోటీ ఎదురవుతోంది. తాజా ర్యాంకింగ్స్‌లో భారత్, ఇంగ్లండ్ రెండూ 269 రేటింగ్ పాయింట్లతో సమంగా ఉన్నాయి. అయితే మొత్తం పాయింట్ల పరంగా భారత్ ముందుండటంతో అగ్రస్థానం కొనసాగుతోంది. ఐసీసీ అధికారిక పేజీలోనూ భారత్ ప్రస్తుతం 269 రేటింగ్‌తో నంబర్ వన్‌గా ఉంది. శ్రీలంకతో మూడు టీ20ల సిరీస్‌లో ఇంగ్లండ్ ఇప్పటికే తొలి రెండు మ్యాచ్‌లను గెలిచి 2--0తో సిరీస్‌ను సొంతం చేసుకుంది. రెండో మ్యాచ్‌లో ఆరు వికెట్ల తేడాతో నెగ్గిన ఇంగ్లండ్.. శనివారం మాంచెస్టర్‌లో జరిగే చివరి టీ20లోనూ విజయం సాధిస్తే ర్యాంకింగ్ లెక్కల్లో భారత్‌పై ఒత్తిడి మరింత పెరగనుంది. తాజా పట్టికలో భారత్ 269 రేటింగ్‌తో మొదటి స్థానంలో ఉండగా ఇంగ్లండ్ 269తో రెండో స్థానంలో ఉంది. ఆస్ట్రేలియా 260తో మూడో స్థానం, న్యూజిలాండ్ 247తో నాలుగో స్థానం, దక్షిణాఫ్రికా 243తో ఐదో స్థానంలో ఉన్నాయి. పాకిస్థాన్ 240, వెస్టిండీస్ 234, బంగ్లాదేశ్ 224 రేటింగ్ పాయింట్లతో తర్వాతి స్థానాల్లో కొనసాగుతున్నాయి. శ్రీలంక, అఫ్గానిస్థాన్ చెరో 220 రేటింగ్‌తో తొమ్మిది, పది స్థానాల్లో ఉన్నాయి. అఫ్గానిస్థాన్‌పై సిరీస్ విజయంతో అగ్రస్థానాన్ని కాపాడుకున్న భారత్‌కు ఇప్పుడు ఇంగ్లండ్ అత్యంత సమీపంలోకి వచ్చింది. దీంతో శ్రీలంక-ఇంగ్లండ్ చివరి టీ20 అనంతరం ర్యాంకింగ్ లెక్కలు ఎలా మారతాయన్నది ఆసక్తికరంగా మారింది.

# బీసీసీఐ కీలక నిర్ణయాలు



- ఐపీఎల్-2027పై స్పెషల్ ఫోకస్
- లైంగిక వేధింపుల నిరోధానికి కొత్త కమిటీ
- ఐపీఎల్ పాలక మండలిలో కొత్త నియామకాలు
- 20వ ఎడిషన్‌ను ఘనంగా నిర్వహించేందుకు ప్రణాళిక
- 2028 శతాబ్ది ఉత్సవాలకు ఇప్పటి నుంచే రోడ్‌మ్యాప్
- అంపైర్లు, మ్యాచ్ రిఫరీలకు వేతనాల పెంపు

**ముంబై, సెప్టెంబర్ 18 (చురకలు):** భారత క్రికెట్ నియంత్రణ మండలి 95వ వార్షిక సర్వసభ్య సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. బోర్డు పాలన, ఆర్థిక వ్యవహారాలు, మ్యాచ్ అధికారుల సంక్షేమం, ఐపీఎల్-2027 నిర్వహణతోపాటు బీసీసీఐ శతాబ్ది ఉత్సవాలకు సంబంధించిన ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. క్రీడాకారులు, సిబ్బందికి సురక్షిత వాతావరణం కల్పించడంలో భాగంగా లైంగిక వేధింపుల నిరోధక విధానం కింద కొత్త అంతర్గత కమిటీ ఏర్పాటుకు సర్వసభ్య సమావేశం ఆమోదం తెలిపింది. క్రికెటర్ల వయసు నిర్ధారణ విధానంలో మరింత పారదర్శకత తీసుకొచ్చేందుకు ప్రతిపాదించిన మార్పులకూ పచ్చజెండా ఊపింది.

### ఐపీఎల్-2027పై ప్రత్యేక దృష్టి

ఐపీఎల్ పాలక మండలిలో అరుణ్ సింగ్ ధుమాల్, ఎం. ఖైరుల్ జమాల్ మజుందార్‌లను ప్రతినిధులుగా నియమించారు. 2027లో ఐపీఎల్ 20వ ఎడిషన్ జరగనున్న నేపథ్యంలో ఈ మైలురాయిని ప్రత్యేకంగా నిర్వహించేందుకు ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందించాలని నిర్ణయించారు. బీసీసీఐ వందేళ్లు పూర్తి చేసుకోనున్న సందర్భంగా శతాబ్ది ఉత్సవాలను దేశవ్యాప్తంగా నిర్వహించేందుకు కూడా రోడ్‌మ్యాప్ సిద్ధం చేయనున్నారు. 2027 డిసెంబర్ నుంచి 2028 వరకు ఏడాది పొడవునా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు.

### అంపైర్లు, రిఫరీలకు తీపికబురు

అంపైర్లు, మ్యాచ్ రిఫరీల చెల్లింపులను పెంచడంతోపాటు వారి గ్రేడింగ్ వ్యవస్థను పునర్వర్గీకరించేందుకు ఆమోదం లభించింది. 2025--26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆడిట్ ఖాతాలు, 2026--27 వార్షిక బడ్జెట్‌తోపాటు తదుపరి ఆర్థిక సంవత్సరానికి ఆడిటర్ల నియామకానికీ బోర్డు ఆమోదముద్ర వేసింది. దివ్యాంగ క్రికెటర్ల అభివృద్ధిపైనా బీసీసీఐ ప్రత్యేక దృష్టి సారించింది. వారికి అవసరమైన వనరులు, మెరుగైన శిక్షణ, ఇతర సౌకర్యాలను కల్పించేందుకు రాష్ట్ర క్రికెట్ సంఘాలతో కలిసి సమగ్ర చర్యలు చేపట్టాలని నిర్ణయించింది.

చురకలు





# ప్రెగ్నెన్సీలోనూ తగ్గేదేలే..

## దీపిక మరో సినిమాకు ఓకే?

## 'రాకా', 'కింగ్' షూటింగ్స్ పూర్తి చేసినట్లు టాక్

**ముంబై, సెప్టెంబర్ 18 (చురకలు):** రెండోసారి తల్లి కాబోతున్న బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె సినిమాలకు మాత్రం విరామం ఇచ్చే ఆలోచనలో లేనట్లు బాలీవుడ్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. గర్భవతిగా ఉన్న సమయంలోనూ 'రాకా', 'కింగ్' చిత్రాల షూటింగుల్లో పాల్గొని తనకు సంబంధించిన సన్నివేశాలను ఇప్పటికే పూర్తి చేసినట్లు సమాచారం. ఇప్పుడు మరో పెండింగ్ ప్రాజెక్టును పట్టాలెక్కించేందుకు సిద్ధమవుతున్నట్లు సినీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఇటీవల 'స్పిరిట్', 'కల్కి-2' ప్రాజెక్టుల నుంచి దీపిక తప్పుకోవడం చర్చనీయాంశమైంది. 'స్పిరిట్' విషయంలో ఆమె పెట్టిన కొన్ని షరతులపై చిత్రబృందంతో విభేదాలు తలెత్తినట్లు అప్పట్లో ప్రచారం జరిగింది. 'కల్కి-2' నుంచి తప్పుకోవడంపైనా పలు కథనాలు వెలువడ్డాయి. అయితే ఈ ప్రచారంలోని అన్ని అంశాలపై దీపిక స్వయంగా వివరణ ఇవ్వలేదు.ఆ తర్వాత 'రాకా', 'కింగ్' చిత్రాలకు ఆమె కమిట్ అయినట్లు సమాచారం. రెండోసారి తల్లి కాబోతున్నట్లు వెల్లడైనప్పటికీ షూటింగులకు విరామం ఇవ్వకుండా తన పోర్షన్లు పూర్తి చేసినట్లు బాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. 'రాకా'లో కొన్ని యాక్షన్ సన్నివేశాలను కూడా చిత్రీకరించినట్లు ప్రచారం జరుగుతోంది. అట్లీ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమాకు సంబంధించిన అప్‌డేట్ వచ్చే అవకాశముందనే టాక్ వినిపిస్తోంది. 'కింగ్'లో షారుఖ్ ఖాన్‌తో దీపిక మరోసారి తెర పంచుకోనుండగా, ఆమె పాత్ర పరిమితంగానే ఉంటుందని సమాచారం. ఇదిలా ఉండగా హాలీవుడ్ కామెడీ డ్రామా 'ది ఇంటర్న్' హిందీ రీమేక్‌ను మళ్లీ పట్టాలెక్కించే ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్టుకు దీపిక దాదాపు ఆరేళ్ల క్రితమే అంగీకరించినప్పటికీ వివిధ కారణాలతో ముందుకు సాగలేదు. ఇప్పుడు మరోసారి ఈ సినిమాపై కదలిక మొదలైనట్లు బాలీవుడ్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ ప్రాజెక్టు కార్యరూపం దాల్చితే 'పీకూ' తర్వాత అమితాబ్ బచ్చన్, దీపికా పదుకొణె మరోసారి కలిసి నటించే అవకాశం ఉంటుంది. అయితే కొత్త ప్రాజెక్టు ప్రారంభం, షూటింగ్ తేదీలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

# రాకేష్ మాస్టర్‌ను తలచుకున్న ఉదయభాను

**హైదరాబాద్, సెప్టెంబరు 18 (చురకలు):** దివంగత నృత్య దర్శకుడు రాకేష్ మాస్టర్‌ను తలచుకుని ప్రముఖ యాంకర్ ఉదయభాను భావోద్వేగానికి గురయ్యారు. ఆయనతో తనకున్న సుదీర్ఘ అనుబంధాన్ని ఓ ఇంటర్వ్యూలో గుర్తుచేసుకున్నారు. రాకేష్ మాస్టర్ మరణవార్తను మొదట నమ్మలేదని, నిజమని తెలిసిన తర్వాత తీవ్రంగా బాధపడ్డానని తెలిపారు. తన కెరీర్ ప్రారంభంలో 'హోరాహోరీ' నృత్య కార్యక్రమం ద్వారా రాకేష్ మాస్టర్‌తో పరిచయం ఏర్పడిందని ఉదయభాను చెప్పారు. తనకు నృత్యంపై పెద్దగా అవగాహన లేని సమయంలోనూ 'నువ్వు ఈ స్టెప్ చేయగలవు' అంటూ ఆయన ఎంతో ధైర్యం ఇచ్చేవారని గుర్తుచేసుకున్నారు. రాకేష్ మాస్టర్ కేవలం నృత్య దర్శకుడు మాత్రమే కాదని, గొప్ప గురువని ఉదయభాను పేర్కొన్నారు. ప్రభుదేవా, శేఖర్ మాస్టర్, జానీ మాస్టర్ వంటి పలువురు ప్రముఖ నృత్య దర్శకులను తీర్చిదిద్దడంలో ఆయన కీలక పాత్ర పోషించారని తెలిపారు. తాను అనుకున్న విధంగా కళాకారులతో నృత్యం చేయించగల ప్రత్యేక ప్రతిభ ఆయన సొంతమని అన్నారు. అయితే జీవితంలో ఆయన తీసుకున్న కొన్ని నిర్ణయాలు, చుట్టూ ఉన్న పరిస్థితుల ప్రభావంతో చివరి రోజుల్లో పరిశ్రమకు, తనవారికి దూరం కావడం బాధాకరమని ఉదయభాను అన్నారు. ఇటీవల ఆయన ఆధ్వర్యంలో ఓ పాటలో నటించినప్పుడు పూర్తి ఉత్సాహంతో కనిపించారని గుర్తుచేసుకున్నారు. తెరపై తాను అనుకున్న ఫలితం వచ్చే వరకు నిద్రపోని పరిపూర్ణ గురువు రాకేష్ మాస్టర్ అని కొనియాడారు. రాకేష్ మాస్టర్ మరణం తర్వాత ఆయన శిష్యులు శేఖర్ మాస్టర్, జానీ మాస్టర్ కన్నీరు పెట్టుకున్న దృశ్యాలు తనను ఎంతో బాధించాయని ఉదయభాను చెప్పారు. ఎంతోమంది పేదలకు, అనాథలకు అన్నం పెట్టిన గొప్ప మనసున్న వ్యక్తి ఆయన అని గుర్తుచేసుకున్నారు. తనకు తెలిసినంతవరకు రాకేష్ మాస్టర్ ఎప్పుడూ తన పట్ల మంచిగానే ఉన్నారని, ఆయన జ్ఞాపకాలు ఎప్పటికీ నిలిచిపోతాయని ఉదయభాను పేర్కొన్నారు.



# 'పెద్ది'ని దాటి.. ఆస్కార్ బరిలో 'గొంధల్'!

## భారత్ అధికారిక ఎంట్రీగా మరాఠి చిత్రం

## 33 చిత్రాల నుంచి ఎంపిక చేసిన జ్యూరీ

## పోటీలో 'పెద్ది', 'హనుమాన్ అంశ్', 'ధురంధర్'

## సంతోష్ దవాఖర్ దర్శకత్వంలో థ్రిల్లర్

## మార్చి 14న 99వ ఆస్కార్ వేడుకలు




**ముంబై, సెప్టెంబర్ 18 (చురకలు):** ప్రతిష్ఠాత్మక 99వ అకాడమీ అవార్డులకు భారత్ తరఫున మరాఠి చిత్రం 'గొంధల్' అధికారిక ఎంట్రీగా ఎంపికైంది. సంతోష్ దవాఖర్ రచించి, దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని ఉత్తమ అంతర్జాతీయ ఫీచర్ ఫిల్మ్ విభాగానికి పంపుతున్నట్లు ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా శుక్రవారం ప్రకటించింది. దేశవ్యాప్తంగా పరిశీలనకు వచ్చిన 33 చిత్రాల నుంచి జ్యూరీ 'గొంధల్'ను ఎంపిక చేసింది. ఈ పోటీలో తెలుగు నుంచి 'పెద్ది', 'ఇరుముడి', 'సింగ్ గీతం', 'ఎగ్వా' సహా నాలుగు చిత్రాలు ఉన్నాయి. హిందీ నుంచి 'ధురంధర్', 'ధురంధర్: ది రివెంజ్', 'హనుమాన్ అంశ్', 'బోర్డర్--2', 'ఇక్కిస్' తదితర చిత్రాలు పరిశీలనకు వచ్చాయి. మొత్తం 33 చిత్రాలను పరిశీలించిన అనంతరం జ్యూరీ మరాఠి చిత్రం 'గొంధల్' వైపు మొగ్గుచూపింది.

## సంప్రదాయం నేపథ్యంలో థ్రిల్లర్

మహారాష్ట్రలోని సంప్రదాయ 'గొంధల్' ఆచారాన్ని నేపథ్యంగా చేసుకుని ఈ చిత్రాన్ని రూపొందించారు. సంగీతం, నృత్యం, పురాణ కథనాలతో రాత్రంతా సాగే సంప్రదాయ ప్రదర్శన చుట్టూ కథ నడుస్తుంది. పెళ్లి వేడుకతో మొదలయ్యే కథ క్రమంగా కోరికలు, అసూయ, ద్రోహం, గ్రామంలో దాగున్న సంఘర్షణలను వెలికితీసే థ్రిల్లర్‌గా మారుతుంది. కిశోర్ కదమ్, ఇషితా దేశ్‌ముఖ్, యోగేశ్ సోహోని, నిషాద్ భోయిర్, అనుజ్ ప్రభు ప్రధాన పాత్రల్లో నటించారు. దర్శకుడు సంతోష్ దవాఖర్‌కు ఇదే తొలి ఫీచర్ చిత్రం. గోవాలో జరిగిన అంతర్జాతీయ చలనచిత్రోత్సవంలోనూ 'గొంధల్' ప్రత్యేక గుర్తింపు పొందింది. దవాఖర్‌కు సిల్వర్ పీకాక్ పురస్కారం దక్కింది. అయితే భారత్ అధికారిక ఎంట్రీగా ఎంపిక కావడం ఆస్కార్ నామినేషన్ ఖరారైనట్లు కాదు. అంతర్జాతీయ ఫీచర్ విభాగంలో వివిధ దేశాల నుంచి వచ్చిన చిత్రాలను అకాడమీ పరిశీలించి ముందుగా 15 చిత్రాలతో షార్ట్‌లిస్ట్‌ను, అనంతరం తుది ఐదు నామినేషన్లను ప్రకటిస్తుంది. 99వ అకాడమీ అవార్డుల వేడుక 2027 మార్చి 14న లాస్ ఏంజెల్స్‌లోని డాల్బీ థియేటర్‌లో జరగనుంది.

# సౌందర్యను తలచుకుని ఆమని భావోద్వేగం





**హైదరాబాద్, సెప్టెంబరు 18 (చురకలు):** దివంగత నటి సౌందర్యతో తనకున్న అనుబంధాన్ని నటి ఆమని భావోద్వేగంతో గుర్తుచేసుకున్నారు. సౌందర్య తనకు కేవలం సహనటి మాత్రమే కాదని, జీవితంలో ఎంతో సన్నిహితమైన స్నేహితురాలని తెలిపారు. వ్యక్తిగత విషయాలను సైతం తనతో పంచుకునేదని, తామిద్దరం మంచి స్నేహితులమని చెప్పారు. షూటింగ్‌లు లేని సమయంలో సౌందర్య తనను ఇంటికి పిలిచేదని ఆమని గుర్తు చేసుకున్నారు. తాను స్వయంగా నిర్మిస్తున్న సినిమా చిత్రీకరణకు వచ్చి ప్రోత్సహించాలని కూడా సౌందర్యను కోరినట్లు తెలిపారు. అయితే ఆమె మరణవార్త తనను తీవ్రంగా కలచివేసిందన్నారు. ఆ వార్త విన్న సమయంలో తాను నమ్మలేకపోయానని, షూటింగ్‌లో ఉండగా విషయం తెలియగానే చేతులు వణికాయని, మాట కూడా రాలేదని ఆమని చెప్పారు. సౌందర్యను చివరిసారి చూసేందుకు వెంటనే వెళ్లలేకపోయానని, ఆ దుఃఖాన్ని తట్టుకోలేనని భావించి నెల రోజుల తర్వాత ఆమె ఇంటికి వెళ్లినట్లు తెలిపారు. అక్కడ సౌందర్య తల్లి మాత్రమే ఉన్నారని, హాల్‌లో సౌందర్య, ఆమె తండ్రి, తమ్ముడు అమర్ ఫొటోలు కనిపించాయని గుర్తుచేసుకున్నారు. ఇటీవల బెంగళూరులోని సౌందర్య ఇంటికి వెళ్లినప్పుడు అది నిర్మానుష్యంగా మారి ఉండటం చూసి ఎంతో బాధపడ్డానని ఆమని ఆవేదన వ్యక్తం చేశారు. సౌందర్య వ్యక్తిత్వం గురించి మాట్లాడుతూ.. తెరపై ఎంత అందంగా కనిపించేదో, నిజ జీవితంలో అంతకంటే గొప్ప మనసున్న వ్యక్తి అని ఆమని కొనియాడారు. క్రమశిక్షణతో జీవించడం సౌందర్యకు అలవాటని, తన తండ్రి మాటకు ఎంతో విలువ ఇచ్చేదని గుర్తుచేసుకున్నారు. చిన్నతనంలో తండ్రి స్వీట్లు తినొద్దంటే వాటిని కూడా మానేసేదని చెప్పారు. ఇదే సందర్భంగా కార్తికేయ, ప్రకాష్ రాజ్, నాగార్జున, కమల్ హాసన్, రోజా తదితరులతో కలిసి పనిచేసిన అనుభవాలను కూడా ఆమని పంచుకున్నారు. కార్తికేయ పెద్ద సంభాషణలను సైతం ఒకే ప్రయత్నంలో చెప్పడం చూసి తాను ఆశ్చర్యపోయానని తెలిపారు.

# వెయ్యి కోట్ల క్లబ్‌లో మమితా బైజు

**హైదరాబాద్, సెప్టెంబరు 18 (చురకలు):** వరుస విజయాలతో మలయాళ భామ మమితా బైజు తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు. గత ఆరు నెలల్లో ఆమె నటించిన సినిమాలు భారీ వసూళ్లు సాధించడంతో మొత్తం వెయ్యి కోట్ల మార్క్‌ను దాటినట్లు సమాచారం. దీంతో ప్రస్తుతం మమితా బైజు పేరు దక్షిణాది సినీ వర్గాల్లో మార్మోగుతోంది. ధనుష్‌తో కలిసి నటించిన 'కర' సినిమా పెద్దగా విజయాన్ని అందుకోకపోయినా రూ.50 కోట్లకు పైగా వసూళ్లు సాధించింది. ఆ తర్వాత ప్రదీప్ రంగనాథ్‌తో నటించిన 'డ్యూడ్' చిత్రం రూ.100 కోట్ల వసూళ్లు సాధించింది. విజయ్ నటించిన 'జననాయగన్' రూ.300 కోట్లు, ఇటీవల విడుదలైన మలయాళ చిత్రం 'బెత్లహోమ్ కుటుంబ యూనిట్' రూ.300 కోట్లు, సూర్య నటించిన 'విశ్వనాథ్ అండ్ సన్స్' రూ.260 కోట్ల వసూళ్లు సాధించినట్లు సమాచారం. ఇలా వరుస చిత్రాల విజయాలతో మమితా బైజు మార్కెట్ ఒక్కసారిగా పెరిగింది. ముఖ్యంగా ఆమె నటించిన మూడు చిత్రాలు వరుసగా రూ.200 కోట్లకు పైగా వసూళ్లు సాధించడం విశేషంగా మారింది. తక్కువ సమయంలోనే భారీ విజయాలు అందుకుంటూ మమితా బైజు తన కెరీర్‌లో దూసుకెళ్తున్నారు.



This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com